




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 18.09.2025 | సంపుటి :12 సంచిక : 60 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## ఈవీఎంపై అభ్యర్థుల ఫోటోలు

**కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఈవీఎం మిషిన్‌పై గుర్తులే కాకుండా అభ్యరథుల షోటోలు కూడా ఉండేలా చర్యలు చేపడతామని ఇసి తెలిపింది. ఓటర్లు కన్ఫ్యూజ్ అవుతూ కొన్ని సార్లు ఒకరికి వేయాల్సిన ఓటు- మరొక అభ్యర్థికి వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనుంచి ఆ కన్ఫ్యూజన్ కు తావు లేకుండా మరింత క్లారిటీగా ఈవీఎం మిషన్లను తయారు చేస్తున్నట్లు ప్రకటించింది. ఓటర్ ఫ్రెండ్లీగా ఉండేలా ఈవీఎంలను తయారు చేస్తున్న ట్లు- ఈసీ బుధవారం ప్రకటిం చింది. బ్యాలెట్ పేపర్ మరింత పెద్దదిగా ప్రింట్ చేయడంతో పాటు- అభ్యర్థుల కలర్ ఫోటోను కూడా

మిగతా 2లో..



# ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది

- ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనది
- దాని స్ఫూర్తి ఆధారంగానే తెలంగాణ పోరాటం
- సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది

- విద్యారంగంలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నాం
- డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు
- కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీపడేది లేదు
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్
- అమరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి ఘన నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్17(జనంసాక్షి): ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటం మనది. సాయుధ పోరాటస్ఫూర్తితో నిన్నటి నియంత పాలనను పక్కనపెట్టాం అని అన్నారు. పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. బంధుప్రీతి,

మిగతా 2లో..



"పేదల ఆత్మగౌరవం పెంచేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. హైదరాబాద్‌ను గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మనరాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి. కృష్ణానదీ జలాల్లో న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్నాం. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరి ష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడు గు వేసేది లేదు. గంజాయి, డ్రగ్స్ అరికట్టడంలో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. రాష్ట్రంలో వాటి ఆనవాళ్లే ఉండకూడదు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నాం. భావితరాలకు విజన్ డాక్యుమెంట్ ఇవ్వాలనేదే మా ప్రయత్నం. డిసెంబరు 9న రాష్ట్ర ప్రజలకు అందిస్తాం. ఇది రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చబోతోంది. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం.

– ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి,

## తెలంగాణ విద్యావిధానం దేశానికి దిక్సూచి కావాలి

భారీగా నిధులు కేటాయిస్తున్నా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది

- సిలబస్, వనరులసమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం
- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడలు మేళవింపుతో ఉండాలి
- విజన్ డాక్యుమెంట్ 2047లో విద్యా విధానానికి ప్రత్యేక అధ్యాయం
- విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం
- అధికారులు, విద్యావేత్తలతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

2లో..

## హాలీవుడ్ స్థాయికి హైదరాబాద్

సినీ కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు చెప్పా : సీఎం రేవంత్‌రెడ్డి

2లో..



## జాతీయ సమగ్రతను కాపాడండి

**భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తోంది**
**ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు బుద్ధి చెప్పాం**
**కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్**

హైదరాబాద్(జనంసాక్షి): నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి

మిగతా 2లో..

## పాక్ అణు బెదిరింపులకు తలొగ్గం

**ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ సత్తా చాటాం**

**మధ్యప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోడీ**



9లో..

## గ్రూప్-1పై డివిజన్ బెంచ్‌లో టీజీపీఎస్సీ సవాల్






హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్ 1 అంశంపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీజీపీఎస్సీ ఆశ్రయించింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. గ్రూప్ 1 ఫలితాలు, ర్యాంకులు రద్దు చేస్తూ ఈ నెల 9న హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి మార్చి 10న విడుదల చేసిన ఫలితాలను, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకులను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ నెల 9న సంచలన తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల్లో... టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లను ఇచ్చింది. "మెయిన్స్ జవాబు పత్రాల ను పునర్ మూల్యాంకనం చేయాలి. సంజయ్‌సింగ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం మాన్యువల్(సాధారణ పద్ధతి)గా మూల్యాంకనం చేసి, ఆ ఫలితాల ఆధారంగా 563 పోస్టులను భర్తీ చేయాలి. లేదంటే... 2024 అక్టోబరు 21 నుంచి 27 మధ్య జరిగిన మెయిన్స్‌ను రద్దు చేసి, పరీక్షలను తిరిగి నిర్వహించాలి. ఈ ప్రక్రియను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలి" అని హైకోర్టు స్పష్టంచేసింది. ఈక్రమంలో సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.



**గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన వారిపై**

## నిందలు అన్యాయం

**మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం త్వరలో ముగిసిపోతుందని మంత్రి శ్రీధంబాబు అన్నారు. ప్రజా పాలన వేడుకల్లో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం స్పీకర్ పరిధిలో ఉందన్నారు. అఫిడవిట్లలో ఎమ్మెల్యేలు అన్ని విషయాలూ వెల్లడించారని చెప్పారు. టీజీపీఎస్సీ

మిగతా 2లో..

## బీజేపీకి చరిత్ర తెలియదు

- నెహ్రూ ఆదేశాలతోనే హైదరాబాద్ సంస్థానాన్ని పటేల్ దేశంలో విలీనం చేశారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ విలీనం దినోత్సవం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ రోజున స్మరించుకోవాల్సిన అవసరం ఉందని

మిగతా 2లో..



## హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

**నగరంలో మరోసారి భారీ వర్షం.. వాహనదారుల ఇక్కట్లు**



2లో..

## భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలి

- అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. చాలా చోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయని, ట్రాఫిక్‌కు అంతరాయం ఉన్నచోట్ల వెంటనే పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాలు తగిన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.




## అవసరమైనపుడు జనంలోకి కేసీఆర్

**గ్రూప్ 1 నియామక ప్రక్రియపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలి**

**పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకల్లా ఉంది: కేటీఆర్**

హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. గ్రూప్ 1 అభ్యర్థులు సమావేశం కూడా పెట్టుకోలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని మండిపడ్డారు. "నాపై కోపంతో సిరిసిల్ల నేతన్నల పొట్ట కొట్టారు. చేనేత పరిశ్రమను అతలకుతలం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి కుడితిలో పడిన ఎలుకల్లా ఉంది. పాలన అద్భుతంగా ఉందనుకుంటే వెంటనే ఉప ఎన్నికలు పెట్టండి. ఉప ఎన్నికలు పెడితే పాలన ఎలా ఉందో తేలిపోతుంది. గ్రూప్ 1 నియామక ప్రక్రియపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలి. ఉద్యోగాల కోసం మంత్రి డబ్బులడిగారని అభ్యర్థులే చెబుతున్నారు. సమాధానం చెప్పాల్సింది పోయి మాపై ఉసిగొల్పితే ఎలా?" అన్నారు. "మంత్రులకు తెలియకుండా

మిగతా 2లో..

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

**ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి**

ముంబై(జనంసాక్షి): మహారాష్ట్రలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గడ్చిరోలి దండకారణ్యంలో భద్రత బలగాలు, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఎటపల్లి తాలూకాలో మోదస్కే గ్రామాన్ని ఆనుకుని ఉన్న అడవిలో మావోయిస్టుల గట్టా లాస్ సభ్యులు ఉన్నారనిపోలీసులకు సమాచారం అందింది.. అప్రమత్తమైన భద్రతబలగాలు, పోలీసులు కూంబింగ్ నిర్వహించాయి. గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక యాంటీ-నక్సల్ కమాండో స్క్వాడ్ సీ60 ఐదు యూనిట్లతో పాటు-, అహేరి నుంచి సీఆర్పీఎఫ్ బృందం వెంటనే సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ఈక్రమంలో మావోయిస్టులు వారిపై

మిగతా 2లో..



## యూరియా సరఫరాలో కేంద్రానికి ముందుచూపులేదు

**దేశీయంగా ఉత్పత్తి లేక విదేశాలపై ఆధారపడ్డాం : మంత్రి తుమ్మల**



హైదరాబాద్(జనంసాక్షి): యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సరైన ముందుచూపు లేదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వం పై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో యూరియా ఉత్పత్తి తక్కువగా ఉందని, దానివల్ల యూరియా కోసం చైనా, జపాన్, జర్మనీ వంటి ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన అన్నారు. దేశంలో కేవలం 30 శాతం మాత్రమే యూరియా ఉత్పత్తి అవుతుందని, మిగిలిన 70 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతుందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది రామగుండం, నాగార్జున వంటి ఎరువుల కర్మాగారాలు పనిచేయకపోవడంతో ఉత్పత్తి మరింత తగ్గిందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రష్యా నుంచి రావలసిన యూరియా రాలేదని, యూ రప్ నుండి రావాల్సిన యూరియా ఎర్ర సముద్రం ద్వారా రావాలి కానీ, యుద్ధం కారణంగా ఎర్ర సముద్రం వద్ద నౌకలను నిలిపివేశారని కేంద్ర అధికారులు తమకు చెప్పారని ఆయన వివరించారు. దీనివల్ల నౌకలు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని, అందువల్ల రెండు మూడు నెలల పాటు- యూరియా రాక ఆలస్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ ఏడాది -టె-ండర్లు కూడా చాలా ఆలస్యమయ్యాయని, చైనా నుంచి ఒక్క బస్తా యూరియా కూడా రాలేదని అన్నారు. తెలంగాణకు 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, కేవలం 7 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న యూరియా మొత్తాన్ని ఈ నెలలోనే ఇవ్వాలని కేంద్ర మంత్రులను కలిసి కోరామని ఆయన చెప్పారు. ఇందుకు స్పందించిన

మిగతా 2లో..



## పంట వ్యర్థాలను తగలబెడితే జైలుకే..

**కొందరినైనా శిక్షిస్తే మిగితా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టవుతుంది**

**సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి): పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై తాజాగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇందుకు పాల్పడుతున్న కొంతమందినైనా జైలుకు పంపితేనే మిగితా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టవుతుందని వ్యాఖ్యానించింది.

మిగతా 2లో..

## ప్రపంచ ఉద్యమాల చరిత్రలో.. సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ

# ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది

ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావులేదు. స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్‌మోడల్‌గా ఉన్నాం. ఉన్నత చదువుల ద్వారా మన యువత సత్తా చాటాలి. భవిష్యత్తులో పాఠశాలల రూపురేఖలు మారబోతున్నాయి. విద్యతో పాటు-క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలో రాష్ట్ర విద్యా విధానం తెస్తున్నాం అని అన్నారు. సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి సత్తాచాటారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు ఏర్పాటు చేస్తాం. రైతుల కోసం తెచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా వారికి మేలు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించాం. సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. మా ప్రభుత్వం వచ్చాక భూభారతి చట్టం తెచ్చి సమర్థంగా అమలు చేస్తున్నాం. పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం. 904 టీఎంసీల సాధనకుట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపిస్తాం. కృష్ణా జలాల హక్కుల కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేసేది లేదన్నారు. హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. ఈ నగరాన్ని గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మన రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి. హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకొస్తున్నాం. కాలుష్యం లేని నగరంగా మారుస్తున్నాం. మూసీ నది పక్కన జీవించే పేదలకు మంచి జీవన ప్రమాణాలు కల్పిస్తాం. ఈ పరిధిలో ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తాం. ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా అనేక అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం అని అన్నారు. త్వరలోనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తాం. తెలంగాణ అంటేనే పోరాటాలు, త్యాగాలకు వేదిక. యువత పాలిట శాపంగా మారిన డ్రగ్స్ సమస్యను అరికడతాం. మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి. వీటిని అరికట్టడంలో మన పోలీసులు సత్తా చాటారు. రీజినల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది 1948, సెప్టెంబర్ 17... ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకను ఎగుర వేసిన రోజు.. ఈ గడ్డపై రాచరికానికి గోరీ కట్టి... ప్రజా పాలనకు హారతి పట్టిన రోజు సెప్టెంబర్ 17.. అందుకే ఇది ప్రజా పాలన దినోత్సవం.. రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛ మన జీవన విధానం.. ఆ స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి మనది.. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను.. సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి.. అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరోమైలు రాయి.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానం తిరిగి మళ్లీ నియంతృత్వ నిర్బంధంలోకి జారి పోయిన తీరు గడచిన పదేళ్లలో మనం చూశాం.. నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి, ప్రజా పాలనను తెచ్చుకున్నాం అని అన్నారు. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఇక్కడ ఉద్భవించిన ఉద్యమాల సరళిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని మేం ఈ రోజు పరిపాలన చేస్తున్నాం.. అహంకారపు ఆలోచనలు, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు.. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నామన్నారు.





# తెలంగాణ విద్యావిధానం దేశానికి దిక్సూచి కావాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని.. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు సీఎం తెలిపారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సీఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం లేదన్నారు. విద్యార్థుల రాకపోకలు, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ రకమైన ధీమా కల్పించగల్గితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చుతారని.. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు చేశామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని సీఎం తెలిపారు.

# హాలీవుడ్ స్థాయికి హైదరాబాద్

### సినీ కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు చెప్పా: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు సీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..." ప్రభుత్వం నుంచి కార్మికులకు ఏం కావాలో చర్చించుకుని చెప్పాలి. సినిమా కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు చెప్పా. స్కిల్ యూనివర్సిటీలో సినిమా కార్మికులకు శిక్షణ ఇస్తాం. అన్ని భాషల చిత్రాలు తెలంగాణలో షూటింగ్ జరిగేలా సహకరించాలి. చిన్న సినిమా నిర్మాతలకు సహకరించాలి. సమ్మెలకు పోతే రెండు వైపులా నష్టం జరుగుతుంది. సమస్యను సమస్యగానే చూస్తా.. వ్యక్తిగత పరిచయాలను చూసుకోను. సినిమా కార్మికుల తరఫున నిర్మాతలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది. ఈ ప్రభుత్వం మీది.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది. నేను కార్మికుల వైపు ఉంటా.. రాష్ట్ర ప్రయోజనాలు కూడా ముఖ్యం. సినిమా కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ అందజేసే ప్రయత్నం చేస్తాం. గత పదేళ్లు సినిమా వాళ్లకు అవార్డులు కూడా ఇవ్వలేదు" అని సీఎం అన్నారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి చరిత్ర తెలియదు..

చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావు వంటి మహనీయులను, నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు. బీజేపీ పాత్రపై స్పందిస్తూ...ఆ పార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్ర్యం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని ఎద్దేవా చేశారు. "ఇది పాత బీజేపీ కూడా కాదు.. 2014లో పుట్టిన మోడీ-షా బీజేపీ. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా" ప్రయాసగా అభివర్ణించారు. 1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం "ఆపరేషన్ పోలో" ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆయన చేసిన విలీనాన్ని "విమోచన"గా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల సంఘాన్ని లొంగదీసుకుని మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న "ఓటు చోరీ ఉద్యమం" బీజేపీ గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ త్యాగస్వరూపమని, స్వాతంత్ర్యం కోసం అనేక మంది నాయకులు జైలు పాలయ్యారని... సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రధాని అయ్యే అవకాశమున్నా ఆర్థిక నిపుణుడు డా. మన్మోహన్ సింగ్‌ను రెండుసార్లు ప్రధాని చేశారు అనేది కాంగ్రెస్ త్యాగానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అద్భుతమైన ప్రజా పాలన కొనసాగుతోందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నుంచి సన్నబియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# యూరియా సరఫరాలో కేంద్రానికి ముందుచూపులేదు

కేంద్ర ప్రభుత్వం వారం రోజుల్లో 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అలాగే, రాబోయే రబీ కాలానికి అవసరమైన యూరియాను కూడా ముందుగానే ఇవ్వాలని కోరామన్నారు. తెలంగాణలోని యూరియా కంపెనీలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని, తద్వారా రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యూరియా కొరతను అధిగమించేందుకు నానో యూరియా లిక్విడ్ రూపంలో అందుబాటులోకి వచ్చిందని, ఇది సాధారణ యూరియా కంటే బాగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భవిష్యత్తులో రైతులు నానో యూరియాను ప్రత్యామ్నాయంగా అలవాటు- చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పెద్ద ఎత్తున డ్రోన్‌లను కూడా సరఫరా చేయాలని చూస్తున్నామని, అంతేకాకుండా, సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఈవీఎంపై అభ్యర్థుల ఫోటోలు

ముద్రించనున్నట్లు- పేర్కొంది. ఈ మార్పులను బీహార్ ఎన్నికల నుంచి ప్రారంభిస్తున్నట్లు- చెప్పింది. ఎన్నికల నియమావళి, 1961 లోని రూల్ 49ఇ నింబంధనలను మారుస్తూ.. అభ్యర్థుల ఫోటోలను పెద్దసైజులో.. కలర్ లో ప్రింట్ చేయనున్నట్లు- ప్రకటించింది. ఇంతకు మందు లేయౌట్ బ్లాక్ అండ్ వైట్ లో ఉండేది. ఫోటోలు చిన్నవిగా అస్పష్టంగా ఉండేవి. ఇప్పుడు ఓటర్లకు ఎలంటి కన్ఫ్యూజన్ లేకుండా ఉండేందుకు ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు- పేర్కొంది. అదే విధంగా సీరియల్ నెంబర్ కూడా చాలా స్పష్టంగా ఇవ్వనున్నట్లు- పేర్కొంది. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం.. ఈవీఎం బ్యాలెట్ పేపర్లపై కేవలం క్యాండిడేట్స్ డీటైల్స్ ఉంటే సరిపోయేవి. అంటే అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు , సీరియల్ నెంబర్, చిన్న ఫోటో (బ్లాక్ అండ్ వైట్ లో) ఉండేది. మార్చిన నిబంధనల ప్రకారం.. బ్యాలట్ కు సంబంధించి డిజైన్, లేయౌట్ పూర్తిగా ఓటర్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నట్లు- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ బూత్ లలో ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. ఇప్పటికే గత ఆరు నెలల్లో ఎన్నికలకు సంబంధించి 28 మార్పులు తీసుకొచ్చినట్లు- చెప్పిన ఈసీ.. ఎన్నికల సరళిని సులభతరం చేసేందుకు నిబంధనలు మార్చుతున్నట్లు- పేర్కొంది. అభ్యర్థుల పేర్లతో పాటు- నోటా కూడా ఒకే ఫాంట్ లో.. లార్జ్ సైజ్ లో ప్రింట్ అవుతుందని తెలిపింది.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

- **నగరంలో మరోసారి భారీ వర్షం**
- **వాహనదారుల ఇక్కట్లు**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, సనత్‌నగర్, కృష్ణానగర్, మియాపూర్, చందనాగర్, మాదాపూర్, రాయదుర్గం, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. యూసుఫ్‌గూడా కృష్ణానగర్ బి బ్లాక్‌లో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాదాపూర్‌లో భారీ వర్షంతో ట్రాఫిక్ జామ్ అయింది. అమీర్‌పేట, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ఉద్యోగులు ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, పంజాగుట్ట, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వరద నీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు- పడ్డారు. మరోవైపు గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనాలు బారులుతీరాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో మరో మూడు, నాలుగు రోజులపాటు- వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ , జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అలాగే మిగిలిన జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్ గిరి, రంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## హైదరాబాద్, వరంగల్‌లో ఐటీ సోదాలు..

### బంగారం దుకాణదారులే లక్ష్యంగా దాడులు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో పలుచోట్ల ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 10, సికింద్రాబాద్‌లో తనిఖీలు చేస్తున్నారు. వరంగల్‌లోనూ ఐటీ బృందాలు సోదాలు చేస్తున్నాయి. బంగారం దుకాణదారులే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులోని ఆచారీవీధిలో ఐటీ అధికారులు సోదాలు చేశారు. జ్యువెలరీ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. వ్యాపారి నివాసంలోనూ తనిఖీలు చేశారు. హైదరాబాద్‌లోని వాసవి రియల్ ఎస్టేట్ సంస్థలో ఐటీ సోదాలు చేస్తున్నారు. సంస్థ కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

### గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన వారిపై

## నిందలు అన్యాయం

చిత్తశుద్ధితో ముందుకెళ్తోందన్న ఆయన.. గ్రూప్ 1 పరీక్షల్లో ఎలాం టి అక్రమాలు జరగలేదని పునరుద్ఘాటించారు. ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులపై నిందలు వేయడం అన్యాయమన్నారు.

# పంట వ్యర్థాలను తగలబెడితే జైలుకే..

- **కొందరినైనా శిక్షిస్తే మిగితా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టవుతుంది**
- **సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు**

రైతులు మనకు అన్నం పెడుతున్నారని, అయితే దాని అర్థం పర్యావరణాన్ని పాడు చేస్తుంటే సైలెంట్‌గా చూస్తూ ఉండమని కాదని సీజేఐ బీఆర్ గవాయ్ అన్నారు. పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్టు కోర్టుకు అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ తెలిపారు. అయితే ఉపగ్రహాలు ఆయా ప్రాంతాల్లో వెళ్తున్నప్పుడు కాకుండా మిగిలిన సమయాల్లో పంట వ్యర్థాలను కాల్చుకోవచ్చని అధికారులు తమకు చెప్పినట్టు- రైతులు పదేపదే చెబుతున్నారని, దీనిపై ఎన్నిసార్లు ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం ఉండటం లేదని విన్నవించారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కొందరినైనా జైలుకు పంపితేనే తక్కినవారికి సరైన సందేశం వెళుతుందన్నారు. రైతులపై జరిమానా విధించే ఆలోచన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పర్యావరణాన్ని పరరిక్షించాలనే నిజమైన ఉద్దేశమే ఉంటే మీరెందుకు ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని నిలదీశారు. వ్యర్థ పదార్థాలను తగులబెట్టేందుకు బయోఫ్యూయెల్స్ వాడుతున్నట్టు- కూడా వార్తలు వస్తున్నాయని సీజేఐ అన్నారు. రైతులు ప్రత్యేకమైన వారే, వాళ్ల వల్లే మనకు అన్నం దొరుకుతుంది. అలాగని పర్యావరణాన్ని పాడుచేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా? అని ప్రశ్నించారు. కొన్ని రాష్ట్రాల్లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల్లో ఖాళీలు ఉండటంపైనా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. మూడు నెలల్లోగా అన్ని ఖాళీలను భర్తీ చేయాలని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ-మేనేజిమెంట్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రతి ఏడాది శీతాకాలంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంటోంది. పొల్యూషన్‌కు పంట వ్యర్థాలను తగులబెట్టడం ప్రధాన కారణంగా గుర్తించారు.

## జాతీయ సమగ్రతను కాపాడండి

మాట్లాడారు. నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారు. వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్ల హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసింది. ఆపరేషన్ పోలో దేశ చరిత్రలో గొప్ప ఘట్టం. పటేల్ ముందు నిజాం తన ఓటమిని ఒప్పుకొన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తాం. జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటు-న్నారు. ఆర్టికల్ 370ని తొలగించి జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి చేస్తున్నాం. మనలో ఎన్ని విభేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాట. దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలమంతా ఏకతాటిపైకి వస్తాం. ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు. ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్నాం అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు సత్తా చాటారు. ఉగ్రవాది మసూద్ అజార్ కుటుంబ సభ్యులను హతమార్చాం. పహల్గాంలో మతం పేరు అడిగి మరీ చంపిన వారికి బుద్ధి చెప్పాం. ఆపరేషన్ సిందూర్‌లో భారత శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసింది. ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చాం. ఆపరేషన్ సింధూర్ ముగియలేదు. ఇప్పుడు చిన్న పాజ్ మాత్రమే. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని రాజ్‌నాథ్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి రాజ్ నాథ్ సింగ్ నివాళులర్పించారు. పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు భారత్ ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని, ఆర్టికల్ 370 తొలగించి జమ్ముకశ్మీర్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. మనలో ఎన్ని భేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాటని, దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలంతా ఒక్కతాటికిపైకి వస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ తో భారత్ శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసిందని ప్రశంసించారు. ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చామని గర్వాన్ని వ్యక్తం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని తెలుసుకోవాలని, ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదని అన్నారు

## జీఎస్టీ సంస్కరణలతో పేద,మధ్యతరగతికి

# ఉపశమనం

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**విశాఖపట్నం(జనంసాక్షి):** దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే విధంగా జీఎస్టీపై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయరంగానికి ఎంతో మేలు చేకూర నుందని అన్నారు. రైతులకు మేలు చేసే విషయంలో నష్టమైనా ఫర్వాలేదని ప్రధాని మోడీ పట్టు బట్టారని అన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ అని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్‌కిన్స్‌పై పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపు దారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరిందని నిర్మలా సీతారామన్ వివరించారు. ఇప్పటికే అనేక రంగాల్లో జిఎస్టి ప్రయోజనాలు చేకూరాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జిఎస్టి స్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించామని అన్నారు. అన్నింటినీ కలిపి ఒకే పన్ను, నాలుగు స్లాబ్ లుగా తీసుకొచ్చిందే జిఎస్టి అని తెలియజేశారు. 2017 కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేదని, 2017 కు ముందు 65 లక్షల మంది పన్ను చెల్లించే వారని అన్నారు. ఈ 8 ఏళ్లలో పన్ను చెల్లింపు దారులు 1.51 కోట్లకు చేరారని, 2018 లో జిఎస్టి ద్వారా రూ. 7.19 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని కొనియాడారు. 2025 లో జిఎస్టి ద్వారా రూ. 22.08 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని అన్నారు.

## అసరమైనపుడు జనంలోకి కేసీఆర్

కాళేశ్వరం కేసును సీఎం సీబీఐకి ఇచ్చారు. కాంగ్రెస్, భాజపా మధ్య ఎంత మంచి అవగాహన ఉందో తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంలో బంధుప్రీతి లేదని అంటున్నారు.. సుజన్ రెడ్డి, అమిత్ రెడ్డికి వందల కోట్ల కాంట్రాక్టులు ఎలా వచ్చాయి? కోర్టు తుది తీర్పువచ్చేదాక అజారుద్దీన్ ఎమ్మెల్సీ కాలేరు. అజారుద్దీన్ క్రికెట్‌లో బాగా కట్‌లు కొట్టేవారు. ఇప్పుడు అజారుద్దీన్‌కే పెద్ద కట్ కొట్టారు. ప్రస్తుతం ఆయన త్రిశంకు స్వర్గంలో మిగిలిపోయారు. జనంలోకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు తెలుసు. సరైన సమయంలో ప్రజల్లోకి వస్తారు" అని అన్నారు. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ఏడు సర్వేలు చేయించాం. ఆ సర్వేలన్నింటిల్లోనూ భారత రాష్ట్ర సమితి గెలుస్తుందని తేలింది. కాంగ్రెస్ చేపట్టిన మూడు సర్వేల్లోనూ మేమే గెలుస్తామని వచ్చింది. ట్రిపుల్ ఆర్ విషయంలో భారీ కుంభకోణం జరుగుతోంది. సీఎం బంధువుల కోసం దక్షిణ భాగం అలైన్‌మెంట్ మారుస్తున్నారు. ఈ కుంభకోణంపై త్వరలో అన్ని వివరాలు బయటపెడతా" అని కేటీఆర్ తెలిపారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈఘట నలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. వారి వద్ద నుంచి ఆటోమేటిక్ ఏకే 47 రైఫిల్ సహా పెద్ద ఎత్తున ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈప్రాం తంలో నక్సల్ వ్యతిరేక కూంబింగ్ కార్యకలా పాలు ఇంకా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# పోరాటం కమ్యూనిస్టులదైతే ఆర్భాటం బీజేపీకెందుకు?

- సీపీఎం జాతీయ నాయకురాలు,మాజీ ఎంపీ బృందా కారత్




సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) : కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో బీజేపీకి ఏమిటీ సంబంధమని, మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని సీపీఎం జాతీయ నాయకురాలు, మాజీ ఎంపీ బృందాకరత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఎం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవాలు వక్రీకరణలు అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.వీరోచిత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మచ్చుకైనా కనిపించని వారు వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.విస్నూర్ రామచంద్రారెడ్డి, ఎర్రపహాడ్ దొరలు, భూస్వాములు, జాగిర్దారులు నిజాం సైన్యంలో అత్యధికలు తెలంగాణ గడ్డలోని మట్టి మనుషులను నానా హింసలు పెట్టారని,దోపిడీ చేశారని చెప్పారు.విసునూర్ రామచంద్రారెడ్డిది ఏ మతమని ప్రశ్నించారు.అది హిందూ, ముస్లింల పోరాటం కాదని, దోపిడీ చేసిన దోపిడీదారులు, దోపిడీకి గురైన పేదలు కూడా హిందువులేనని చెప్పారు.దోపిడి, పీడనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అని చెప్పారు.నైజాం,రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో ఈ గడ్డ మీద పుట్టిన మైనార్టీలైన ముస్లింలు ప్రాణ త్యాగాలు చేశారని చెప్పారు. ముగ్దుమ్ మోహినుద్దీన్, అలంకుంద్ మీరి కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించారని, షోయబుల్లాఖాన్ సీనియర్ జర్నలిస్టుగా ఇమ్రేజ్ అనే పత్రిక నడిపించి నైజాం నిరంకుశ చర్యలను ఎండగడుతూ కథనాలు రాసారని, నిలబెట్టి కాళ్లు చేతులు నరికి కాచిగూడ రైల్వే స్టేషన్ లో చిత్రహింసలు పెట్టింది రజాకారులు కాదా అని ప్రశ్నించారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసి గ్రామ రాజ్య కమిటీలు ఏర్పాటు చేసి 10లక్షల ఎకరాల భూములు పంచి 4వేల మంది అమరులైన వీరోచిత పోరాట గాధ అని కొనియాడారు.కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని ఈ తరానికి అందించకుండా దానికి మతం రంగు పులిమి యువతరాన్ని తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్ర వారసులు ముమ్మాటికి కమ్యూనిస్టులేనని చెప్పారు.కులం మత ఉన్మాదాలను తలనాడి పీడిత వర్గాన్ని ఏకం చేసిన వర్గ పోరాటం వీర తెలంగాణ సాయుధ పోరాటమని అన్నారు. ఈ పోరాటం ద్వారా భూసంస్కరణ చట్టం, రక్షిత కౌలుదారి చట్టం ఏర్పడిందన్నారు. నేడు దళితులకు అసైన్డ్ భూములు ఇచ్చినప్పటికీ అవి వారి చేతుల్లో లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అసైన్డ్ భూములు ఉన్న దళితులందరికీ తక్షణమే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.మహోన్నత చరిత్ర గురించి మతోన్మాదులకు మాట్లాడే అర్హత లేదని విమర్శించారు.మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి బీజేపీ మతం రంగు పూస్తుందన్నారు.దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి అంతం చేయాలని జరిగిన మహత్తర పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని అన్నారు. కెసిఆర్ కాలంలో జరిగిన తెలంగాణ పోరాటం, కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటం ఒకటి కాదన్నారు.నాటి పోరాటం ప్రపంచ చరిత్ర పుటల్లో సజీవంగా నిలుస్తుందన్నారు.ఆ పోరాటం అనేక రకాల పన్నులు రద్దు చేసిందని చెప్పారు.వీరోచిత త్యాగాలు చేసిన అనేకమంది కమ్యూనిస్టు యోధుల ఆశయాలు కొనసాగించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. అంతకుముందు సూర్యాపేట పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఆశలత,రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, పారేపల్లి శేఖర్ రావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన అవినీతి చేపలు

- చేవెళ్ల విద్యుత్ ఏడీ రాజేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు
- ఇంట్లోని బాత్రూమ్‌లో 20 లక్షలు లభ్యం



చేవెళ్ల/ఖమ్మం, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) చేవెళ్ల విద్యుత్ ఏడీ రాజేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించారు. ఏడీఈ అంబేద్కర్‌కు బినామీగా ఉన్న రాజేష్ రాజేష్ ఇంట్లోని బాత్రూమ్‌లో 20 లక్షలు లభ్యం రాజేష్ ఇంటి మొత్తాన్ని తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు. ఏడీఈ అంబేద్కర్ బినామీల ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. చేవెళ్ల మండలంలోని గ్రామాలలోని రైతుల దగ్గర ట్రాన్స్ ఫార్మ్ కోసం 5 లక్షల నుండి 10 లక్షల వరకు డిమాండ్ చేశారని రైతులు తెలిపారు.

### ఎసిబికి చిక్కిన తహసిల్ ఉద్యోగులు

మరో ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలానికి చెందిన తహసీల్దార్‌తో పాటు- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డాటా ఎంట్రీ- ఆపరేటర్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ తహసీల్ కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం తల్లాడ తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడిని అక్కడి అధికారులు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం తహసీల్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేషర్ శివాజీ రాథోడ్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టు-బడ్డాడు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాలోత్ భాస్కర్‌రావును ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వీరిని వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండ సురేఖ
- నగర మేయర్, జిల్లా కలెక్టర్, సిపి, లతో కలసి ఏర్పాట్ల పై సమీక్షించిన మంత్రి....



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) : బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామాత్యులు కొండ సురేఖ అధికారులను ఆదేశించారు.బుధవారం కరిమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో జిల్లాకలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో రంగలీల మైదానం (ఉర్సు గుట్ట) కరీమాబాద్ ప్రాంతం లో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భం గా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ గుండు సుధారాణి నగర పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డా సత్య శారద, బల్దియా కమీషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలసి సమీక్షించి సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని,ఆయా పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉర్స్ తో పాటు కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్ లలో కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి సలీమా, డిఆర్ ఓ విజయలక్ష్మి, పోలీస్, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి ప్రభాకర్ రావు, ఏసీపీ శుభం ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఇరిగేషన్, డిడబ్ల్యూ ఓ, ఎన్పీడీసీఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, తదితర శాఖల అధికారులు, కార్పొరేటర్ ప్రవీణ్ ఉర్స్, కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు నాగపురి సంజయ్ బాబు మేడిది మధుసూదన్ మండ వెంకన్న వంగరి కోటేశ్వర్ గోనె రాంప్రసాద్, రాంమూర్తి సందీప్,బయ్యా స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఆరోగ్య శిబిరాల సేవలను వినియోగించుకోండి

- తల్లుల ఖాతాల్లో రూ.19 వేల కోట్లు జమ
- హైదరాబాద్ లో కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.19 వేల కోట్ల నగదును జమ చేసినట్లు తెలిపారు. అమీర్ పేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహాలతో కలిసి బండి సంజయ్ ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా వీక్షించారు. ఈ సందర్భంగా అమీర్ పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" శిబిరాలను కిషన్ రెడ్డి, రాజనర్సింహాలతో కలిసి బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" పేరిట 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహించబోతున్నాం. దీంతోపాటు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోషణ మాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తాం." అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అఖిల్ భారతీయ తెరాపంథ్ యువక్ పరిషద్ వంటి సంస్థలతో కలిసి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించాలి. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జాతీయ మెగా స్వచ్ఛంద రక్తదాన డ్రైవ్ నిర్వహించి 1 లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించాలని కేంద్ర ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ -రక్తోష్‌లో దాతలను నమోదు చేయడం, మై గౌట్ ద్వారా రక్తదానం/ అవయవదానం ప్రమాణపత్రాల పంపిణీ చేస్తారు."అని వివరించారు. ప్రైవేట్ రంగ ఆసుపత్రులు కూడా ఈ అభియాన్లో భాగస్వామ్యం కావాలని కోరారు. పోషణ మాసంలో భాగంగా సెప్టెంబర్ నెలను పోషణ్ మాసంగా కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. తల్లి, యవత, శిశు పోషణపై పలు కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ అభియాన్ ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ

- తెలంగాణ రాజ్యసాధన పార్టీగా నామకరణం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) : తెలంగాణలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ కొత్త రాజకీయ పార్టీని పెట్టారు. తన పార్టీకి తెలంగాణ రాజ్యసాధన పార్టీగానామకరణం చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కొత్త రాజకీయ పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించారు. తీన్మార్ మల్లన్న పార్టీ జెండాను రెండు రంగులతో ప్రత్యేకంగా రూపొందించారు. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీ అయిన తీన్మార్ మల్లన్న ఆ తర్వాత పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు- పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. బీసీ కులగణన సర్వేపై అనుచిత వ్యాఖ్యలు, పార్టీ విధానాలు ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడినట్లు- కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. దీంతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ- ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే మల్లన్న నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో మే 1న కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన్ని సస్పెండ్ చేశారు. ఈ మేరకు బీసీ భావజాలాన్ని ప్రజల్లోకి మల్లన్న బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రకటించారు. అయితే ఈ పార్టీ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషిస్తుందో వేచి చూడాల్సిందే.

# కోల్‌ఇండియా చైర్మెన్‌తో భేటీ



హైదరాబాద్ (జనంసాక్షి) : రిటైర్డ్ బొగ్గు ఉద్యోగుల పెన్షన్ పెంపొందించుటకు కోల్‌కతాలో నిర్వహించిన మహా ధర్నా సందర్భంగా కోల్ ఇండియా చైర్మన్ పియం ప్రసాద్‌ను ప్రత్యేకంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు సింగరేణి రిటైర్డ్ అధికారి ఆర్‌సివి రాజు ప్రత్యేకంగా కలిసారు. రిటైర్డ్ ఉద్యోగులకు సిపిఆర్ఎంఎస్ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న వైద్య సౌకర్యాలను సమీక్షించి మరింత మెరుగైన వైద్యం సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కేజీబీవీ బియ్యం అవకతవక..

- గూడూరు మండలం బ్రాహ్మణపల్లి లో వెలుగులోకి వచ్చిన ఘటన..



మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బియ్యం అవకతవకలు బయటపడ్డాయి. హాస్టల్ విద్యార్థినుల కోసం ప్రభుత్వంవారి తరఫున సరఫరా చేసిన సుమారు పది క్వింటాల్ల బియ్యంను అక్కడి స్పెషల్ ఆఫీసర్ రహస్యంగా తరలించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక సమాచారం ప్రకారం, ఆ బియ్యాన్ని సమీప గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో దాచిపెట్టినట్టు తెలిసింది. ఈ ఘటనపై స్థానిక పోలీస్ అధికారులు పట్టుకొని రెవిన్యూ అధికారులకు అప్పగించి విచారణ అనంతరం చర్యలు ఉంటాయని తెలుస్తోంది. విద్యార్థుల సంక్షేమం కోసం ఇచ్చిన సరుకులు ఇలాగే మళ్లించబడటం పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గతంలోనూ విద్యార్థులకు పెట్టాల్సిన పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తూ సంపాదనే ధ్యేయంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు అప్రమత్తమై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం. అవకతవకలు రుజువైతే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల సంక్షేమం పేరుతో ప్రభుత్వం పంపిన సరుకులు లక్ష్యానికి చేరకపోవడం అవినీతికి బలికావడం ప్రజల్లో తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

# వాసవి గ్రూపులో ఐటీ సోదాలు

- క్యాప్స్ గోల్డ్ సంస్థలోనూ తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబర్17 (జనంసాక్షి) : వాసవి రియల్ ఎస్టేట్ సంస్థ పై ఐటి సోదాలు నిర్వహించింది. క్యాప్స్ గోల్డ్ కు వాసవి సంస్థ అనుబంధంగా ఉన్నట్లు గుర్తించారు. వాసవి సంస్థలో డైరెక్టర్ గా ఉన్న అభిషేక్, సౌమ్య కంపెనీలపై సోదాలు నిర్వహించింది ఐటీశాఖ. క్యాప్స్ గోల్డ్ లో కూడా అభిషేక్, సౌమ్య డైరెక్టర్ గా ఉన్నారు.. వాసవికి సంబంధించిన 40 కంపెనీలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. వాసవి రియల్ ఎస్టేట్ గ్రూప్స్ పైన ఏకకాలంలో సోదాలు నిర్వహించింది ఐటీ-శాఖ.. చందా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపై ఐటీ సోదాలు నిర్వహించింది.. చందా కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న పలు కంపెనీలపై సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ తో పాటు- వరంగల్లోనూ ఐటీ దాడులు చోటుచేసుకున్నాయి. వాసవి గ్రూప్ తోపాటు-, కలాసా జ్యువెలరీ, క్యాప్స్ గోల్డ్ సంస్థలకు చందా కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్నారు.. చందా శ్రీనివాసరావుతో పాటు-, చందా అభిషేక్, చందా సుధీర్ నివాసాల్లో ఐటీ- సోదాలు నిర్వహించారు.. క్యాప్స్ గోల్డ్ డైరెక్టర్ శ్రీనివాస్ ఇంట్లోఐటీ- సోదాలు చేశారు. బోయిన్‌పల్లిలోని లగ్జరీ గ్రీన్ విల్లాలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. లగ్జరీ గ్రీన్ విల్లాలోని మూడు విల్లాలలో ఐటి సోదాలు కొనసాగుతున్నాయి.. డైరెక్టర్ శ్రీనివాస్ ఇంట్లో సుమారు పది ఐటీ- టీ-మ్ లు సోదాలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాదులోని క్యాప్స్ గోల్డ్ కంపెనీ పై ఐటి సోదాలు జరిగాయి. 15 చోట్ల సోదాలు నిర్వహించింది ఐటీ- శాఖ. హైదరాబాద్, వరంగల్, విజయవాడలో ఐటీ- సోదాలు కొనసాగుతున్నాయి. మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ నుంచి క్యాప్స్ గోల్డ్ కంపెనీ పెద్ద ఎత్తున గోల్డ్ కొనుగోలు చేస్తున్నట్లు- గుర్తించారు. బంగారం కొనుగోలు చేసి రి-టైల్ గోల్డ్ షాప్స్ కు అమ్ముతున్నట్లు తేలింది.

# ఎందరో త్యాగాల ఫలితమే తెలంగాణ

- ప్రజాపాలనలో జెండా ఎగురేసిన మంత్రి శ్రీధర్ బాబు




సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్17 (జనంసాక్షి) : సాయుధ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి పాత్ర ఎనలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అమరులు చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి సాయుధ పోరాటం పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజలందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గొప్పదని, తెలంగాణ చరిత్రకు శ్రీకారం చుట్టిన శుభదినమని, బానిసత్వ సంకెళ్లను తెంచడానికి అమరులైన వారికి నివాళులర్పిస్తున్నామని, నాటి సాయుధ పోరాట స్ఫూర్తితోనే ఇప్పుడు ప్రజాపాలన సాధించుకున్నామని, కష్టమో, నష్టమో ప్రజలతో పంచుకుంటున్నామన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలో మంత్రి జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటం మనదన్నారు.రైతుల కోసం తీసుకొచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయని, ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతులకు మేలు చేస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయం రాజీ పడడంలేదని స్పష్టం చేశారు. సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, పారదర్శకంగా పోటీ- పరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించామని, సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ధరణి అవకతవకలను భూభారతితో తో ఆధునీకరించామని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక భూభారతి చట్టం తీసుకొచ్చి సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తమ పాలనలో తావులేదని, స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్ మోడల్‌గా ఉన్నామని తెలియజేశారు.పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం త్వరలో ముగిసిపోతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దీనిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. సూర్యాపేటలో జరిగిన ప్రజా పాలన వేడుకల్లో ఆయన మాట్లాడారు.

# జీవనశైలి మార్పుల సవాళ్లు ఎదుర్కునేందుకు పోషకాహారం ముఖ్యం

- కేంద్ర సమాచార శాఖ ఫోటో ఎగ్జిబిషన్, పోషణ మాసోత్సవాలను ప్రారంభించిన మంత్రి ధనసరి అనసూయ సీతక్క
- ఈనెల 17 నుండి వచ్చే నెల 16 వరకు పోషణ మాసోత్సవాలు విజయవంతం చేయాలి
- పోషకాహారంతోనే మెరుగైన జీవనశైలి అని తెలిపిన మంత్రి
- ఫోటో ఎగ్జిబిషన్ నిర్వాహకులను అభినందించిన మంత్రి
- 3 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) : మారుతున్న జీవనశైలి మార్పుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కునేందుకు పోషకాహారం తీసుకోవాలని, ఈనెల 17 నుండి వచ్చే నెల 16 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క సూచించారు. కేంద్ర సమాచార శాఖ యొక్క సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌కు, పోషణ మాసోత్సవాల ప్రారంభోత్సవం కు ముఖ్య అతిథిగా విచ్చేసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఫోటో ఎగ్జిబిషన్ నిర్వాహకులైన శ్రీధర్ సూరునేని పోషకాహార దృశ్యాలను మంత్రి సీతక్కకు వివరించారు. పోషణమాసం పురస్కరించుకొని ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ సూరునేని ఏర్పాటు చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ బూత్, 360 డిగ్రీ సెల్ఫీ కెమెరాతో సెల్ఫీ తీసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన అంగన్వాడీ టీచర్లను కేంద్ర సమాచార శాఖ తరఫున సన్మానించారు. ఈ సందర్భంగా సభా అధ్యక్షత వహించిన శ్రీధర్ సూరునేని మాట్లడుతూ, దేశవ్యాప్తంగా నేటి నుంచి పోషణ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ములుగులో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోషకాహారం ఆవశ్యకత, వివిధ అనారోగ్య సవాళ్లను ఎదుర్కునేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ గురించి వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, నెలరోజుల పాటు జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ పోషకాహారం ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు తూచడం, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పోషకాహారం ప్రాధాన్యత వివరించడం, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తల్లిపాల ప్రాధాన్యత, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, పరిశుభ్రత పాటించడం, పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. విద్య, వైద్య, పంచాయతీరాజ్, డిఆర్డీఓ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్ రావు, జిల్లా సంక్షేమాధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డీపీఆర్ఓ రఫీక్, సీడీపీఓ శిరీష, వివిధ విభాగాల జిల్లా అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మణిపూర్ బాధితులకు
# మోదీ పర్యటన ఊరటనిచ్చేనా?

రెండున్నర సంవత్సరాలకు పైగా సోయి లేని మోదీ ఎట్టకేలకు మణిపూర్ భారతదేశంలో భాగమేనని గుర్తించినట్లున్నారు.మోదీ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో మణిపూర్ రాష్ట్రం ఎంతగా అగ్ని లో, బుగ్గి అయిందో చూసి తరించాలని వచ్చారు. అక్కడ బీజేపీ పాలనలో, పోలీసులు, సైన్యం ఆగడాలతో మణిపూర్ ఒక్కసారిగా రెండుగా చీలిపోయింది. జాతి తప్పుల మధ్య, బీజేపీ ప్రభుత్వం సాక్షిగా మంటల్లో మాడిపోయింది. మే 3, 2023 నుంచి మెయితీ లు, కుకీ-జో తెగల మధ్య ఏర్పడిన ఘర్షణలు, ఇప్పటికి 260 మందికి పైగా గిరిజనుల ప్రాణాలు బలి తీసుకున్నాయి. సుమారు 60,000 మంది శరణార్థులుగా తలదాచుకుంటున్నారు. వారి గూళ్ళు, చర్చిలు, ధ్వంసమవుతున్నాయి. చర్చిలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్ 13, 2025న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బకాసుర నిద్ర నుండి ఒక్క సారిగా మేల్కొన్నారు. పొరుగు దేశాలలో (శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ లలో అధికార మధంతో పాలిస్తే పాలకులకు ఏ గతి పట్టిందో గుర్తుకు వచ్చిన ట్టుంది.) గతంలో విపక్షాలు పార్లమెంటులో ఎంత మొత్తుకున్నా మోదీ నోరు విప్పలేదు, దేశ, విదేశాల్లో మీడియా ఎన్ని వీడియోలు, వార్తా కథనాలు రాసినా మోదీ మౌనం వీడలేదు.అక్కడ ప్రజలు ఎన్ని సార్లు ఆహాకారాలు చేసిన పట్టించు కోలేదు. ఇప్పుడు ఒక్కసారిగా మణిపూర్ గుర్తుకు వచ్చింది. కాబోలు వివరకు "దొంగలు పడిన ఆర్నెల్లకు" ఇప్పుడు మణిపూర్ కు చేరుకున్నారు. మణిపూర్లో హింస చెలరేగిన తర్వాత మొదటి సారి.మోదీ అభివృద్ధి పథకాలు ప్రారంభించారు.అక్కడి ప్రజలకు "కురు క్షేత్ర యుద్ధం ముగిసాక" 'శాంతి మార్గాన్ని ఎంచుకోవాలి' అని చావు కబురు చల్లగా హితవు చెప్పారు. కానీ, మోదీ విజిట్ ముగిసిన మరుసటి రోజే "చూరాచాంద్‌పూర్" లో పోలీసులు ఆరోపణలతో డిటెయిన్ చేసిన పోవర్‌లపై అల్లర్లు మొదలయ్యాయి. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వం యొక్క అణచివేత విధానా లు, రాజకీయ ప్రచార రాష్ట్రాన్ని మరింత గాయపరుస్తున్నాయన్న సూచనలు కనపడుతూనే ఉన్నాయి. 2017లో మోదీ తన ప్రసం గంలోనే, "శాంతి-భద్రతలు కాపాడలేని పాలకులకు పాలించే హక్కు లేదు" అని గంభీరంగా ప్రకటించారు. కానీ, ఈ మాటలు ఇప్పుడు ఖాళీ నినాదాలుగా మారాయి. ఈ విశ్లేషణలో, రాష్ట్రంలోని లోతైన సమస్యలను తడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాల, ఆధారాలతో సహా చూద్దాం.

మొదటి సమస్య, రాష్ట్ర ఆయుధాగారాల నుంచి దొంగిలించిన ఆయుధాలు. హింస మొదలైన ముహూర్తంలోనే, మెజారిటీ తెగలకు చెందిన వర్గాలు పోలీస్ స్టేషన్లు, ఆయుధాగారాలపై దాడి చేసి 4,500కి పైగా ఆయుధాలను ( ఏకే-47లు, మోర్టార్లు, ఇతర ఆధునిక ఆయుధాలను చోరీ చేశాయి. ఇప్పటికీ, కేవలం 1,800 మాత్రమే వాటిలో నుండి పోలీసులు రికవరీ చేశారు.) అంటే అక్కడ ప్రభుత్వం పనితీరు తెలుస్తూనే ఉంది. మిగిలిన మారణా యుధాలు రాష్ట్రంలోని హిల్ ఏరియాల్లో దాచి, హింసకు ఆధారా లుగా దాచి ఉంచారు. ఈ ఆయుధాలు మోదీ రాజ్య అధికారాన్ని సవాలు చేస్తున్నాయి. కానీ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టకపోవడం ఆందోళనకరం. (ఏ.సి.ఎల్.ఈ.డీ.) డేటా ప్రకారం, 2023-2025 మధ్య మణిపూర్‌లో 1,000కి పైగా రాజకీయ హింసా సంఘటనలు జరిగాయి.ఇక్కడి అల్లరి మూకలు ఆయుధా లతో సంబంధం కలిగి ఉన్నాయి. మోదీ పర్యటన సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం తెలిసి చేసిన ఘోర తప్పిదం. ఇది కేవలం ఆయుధాల సమస్య మాత్రమే కాదు. కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల (డబుల్ ఇంజన్ సర్కార్)లోపాలు, హింసా సంస్కృతిని పోషిస్తున్నాయనటానికి సంకేతాలు.

రెండవది, మైనారిటీ తెగలపై జరిగిన అత్యాచారాలకు న్యాయం చేయకపోవడం. కుకీ-జో ప్రాంతాల్లో సామూహిక హత్యలు, లైంగిక హింసలు సుమారు 200కి పైగా వీడియోలు, సాక్ష్యాలు అందుబాటులో ఉన్నాయి. కానీ వారిపై కేసులు పరిమితంగా మాత్రమే ఫైల్ అయ్యాయి. హ్యూమన్ రైట్స్ వాచ్ రిపోర్ట్ ప్రకారం, 260 మరణాల్లో 98 కుకీ-జోలవి, కానీ దోషులపై చర్యలు దాదాపు లేవు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కొన్ని కేసుల్లో చురుకుగా, మరికొన్నింటిలో (బీజేపీ కార్యకర్తల విషయంలో) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి, అని మీడియా కథనాలు చెప్పాయి. పార్లమెం ట్‌లో 'కఠిన చర్యలు' వాగ్దానాలు చేసినా, నిజమైన నిందితులు బయట ప్రపంచంలో కాలర్ ఎగరేసుకొని, గోద్రా అల్లర్లకు సంబం ధించిన నేరస్తులు తిరిగి నట్లు నిర్భయంగా తిరుగుతున్నారు. ఇది బలహీన వర్గాల కుటుంబాల్లో అసంతృప్తిని, ప్రాణ భయాన్ని పెంచుతోంది. శాంతి ప్రక్రియను బలహీనపరుస్తోంది. మోడీ పర్యటనలో బాధితులతో మాట్లాడినా, ఇలాంటి అంశాలకు ఆధారా లు లేవని చెప్పడం, ప్రభుత్వ పక్షపాత దృష్టిని చూపిస్తోంది. నేరస్తులను కాపాడాలనే తపన కనిపిస్తుంది.

మణిపూర్ రాష్ట్రం గిరిజన జాతి తప్పుల మధ్య చీలిపోవడం మరో పెద్ద సవాలు. ఇంఫాల్ వ్యాలీలో మెయితీలు, హిల్స్‌లో కుకీల మధ్య అస్సాం రైఫిల్స్,(సీ.ఆర్.పీ.ఎఫ్.) బలగాలు సరిహద్దులు కాపాడుతున్నాయి. ఇరు ప్రాంతాల్లో వేర్వేరు అడ్మినిస్ట్రేటర్లు పని చేస్తున్నారు. ఇది విభజనను శాశ్వతం చేస్తోంది. మోడీ విజిట్‌లో కూడా, రెండు ప్రాంతాల్లో వేర్వేరు సందేశాలు ఇవ్వడం ఈ విభేదాన్ని మరింత లోతుగా కనిపిస్తుంది. "క్రైసిస్ గ్రూప్ రిపోర్ట్ " ప్రకారం, ఈ డివిజన్ 60,000 డిస్‌ప్లేస్‌మెంట్‌కు కారణమైంది. గ్రామాలకు, గ్రామాలు శత్రు శిబిరాలుగా మారాయి. ప్రభుత్వం ఈ వేర్పాటు శక్తుల ముందు మోకరిల్లి, రాజకీయ లాభాల కోసం సమస్యను సాగదీస్తున్నట్టు కనిపిస్తోంది.

ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌పై ఆరోపణలు బీజేపీ ప్రభుత్వానికి, మరో మచ్చ. మెయితీలు ఆయుధాగారాలపై దాడి చేయమని ఆయన తన స్వంత గొంతుకతో ప్రోత్సహించిన ఆడియో క్లిప్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఆలస్యం చేస్తున్నాయి.ఈ విషయంలో కోర్టు సాక్షాత్తు అసంతృప్తి వ్యక్తం చేసినా అక్కడి ప్రభుత్వం స్పందించడం లేదు. ఇది స్థానిక రాజకీయ రక్షణకు బీజేపీ ప్రభుత్వమే శాంతి భద్రతలకు అడ్డంకిగా మారడం విచిత్రం.

మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లో స్వేచ్ఛా ప్రయాణాలపై ఆంక్షలు విధించారు ఇది స్థానిక తెగల మధ్య విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ఫ్రీ మూవ్‌మెంట్ రెజిమ్‌ను పరిమితం చేసి, కంచెలు వేస్తున్నారు. నాగాలాండ్, మిజోరాం ప్రభుత్వాలు నిరసనలు చెప్పాయి. యునైటెడ్ నాగా కౌన్సిల్ మోడీకి మెమోరాండమ్ సమర్పించింది. బోర్డర్ ఫెన్సింగ్‌పై వ్యతిరేకతను తీవ్రంగా హెచ్చరించి మరీ చెప్పింది. ఇది బ్రిటిష్ కాలం నాటి కృత్రిమ సరిహద్దులను తిరిగి అమలులోకి తెస్తోంది, జాతీయ భద్రత పేరుతో స్థానికుల రాకపోకలను కట్టడి చేస్తోంది.

2015 నాగా ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్ అమలు ఫెయిల్యూర్ మరో పెద్ద లోపం. మణిపూర్‌లో నాగాలు గణనీయంగా ఉన్నా, చర్చలు అర్థరహితంగా సాగుతున్నాయి. 10వ వార్షికోత్సవంలో కూడా, (సీ.ఎన్.పీ.ఓ.) సపోర్ట్ చెప్పినా, అమలు మాత్రం శూన్యం. ఇది నాగా తెగల్లో అసంతృప్తిని పెంచుతోంది, వేర్పాటు డిమాండ్లను బలపరుస్తోంది. "పాపీ" సాగు, మాదక ద్రవ్య వ్యాపారం మరింత ఉధృతంగా సాగుతుంది. మయన్మార్ షాన్ స్టేట్‌లో పాపీ కల్టివేషన్ సర్జ్ అయింది. మణిపూర్ ఒక కారిడార్‌గా మారింది. (యూ.ఎన్. ఓ.డీ.సీ.)సర్వే ప్రకారం, 2024లో మయన్మార్ పాపీ ప్రొడక్షన్ 40 శాతం పెరిగింది. ఇది మణిపూర్ హిల్స్‌లోని పేద కుటుంబాలను ఆధారపడేలా చేస్తోంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా, వీరిని నేరస్తులుగా ముద్రవేస్తోంది. ఇది హింసకు మరో కారణం. ఇంటర్నెట్ సేవలపై అవరోధాలు రాష్ట్రాన్ని డిజిటల్ దెబ్బకు గురిచేశాయి. ఇండియాలో అతి దీర్ఘకాలిక ఇంటర్నెట్ సేవలు షట్‌డౌన్ లు(నేపాల్ లో సంఘటనలు గుర్తు చేస్తున్నాయి) వందల రోజులు మించి కొనసాగుతున్నాయి. ఇలా ప్రభుత్వమే చేయటం, అక్కడ విద్య, వైద్యం, జర్నలిజం రంగాలను కుంగదీసా యి. మానవ హక్కుల ఉల్లంఘనలు దాచిపెట్టబడ్డాయి, మానసిక సమస్యలు పెరిగాయి. పునరావాస క్రైసిస్ ఉధృతంగా ఉంది. 60,000 మంది శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. గూళ్లు రూపం మార్చుకున్నాయి. వందల చర్చిలు అగ్ని కీలల్లో బుగ్గి అయ్యాయి. ప్రభుత్వ స్పందన మొక్కుబడిగా ఉంది.అక్కడ ఏలాంటి అభివృద్ధి పథకాలు అమలులో లేవు. సుహృద్భావ చర్యలూ అసలు కాన రావు. మోడీ పర్యటన ఎప్పటిలా గోదీ మీడియాలో రాజకీయ ప్రచారస్త్రంగా మిగిలింది. సమస్యల పరిష్కారంగా దిశగా మాత్రం కాదు.ఇదే విషయాన్ని దేశ, విదేశీ మీడియా వార్తా కథనాలు రాస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రెండు సీట్లలో కాంగ్రెస్ గెలవడం, ఓటర్ల అసంతృప్తికి గురిచేసింది.ఇటీవల మన దేశంలో ఎన్నికలు ఎంత నిష్పక్షపాతంగా జరుగుతున్నాయో.. ప్రపంచం ఇటీవల టీవీల్లో, ఇంటర్నెట్ లో అంతా తేటగా చూశారు.

రాహుల్ గాంధీ వంటి నాయకులు మణిపూర్‌లో హింసా, మానభంగాల ఘోరాలు వెల్లడి అయిన వెంటనే వెళ్లి అక్కడి బాధితులను పరామర్శించారు. కానీ,ఎంత మంది చెప్పినా మోడీ మొండిగా మౌనం పాటించారు. ప్రజలను పావులుగా చూడకుండా, జవాబుదారీతనంతో చర్యలు తీసుకోవాలి. లేకపోతే, మణిపూర్ మంటలు మరింత భయంకరంగా మారతాయి.ఇతర పొరుగు దేశాల సంఘటనలు పాలకులకు గుణపాఠం కావాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## మనందరి ఉమ్మడి బాధ్యత

2070 నాటికి మనదేశం నికర శూన్య ఉద్గారాల లక్ష్యాన్ని(Net Zero) సాధించడం అనేది ఒక పెద్ద సవాలుతో కూడుకున్నది. ఈ లక్ష్యం కేవలం భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టులనో, కర్మాగారాల నియమాలనో మార్చడం ద్వారా మాత్రమే నెరవేరదు. దీని మూలాలు మన దైనందిన జీవితంలోని చిన్న చిన్న నిర్ణయాలపై ఆధారపడతాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉదాహరణకు ఒక సామాన్యుడు కొనే సబ్బు నుండి ప్రభుత్వం నిర్మించే బ్రహ్మాండమైన ప్రాజెక్టుల వరకు, ప్రతి కొనుగోలు మన పర్యావరణ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఈ కొనుగోళ్ల శక్తిని, దాని ప్రభావాన్ని, మనందరి పాత్రను లోతుగా విశ్లేషించడం అవసరం. మన దేశ ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలు సామాన్య పౌరులు, ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వం అనే మూడు ప్రధాన వర్గాల కొనుగోళ్లపై ఆధారపడి ఉన్నాయి.




ఒక వ్యక్తిగా మన ప్రభావం చాలా చిన్నదని అనిపించవచ్చు. కానీ 140 కోట్ల మంది ప్రజల అలవాట్లు కలిస్తే అది ఒక మహాశక్తిగా మారుతుంది. మనం వాడే ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి వచ్చే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఫాస్ట్ ఫ్యాషన్ పరిశ్రమ వల్ల కలిగే నీటి కాలుష్యం వరకు మన ఎంపికలు పరోక్షంగా పర్యావరణంపై భారం మోపుతాయి. మనదేశ మొత్తం శక్తి వినియోగంలో గృహాల వాటానే దాదాపు 25% నుండి 30% వరకు ఉంటుంది. మనం కొనే ఆహారం కూడా ముఖ్యమే. కొన్ని పంటలకు అధిక నీరు అవసరం, మరికొన్ని ఆహార పదార్థాలు వేల కిలోమీటర్ల దూరం నుండి రవాణా చేయబడతాయి. ఈ ప్రక్రియలన్నీ కర్బన ఉద్గారాలకు కారణమవుతాయి. అదే విధంగా దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగాల ఉద్గారాల వాటా దాదాపు 40% పైనే ఉన్నాయి. ఒక కార్ల తయారీ కంపెనీ తీసుకునే నిర్ణయం స్టీల్, ప్లాస్టిక్, గాజు, రబ్బరు, ఎలక్ట్రానిక్స్ వంటి ఎన్నో రంగాలను ప్రభావితం చేస్తుంది. కంపెనీలు తమ కార్యాలయాల కోసం కొనే ఫర్నిచర్, కంప్యూటర్ల నుండి ఫ్యాక్టరీల కోసం కొనే ముడిసరుకుల వరకు, ప్రతి కొనుగోలు ఒక పెద్ద సరఫరా గొలుసును నడిపిస్తుంది. ఆ గొలుసు 'హరితంగా' ఉంటే, దాని సానుకూల ప్రభావం వేలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై పడుతుంది. ఈ మూడింటిలో అత్యంత శక్తివంతమైన, అతిపెద్ద కొనుగోలుదారు ప్రభుత్వమే. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల నుండి రక్షణ పరికరాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం ధాన్యం సేకరణ వరకు ప్రభుత్వం ఏటా చేసే ఖర్చు మన జీడీపీలో 22%, అంటే సుమారు 72 లక్షల కోట్లు. ఈ కొనుగోళ్ల కారణంగా ఏటా దాదాపు 59 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌కు సమానమైన ఉద్గారాలు వెలువడుతున్నాయని అంచనా. ప్రభుత్వం తన కొనుగోలు విధానంలో 'హరిత ప్రమాణాలను' చేరిస్తే, అది మొత్తం మార్కెట్‌కే ఒక బలమైన సందేశం పంపుతుంది.

### సుస్థిరత దిశగా ప్రస్తుత అడుగులు:

ప్రస్తుతం ప్రజలలో అవగాహన పెరుగుతోంది. సేంద్రీయ ఉత్పత్తులు, రైతుల బజార్లు, పాత వస్తువులను అమ్మే పొదుపు దుకాణాలు, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం వంటివి నెమ్మదిగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రైవేట్ సంస్థల విషయానికొస్తే, టాటా, ఇన్ఫోసిస్, విప్రో వంటి అనేక భారతీయ కంపెనీలు పర్యావరణ, సామాజిక, పాలనా ప్రమాణాలను పాటిస్తూ, కార్బన్ తటస్థ లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నాయి. తమ కార్యాలయాలను హరిత భవనాలుగా మారుస్తున్నాయి. ఇక ప్రభుత్వం కూడా సాధారణ ఆర్థిక నిబంధనలు 2017లో కొన్ని పర్యావరణ నిబంధనలను చేర్చింది. ఇటీవల విడుదల చేసిన వస్తువులు, సేవల సేకరణ మాన్యువల్ 2024లో సుస్థిరతకు ప్రాధాన్యతనిచ్చింది. అయితే ఇవి ఇంకా పూర్తిస్థాయిలో, దేశవ్యాప్తంగా అమలు కావడం లేదు.ఈ మొత్తం మార్పు ప్రక్రియలో అత్యంత కీలకమైన పాత్ర యువతదే. వారు ఈ హరిత విప్లవానికి చోదక శక్తిగా వ్యవహరిస్తారు. కాబట్టి యువత తాము వాడే బ్రాండ్ల పట్ల చాలా స్పృహతో ఉండాలి. పర్యావరణానికి హాని కలిగించే కంపెనీలను తిరస్కరించి, సుస్థిరమైన ఉత్పత్తులను అందించే వాటిని యువత ఆదరించాలి. పర్యావరణ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనడానికి హరిత హ్యాకథా న్‌లు నిర్వహించడం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు వంటి రంగాలలో కొత్త స్టార్టప్‌లు ప్రారంభించడం ద్వారా యువత ఉద్యోగ కల్పన చేయడమే కాక, పర్యావరణానికి మేలు చేయగలరు.

### కలిసికట్టుగా చేయాల్సిన మార్పులు:

దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు పాటించేలా ఒక బలమైన, స్పష్టమైన 'హరిత కొనుగోలు' చట్టం తీసుకురావడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. అలాగే ప్రభుత్వం కొనుగోలు అధికారులకు పర్యావరణ ప్రమాణాలపై శిక్షణ ఇవ్వాలి. ఒక ఉత్పత్తి జీవితకాల వ్యయాన్ని ఎలా అంచనా వేయాలి, పోటీకి ఆటంకం కలగకుండా 'హరిత టెండర్లను' ఎలా రూపొందించాలో నేర్పించాలి. దీనికి 'మిషన్ కర్మయోగి' వంటి వేదికలను వాడుకోవాలి. ఏది 'హరిత' ఉత్పత్తి, ఏది కాదు అని స్పష్టంగా నిర్వచించే ఒక జాతీయ ప్రమాణాల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇది గందరగోళాన్ని నివారిస్తుంది. హరిత ఉత్పత్తులను తయారుచేసే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థికంగా అండగా నిలవడం, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహకాల వంటి పథకాలలో వారికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా అవసరం. ఇక ప్రైవేట్ సంస్థలు సుస్థిరతను కేవలం ఒక వార్షిక నివేదిక అంశంగా కాకుండా, కంపెనీ ప్రధాన వ్యాపార వ్యూహంలో భాగం చేయాలి. తమ ఉత్పత్తుల పర్యావరణ ప్రభావం గురించి వినియోగదారులకు పారదర్శకంగా తెలియజేయాలి. తమ సరఫరా గొలుసు మొత్తాన్ని హరిత ధృవీకరణ చేయించాలి. సామాన్యులు కూడా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అవసరం లేని వస్తువులను కొనకపోవడం, విద్యుత్‌ను పొదుపు చేయడం, నీటిని వృథా చేయకపోవడం వంటివి అలవాటు చేసుకోవాలి. మన వార్డులో, గ్రామంలో చెత్త నిర్వహణ, ప్రజా రవాణా, పచ్చదనం వంటి అంశాలపై స్థానిక ప్రభుత్వాలను నిలదీసి లక్ష్య చేరువలో భాగస్వాములు కావాలి.

భారతదేశ 'నికర శూన్య ఉద్గారాల' లక్ష్యం అనేది ఎక్కడినుంచో ఎవరో వచ్చి చేసేది కాదు. అది మన వంటగదిలో మొదలై, మన కార్యాలయం గుండా ప్రయాణించి, ప్రభుత్వ విధానాలలో ప్రతిఫలించాలి. ఈ మహా యజ్ఞంలో ప్రభుత్వం తన కొనుగోలు శక్తితో మార్గాన్ని నిర్దేశిస్తే, ప్రైవేట్ రంగం తన ఆవిష్కరణలతో వేగాన్ని అందించాలి. వీటన్నింటికీ అసలైన చోదక శక్తిగా, మనస్సాక్షిగా నిలవాల్సింది యువతరమే. ప్రతి కొనుగోలు ఒక బాధ్యతగా భావించినప్పుడే మనమందరం కలిసి ఆ హరిత భవిష్యత్తును నిర్మించగలం.



ధర్మాన రవితేజ,
EPTRI - Youth Ambassador &
Climate Activist, 7093705620

## 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో రైతుకు యూరియా కొరత
# ప్రభుత్వాల వైఫల్యమా?

స్వతంత్ర భారతదేశం 75 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక రంగాల్లో ప్రపంచ స్థాయిలో పోటీపడుతున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. అంతరిక్ష రంగంలో చంద్రయాన్, ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ ఇండియా, సాంకేతికతలో 5G వంటి విజయాలను గర్వంగా చెప్పుకునే పాలకులు, దేశ ఆహార భద్రతకు వెన్నెముకైన రైతుకు కావలసిన కనీస యూరియా సరఫరా చేయలేకపోతున్నారు. రెండు బస్తాల యూరియా కోసం రైతు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి రావడం, అర్ధరాత్రి నుంచి రైతు వేదికల వద్ద బారులు తీరడం ఈ దేశ రైతు దుస్థితికి నిదర్శనం. ప్రపంచంతో పోటీ పడుతున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు, రైతు కనీస అవసరాలను తీర్చడంలో ఎందుకు విఫలమవుతున్నాయి? ఈ వైఫల్యం వెనుక ఉన్న కారణాలు ఏమిటి? ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వాలు ఏ చర్యలు తీసుకోవాలి?

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ జనాభాలో 60 శాతానికి పైగా జీవనోపాధి వ్యవసాయంపై ఆధారపడి ఉంది. యూరియా వంటి ఎరువులు రైతు పంట దిగుబడిని పెంచడంలో కీలక పాత్ర వహిస్తాయి. అయితే, గత కొన్నేళ్లుగా యూరియా కొరత దేశవ్యాప్తంగా రైతులను వేధిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతులు యూరియా కోసం గంటల తరబడి డిపోల వద్ద బారులు తీరుతున్నారు. కొన్ని చోట్ల టోకెన్ విధానం అమలు చేసినా, సరైన పంపిణీ వ్యవస్థ లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా సరఫరా కోసం అధికారులు హామీలు ఇస్తున్నప్పటికీ, ఆ హామీలు ఆచరణలో నీరుగారిపోతున్నాయి.

యూరియా కొరతకు ప్రధాన కారణాలలో ఒకటి ఉత్పత్తి, సరఫరా గొలుసులో సమన్వయ లోపం. భారతదేశం యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధమైనప్పటికీ, దాని పంపిణీ వ్యవస్థ అత్యంత అసమర్థంగా ఉంది. దేశంలోని అనేక యూరియా ఉత్పత్తి కర్మాగారాలు సామర్థ్యానికి దిగువన పనిచేస్తున్నాయి. దీనికి తోడు, రవాణా సమస్యలు, గిడ్డంగుల నిర్వహణలో లోపాలు, అవినీతి వంటి అంశాలు రైతుకు యూరియా అందకుండా అడ్డుపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో యూరియా పక్కదారి పట్టి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముడవుతోంది. ఇది నిరుపేద రైతులకు ఆర్థిక భారంగా మారుతోంది. రైతు ఎదుర్కొంటున్న ఈ సమస్యలకు ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఒక ప్రధాన కారణం. వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గుతున్నాయి. యూరియా సబ్సిడీలపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్నప్పటికీ, ఆ సబ్సిడీలు నిజమైన రైతులకు చేరడం లేదు. అధికారులు, డీలర్ల మధ్య సమన్వయం లేకపోవడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల యూరియా పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో రైతు వేదికల వద్ద యూరియా స్టాక్ ఉన్నప్పటికీ, అవి సకాలంలో రైతులకు అందడం లేదు. దీనికి తోడు, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం రైతుల ఆవేదనను మరింత పెంచుతోంది.

ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి. ముందుగా, యూరియా ఉత్పత్తి, సరఫరా గొలుసును బలోపేతం చేయాలి. కర్మాగారాల సామర్థ్యాన్ని పెంచడం, రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, గిడ్డంగుల నిర్వహణను ఆధునీకరించడం అవసరం. యూరియా పంపిణీలో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ వేదికలను వినియోగించాలి. రైతులకు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డుల ద్వారా యూరియా కేటాయింపు చేస్తే, అవకతవకలను తగ్గించవచ్చు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. డీలర్లు, అధికారులపై కఠినమైన ఆడిట్, పర్యవేక్షణ విధానాలను అమలు చేయాలి. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాలి. సేంద్రీయ ఎరువులు, బయో-ఫెర్టిలైజర్ల వినియోగాన్ని పెంచడం ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాల ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అలవాటు చేయాలి. పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా కేటాయింపులను ప్లాన్ చేస్తే, వృథాను నివారించవచ్చు. రైతు సంఘాలు, స్థానిక సంస్థలను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం ద్వారా సమస్యలను త్వరగా గుర్తించి పరిష్కరించవచ్చు.రైతు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. అతని కష్టం లేకుండా దేశ ఆహార భద్రత సాధ్యం కాదు. అలాంటి రైతుకు కనీసం రెండు బస్తాల యూరియా అందించలేని ప్రభుత్వ వ్యవస్థ దేశ పురోగతిని గురించి గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉంది. 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో రైతు ఇంకా కనీస సౌకర్యాల కోసం అర్థించడం బాధాకరం. ప్రభుత్వాలు రైతు సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, యూరియా సరఫరా వ్యవస్థను సమర్థ వంతంగా నిర్వహించాలి. రైతు సంక్షేమం లేనిదే దేశ పురోగతి సాధ్యం కాదని పాలకులు గుర్తించాలి. యూరియా కొరతను తొలగించడం ద్వారా రైతు జీవనోపాధిని, దేశ ఆహార భద్రతను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.




పూసపాటి వేదాద్రి
కవి సాహితీ విశ్లేషకులు
9912197694

## ఇంక చెల్లవు!

ప్రపంచం వేగంగా
మారిపోతోంది!
ఇంక మీ మాయలు
చెల్లవని గ్రహించు!

బానిసల కాలం నుండి
వలసల కాలం దాకా
ఎన్ని మాయలు మీవి!
అన్నీ మాకు తేటతెల్లం!

నిరక్షరాస్యత అజ్ఞానం
అస్పృశ్యత కులంమతం
మూఢనమ్మకాలు
జన్మలు కర్మలు పైలోకం



ఈ మాయలన్నీ మీవే!
మీ మోసాలు చెల్లవు!
జనం ఇంక నమ్మరు!
పునరావృతం కాలేవు!


కళ్ళు తెరచి చూడు!

దృశ్యం మారిపోయింది!
చుట్టూ ప్రజా చైతన్యం
పొంగి పొరలుతోంది!

ప్రజల తిరుగుబాటుతో
ఆ చైతన్య స్రవంతిలో
కొట్టుకుపోవటం ఖాయం
మీ కెక్కడా స్థానం లేదు!
మీ యుద్ధాలు హింస
సుంకాలు బెదిరింపులు
మీ చివరి ఆయుధాలు
ఇవేవీ 'ఇంక చెల్లవు'!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# సామాజిక విప్లవ యోధుడు పెరియార్



సమాజంలోని అసమానతలు తొలగిపోయి, మూఢనమ్మకాల నిర్మూలన జరగాలని నిరంతరం పోరాడిన వీర యోధుడు పెరియర్. తాను చెన్నైలోని మద్రాస్ ప్రావినెన్స్ ఈరోడ్డు పట్టణంలో సెప్టెంబర్ 17, 1879 నా జన్మించాడు. పెరియార్ గారి పూర్తి పేరు ఈరోడ్ వెంకట రామస్వామి నాయకర్ తండ్రి వెంకటప్ప తల్లి చిన్నత్యీ ముత్యమల్ సతీమణి నాగమణి పెరియార్ అతి చిన్న వయసులోనే మనువాద బ్రాహ్మణీయ ఆచారాల పైన ప్రశ్నల హోరెత్తించి బ్రాహ్మణులని ముప్పు తిప్పలు పెట్టే ప్రశ్నలతో మెదులుతుండేవాడు. అలా తను వేసే ప్రశ్నలకి బ్రాహ్మణులు సమాధానం చెప్పలేక అక్కడనుండి పారిపోయిన దాతలు మరెన్నో...

అతి చిన్న వయసులో కాంగ్రెస్ పార్టీకి గాంధేయవాదానికి మొగ్గుచూపడం జరిగింది. వైకుం నగరంలోని అగ్రవర్ణ వీధుల్లో దళితుల్ని తిరగనివ్వకుండా ఆంక్షలు విధించడం జరిగింది "నిరసనగ పెరియార్ పెద్ద పోరాటం నిర్వహించారు. దారుల్లో పందులు,గాడిదలు,పలురకాల జంతువులు నడుస్తున్నాయ్... సాటి మనుషులు నడవటం నిషేధమా అంటూ మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని పెరియార్ గారు ఆ వీధుల్లో దళితుల్ని నడిపించి చరిత్రని తిరగరాశారు. అలాగే దేవదాసీ దురాచారంపై చట్టాన్ని తీసుకరావాలని పోరాటంచేశారు. దేవాలయంలో ఒక కులానికి చెందిన స్త్రీలు దేవునికి దాసీలుగా నాట్యమాడుతూ రాతి బొమ్మలను రంజింపజేయాలన్న దుష్ట సాంప్రదాయం మూలంగా రెండు వేల సంవత్సరాలుగా స్త్రీలు వ్యభిచార వృత్తిలోకి బలంగా నెట్టబడుతూ వచ్చారని పెరియార్ పోరాటం చేశారు మరియు స్త్రీని వంటింటికి మాత్రమే పరిమితం చేసిన మనుధర్మ శాస్త్రాన్ని తుంగలో తొక్కి తన భార్య మరియమ్మ చెల్లె లను ఉద్యమంలో భాగస్వామ్యం చేసి మద్యపాన నిషేధ పోరాటంలో క్రియాశీలకంగా పనిచేయించారు పోరాటంలో పెరియార్ గారిని అరెస్ట్ చేసి జైల్లో పెడితే ఆ పోరాటాన్ని వాళ్ళ భుజాలపైన వేసుకుని పోరాటం చేసిన విజయాన్ని చేకూర్చారు ఆ వీర నారులు. తన సామాజిక లక్ష్యాలను, చైతన్యాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఒక పత్రిక అవసరమనీ లికుడిఅరసులిఅనే పత్రికను 1925 మే 2న తొలి సంచికను కాంచీపురంలో ఆవిష్కరించారు.పెరియార్,తన భార్య పలువురు ఉధ్యమకారులతో సింగపూర్, మలేషియా, యూరప్, ఫ్రెంచ్, రష్యా తదితర దేశాల్లో విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టి సత్యాన్వేషకుల సంఘం,ఉదార ఆలోచనాపరుల సంఘం,హేతువాద సంఘం,దేవుడులేని వాళ్ళ సంఘాలు స్థాపించారు.బాల్య వివాహాలపై పోరాటం చేస్తూ స్త్రీ జాతిని అవమానిస్తున్న బ్రాహ్మణేతరులకు అర్థంకాని మంత్రాల,తంత్రాలతో కూడిన హిందూ పెళ్ళి సాంప్రదాయాలను పాటించకుండా ,పురోహితుడు లేని దండలు మార్చుకొని పెళ్ళిచేసుకొనే స్వాభిమాన పెళ్ళి విధానాన్ని పెరియార్ పరిచయం చేశారు. పెరియార్ 1919లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరి వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు, ఆ సమయంలో అతను రెండుసార్లు జైలు శిక్ష కూడ అనుభవించాడు. ఆయన చేస్తున్నటువంటి మహోత్తరమైనటువంటి కార్యక్రమాలకి ఈరోడు నగర పాలకమండలి చైర్మన్గా ఎన్నుకోవడంతో పాటు 29 పదవులను కూడా తను పొందడం జరిగింది.

1925లో కాంగ్రెస్ బ్రాహ్మణుల ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగపడుతుందని నమ్మి ఆ పార్టీకి రాజీనామా 1939లో, అతను జస్టిస్ పార్టీకి అధిపతి అయ్యాడు, దానిని 1944లో ద్రవిడర్ కజగం అనే సామాజిక సంస్థగా మార్చాడు. తరువాత పార్టీ విడిపోయింది, సి.ఎన్. అన్నాదురై నేతృత్వంలోని ఒక సమూహం 1949లో ద్రవిడ మున్నేట్ర కజగం (DMK)గా ఆవిర్భవించింది. డిసెంబరు 19న చెన్నాపట్నం త్యాగరాయనగర్ లో ఆలోచనాపరులమండలిలో జరిపిన సదస్సులో తన చివరి సందేశాన్నిస్తూ వేదికపైనే కుప్పకూలిపోయారు పెరియార్.ఆయన రచనలు పీడిత ప్రజల మానాభిమానాల పరిరక్షణకోసం , వారి హక్కులకోసం సుదీర్ఘకాలం పోరాటం చేస్తూ తిట్లను, నిందల్ని , చెప్పుల దెబ్బల్ని సైతం ఎదుర్కొన్న పెరియార్ , లక్షలాది గుండెల్లో నిరుపమాన స్థానాన్ని సంపాదించుకొని మరణం లేని అమరజీవిగా నిలిచారు.. పెరియార్ తన జీవితాన్ని సమాజం కోసం ఎలా కష్టపడ్డాడో ఒక సర్వే ద్వార తను 94సంవత్సరాల, 3 నెలలు,7 రోజుల జీవితకాలంలో ఆయన తన ప్రచార కార్యక్రమాల కోసం 8,20,000 మైళ్ళు ప్రయాణించారు (ఇది భూగోళపు చుట్టుకొలత కన్నా 33 రెట్లు ఎక్కువ, భూమికి చందమామకు మధ్య గల దూరానికి 3 రెట్లు) ఆయన మొత్తంమీద 10,700 సభలూ,సమావేశాలలో ప్రసంగించారు. ఆయన తన జీవితకాలమంతా ఇచ్చిన ప్రసంగాల కాలం 2,34,000. ఇవేగాని క్యసెట్లలో రికార్డు చేసి విడవకుండా వినిపించినట్లు అయితే 2సంవత్సరాల,5 నెలల,11 రోజులు పడుతుంది. రూపురేఖల్లోనే గాదు.చేతల్లో కూడా సోక్రటీస్ లాంటివారు. భారత స్వాతంత్ర పోరాటం నుండి నేటి దాకా దేశానికి ఈయన చేస్తున్న సేవలు అనేకం.ప్రజల ఆయన లక్ష్యాన్ని చేపట్టుతున్నందువలలనే కొంత వరకు వారు అభివృద్ధి చెందారు. అంబేద్కర్, పెరియార్ భాగా కలసిమెలసి తిరిగినవారు. ఇద్దరూ సన్నిహిత మిత్రులు. బుద్దుడు చెప్పిన సుత్రాలనే పెరియార్ కూడా చెబుతున్నారు. పెరియార్ "ఒక మహా పురుషుడుగా అరుదుగా కానవచ్చే మనీచి" ఈ గొప్ప వ్యక్తికి 146వ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాల్లు అర్పిస్తున్నాము.



-భాన్సువాడ వేదాంత్ మౌర్య
సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్
రాష్ట్ర అధ్యక్షుడు, 9963513544

# దేశాభివృద్ధి కోసం అందరం పాటుపడాలి

- 2047 నాటికి ప్రపంచ వేదికపై తెలంగాణ రుణ విముక్తి చేసాం
- సొంతింటి కల నెరవేర్చే విధంగా ప్రభుత్వం పనిచేస్తుంది
- తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** ప్రజలందరూ తమ హక్కులను ఉపయోగించుకుంటూ బాధ్యతలను విస్మరించకుండా దేశ సేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని,భారత స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ నాయకులు పాల్గొని బ్రిటిష్ వారి నుండి భారత జాతిని విముక్తి చేసినప్పటికీ ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న 562 సంస్థానాలలో మెజారిటీ సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారని సభాపతి తెలిపారు. 85 శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాషపై అణచివేత, వెట్టిచాకిరి, బానిసత్వం కొనసాగిందని మరోవైపు నిజాం ప్రైవేట్ సైన్యం మరియు రజాకార్ల దమనకాండ కొనసాగడంతో ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు చైతన్యం అయి సాయుధ రైతాంగా పోరాటాలు చేసి ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోయారని సభాపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు.రైతులను రుణ విముక్తి చేయడానికి దేశ చరిత్రలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందని అన్నారు.వికారాబాద్ జిల్లాలో రైతు రుణ మాఫీ పథకం క్రింద మొత్తం 1 లక్ష 358 మంది రైతన్నలకు 8 వందల 49 కోట్ల రూపాయలు రుణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్నట్లు, కేవలం తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయగా ఈ పథకం క్రింద వికారాబాద్ జిల్లాలో ఈ వానాకాలంలో 2 లక్షల 76 వేల 537 మంది రైతులకు గాను 363 కోట్ల 10 లక్షల రూపాయలు ఆయా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నిరుపేదల ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల నిజం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని ఇందులో భాగంగా జిల్లాకు మంజూరైన 13 వేల 640 ఇళ్ళలో ఇప్పటివరకు 11 వేల 681 గృహాలు నిర్మించడానికి ఆమోదించడం జరిగిందని ఆయన అన్నారు. మహాలక్ష్మి పథకం క్రింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడుచున్నదని అదేవిధంగా పేద కుటుంబాలకు 500 రూపాయలకే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్‌ను అందించి మహిళల వంటింటి కష్టాలను దూరం చేసిందని ఆయన అన్నారు. 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్య పత్రంగా తెలంగాణ రైజింగ్ - 2047 ఉంటుందని, ఇది కేవలం ప్రణాళిక కాదు ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పంతో పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలు , ప్రజా ప్రతినిధులు , అధికారులను భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభాపతి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థినీల సాంస్కృతిక కార్యక్రమాలు , తెలంగాణ సారథి కళాకారులు ఆలపించిన గేయాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థినీలకు స్పీకర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. తెలంగాణ ప్రజాపాల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, తాండూర్ శాసన సభ్యులు మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, బీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** ప్రపంచంలోనే అగ్రశ్రేణి నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందనీ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరిగింది.మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఆమె వేడుకలకు హాజరైన అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు.అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతం రాజరిక, నిరంకుశ పాలన నుండి విముక్తి పొంది ప్రజా పాలనకు అడుగులు పడ్డాయన్నారు. అందువల్లే ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని మేయర్ అన్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 50 వేలకు పైగా రేషన్ కార్డులను పేద కుటుంబాలకు పంపిణీ ఇటీవలే చేసిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటి హైదరాబాద్ మహానగర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత ఉన్నతంగా నిలపడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన,హెచ్-సిటీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ ప్రపంచంలోనే మేటి నగరంగా మారనుందని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ లు కే వేణు గోపాల్, గీతా రాధిక, సిసిపి శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ లు సహదేవ్ రత్నాకర్, నిత్యానంద్, విజిలెన్స్ ఎఎస్పీ సుదర్శన, డీఎస్పీ నరసింహ రెడ్డి, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్ల..

- నాసిరకం నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** సంగారెడ్డి బైపాస్ లో నిర్మిస్తున్న రోడ్డు నాసిరకంగా ఉందని నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సంగారెడ్డి నియోజకవర్గంలోని సమస్యలపై టిఆర్ఎస్ నాయకులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తో కలిసి చింత ప్రభాకర్ మాట్లాడుతూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మడ్డి పడ్డారు. ప్రభుత్వాలు మారుతుంటాయని కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉన్న వదిలేది లేదన్నారు. ప్రజలకు అత్యవసరమైన సమస్యలు గుర్తించి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశామని అభివృద్ధి అడ్డుకునేలా గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రద్దు చేశారన్నారు. సంగారెడ్డి, సదాశివపేట ఎస్‌డిఎఫ్ నిధులు, సంగారెడ్డి, సదాశివపేట మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, టియుఎఫ్ఐడిసి, ఎంఆర్ఆర్, గ్రాంట్, ధోభీ ఘాట్, మినీ హజ్ హౌస్ రూ.2 కోట్ల నిధులు, ఎంపీపీ బిల్డింగ్ పెండింగ్ రూ.85 లక్షలు నిధులు మంజూరు చేయాలని, బేగంపేటలో ఫిషరీస్ బిల్డింగ్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. సంగారెడ్డి సదాశివపేట మున్సిపల్‌లో పెండింగ్‌లో ఉన్న వెజ్ నాన్‌వెజ్ బిల్డింగ్‌ను పూర్తి చేయాలని కోరారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందని నాణ్యతగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జైపాల్ రెడ్డి, కసాల బుచ్చిరెడ్డి, సాయి కుమార్, కొండల్ రెడ్డి, ప్రభాకర్, శ్రీధర్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర నీటి పారుదల శాఖ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు ఈ వేడుకల్లో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రంగారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, ప్రజా ప్రతినిధులు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాములపై అవగాహన..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** ఎడారి మొక్కల పెరుగుదలపై తీసుకోవలసిన జాగ్రత్తలు మొక్కల పెరుగుదల గురించి విష సర్పాలు విషరహిత సర్పాలను ఎలా గుర్తించాలని షాద్ నగర్ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులకు జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ లో ప్రొఫెసర్ సదాశివయ్య ఆధ్వర్యంలో బ్రిలియంట్ స్కూల్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు అదేవిధంగా బికెఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.నర్మదా ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి భవిష్యతుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపల్ థామస్ రెడ్డి పాఠశాల సిబ్బంది ప్రణీత్,షేక్ నవాబ్, వెంకటేశ్వర్లు ,శ్వేతా తదితరులు పాల్గొన్నారు.

## బడా బాబులకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పేద రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం
- రైతులకు భరోసనిచ్చిన కేటీఆర్



**మోమిన్‌పేట, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణలో రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణలో ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు వల్ల ఇబ్బందులు పడుతున్న వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి, పాతూర్, మోమిన్ పేట్ మండలంలోని టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాలకు చెందిన రైతులు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో కలిశారు. ఈ సమావేశంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, కార్తీక్ రెడ్డి వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.రీజనల్ రింగ్ రోడ్ పేరుతో తమ భూములు లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని కేటీఆర్‌కి తమ బాధను రైతులు వివరించారు. తమ భూములను తమకు తెలియకుండానే సర్వేలు నిర్వహించి, తక్కువ ధరలకు లాక్కునేందుకు ఈ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తుందని, వారి నుండి ఎలాగైనా తమ భూములను కాపాడాలని కేటీఆర్ ని కోరారు. బాధితుల బాధలు విన్న కేటీఆర్ వారికి ఈ విషయంలో ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడిన ఆయన పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ఎక్కడ కూడా పొరపాట్లకు తావు లేకుండా చట్టప్రకారం భూసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను ఇబ్బంది పెట్టేలా భూసేకరణ చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రైతులను కాదని నిర్బంధాల మధ్య సర్వే చేసి, భూసేకరణ చేయడం తగదన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మోసం అనేది వెన్నతో పెట్టిన విద్య అని గతంలో కూడా ఔటర్ రింగ్ రోడ్ అంశంలో ఇదే విధంగా సొంత అజెండాలతో ముందుకు వెళ్లిందన్నారు.ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఒరిజినల్ అలైన్‌మెంట్ కాకుండా సొంత డబ్బులతో కడుతున్నామని చెప్పి తమవారి భూములను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తోందని అన్నారు. అందుకోసం వేలాదిమంది రైతుల జీవితాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. రీజినల్ రింగ్ రోడ్ విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని, ప్రభుత్వం ఇష్టానుసారంగా భూములు లాక్కుంటామంటే మాత్రం బాధితుల పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, మోమిన్ పెట్ పి ఎస్ సి ఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మోమిన్ పెట్ మండల ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, దేవరంపల్లి మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి బి ఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి మాజీ కౌన్సిలర్ చిట్యాల అనంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్ర రెడ్డి, బాధిత రైతులు శ్రీరాములు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విమోచన దినాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



**కొందుర్గు, సెప్టెంబర్ 17 (కొందుర్గు) :** ఆనాడు నిజాం రజాకార్లు చేసిన నిరంకుశ పాలన నుండి విముక్తి కలిగిన సెప్టెంబర్ 17 తేదీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని అణగదొక్కిందని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని కాదని ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. రెండు సంవత్సరాలుగా 6 గ్యారంటీ ల పేరుతో ప్రజలను ఆగమాగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం ఎందుకు జరుపుతుందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజా పాలన కాదని ప్రజలు అనుభవిస్తున్న రోదన అని దుయ్యబట్టారు. కొందుర్గు మండల కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు లక్ష్మయ్య గౌడ్, బోయ శంకర్, కొమరబండ శ్రీశైలం, బలవంత్ రెడ్డి, సీనియర్ నాయకులు శివారెడ్డి, సున్నాల అంజయ్య, బోయ అశోక్, కారుకొండ సుధాకర్, చెన్నయ్య, కార్తీక్, వీరన్న, శేఖర్, చెక్కల శ్రీనివాస్, శివకుమార్, శ్రీను, యాదయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ బుధవారం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చుడి బజార్ లో ఉన్న ప్రధాన ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి గోదాం లోపల ఉన్న వస్తువుల నిల్వ ఉన్న భద్రతా , స్థితిగతులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతను కూడా జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నిక సంఘం మార్గదర్శకాల మేరకు గోదాం వద్ద భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

# నిర్బంధాలతో భూసేకరణ వద్దు..

- రైతులు సంతృప్తి చెందే విధంగా పరిహారం ఉండాలి
- చట్ట ప్రకారం భూసేకరణ నిర్వహించాలి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** నిర్బంధాల మధ్య భూసేకర నిర్వహించరాదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. బుధవారం వికారాబాద్ నియోజకవర్గ రీజనల్ రింగ్ రోడ్డు బాధితులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు నిర్బంధాల మధ్య భూ సర్వే నిర్వహించవద్దని కోరారు. రైతులకు తు తు మంత్రంగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవద్దని రైతు సంతృప్తి చెందే విధంగా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. చట్ట ప్రకారం భూ సర్వే జరిగితే రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. తెలంగాణలో రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణలో ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు వల్ల ఇబ్బందులు పడుతున్న వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్. మండలంలోని పులుసుమామిడి, పాతూర్, మోమిన్‌పేట్, మండలంలోని టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఈరోజు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిశారు. వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో కలవడం జరిగింది.ఈ సమావేశంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి టీఎస్ఈడబ్ల్యూ ఐడిసి మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ బిసి కమిషన్ మాజీ సభ్యులు శు భప్రద్ పటేల్ కార్తీక్ రెడ్డి వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రీజినల్ రింగ్ రోడ్ పేరుతో తమ భూములు లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని కేటీఆర్‌కి తమ బాధను రైతులు వివరించారు. తమ భూములను తమకు తెలియకుండానే సర్వేలు నిర్వహించి, తక్కువ ధరలకు లాక్కునేందుకు ఈ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తుందని, వారి నుండి ఎలాగైనా తమ భూములను కాపాడాలని కేటీఆర్ కోరారు. బాధితుల బాధలు విన్న కేటీఆర్ వారికి ఈ విషయంలో ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడిన పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ఎక్కడ కూడా పొరపాట్లకు తావు లేకుండా చట్టప్రకారం భూసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను ఇబ్బంది పెట్టేలా భూసేకరణ చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రైతులను కాదని నిర్బంధాల మధ్య సర్వే చేసి, భూసేకరణ చేయడం తగదన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మోసం అనేది వెన్నతో పెట్టిన విద్య అని గతంలో కూడా ఔటర్ రింగ్ రోడ్) అంశంలో ఇదే విధంగా సొంత అజెండాలతో ముందుకు వెళ్లిందన్నారు. ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఒరిజినల్ అలైన్‌మెంట్ కాకుండా సొంత డబ్బులతో కడుతున్నామని చెప్పి తమవారి భూములను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తోందని అన్నారు. అందుకోసం వేలాదిమంది రైతుల జీవితాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. రీజనల్ రింగ్ రోడ్ విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని, ప్రభుత్వం ఇష్టానుసారంగా భూములు లాక్కుంటామంటే మాత్రం బాధితుల పక్షాన పార్టీ బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 సెప్టెంబర్ 2025

# టీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే..




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** విలీన దినోత్సవం'జరిపే విషయంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ దొందు దొందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు విమర్శించారు. బుధవారం సిపిఐ ఆఫీస్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగరవేసిన అనంతరం వనపర్తి అంబేద్కర్ చౌక్ లో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా తెలంగాణ సాయుధ పోరాటయోధులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మైనుద్దీన్, దొడ్డి కొమరయ్య, ఐలమ్మ, సోయబుల్లా ఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోరాట వారోత్సవాల ముగింపు సమావేశం సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములుముఖ్య అతిథిగా, అతిథిగా శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విలీన దినాన్ని జరుపుతామని ప్రకటించిన బీఆర్ఎస్ జరపలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విలీన దినోత్సవం జరుపుతారని ప్రజలు ఆశించారన్నారు. విలీన దినోత్సవం జరపకుండా ప్రజాపాలన దినోత్సవం పేరుతో ఈరోజు కార్యక్రమం నిర్వహించారని ఇది సరికాదన్నారు. దేశానికి ఆగస్టు 15, 1947లో స్వాతంత్రం సిద్ధించగా తెలంగాణకు స్వాతంత్రం రాలేదన్నారు. నిజాం నవాబు పాలనలోనే తెలంగాణ కొనసాగిందన్నారు. నిజాం నవాబు, రజాకార్లు, నిజాం తాబేదారులు ప్రజల కష్టాన్ని ప్రాణమానధనాలను దోచుకున్నారన్నారు. ప్రజలచే వెట్టిచాకిరి చేయించారని, బానిసలుగా మార్చారని, తిరగబడితే చంపేశారని, మహిళలను మానభంగాలు చేశారన్నారు. నిజాం రాక్షస పాలన నుంచి తెలంగాణను ప్రభుత్వం చేసేందుకు సిపిఐ ఆధ్వర్యంలో యోధులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగించారన్నారు. గ్రామాల నుంచి నిజాం మద్దతుదారులైన దొరలను తరిమికొట్టి 3000 గ్రామాలను విముక్తం చేసి ఎర్రజెండాలు పాతారన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించారన్నారు. సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణత్యాగం చేశారని సిపిఐది త్యాగాల చరిత్ర అన్నారు. పోరాటాలకు తలొగ్గిన నిజాం నవాబు విధిలేక తెలంగాణను సెప్టెంబర్ 17, 1948లో భారతదేశంలో విలీనం చేశారన్నారు. ఇంతటి మహత్తర ఉద్యమం ద్వారా తెలంగాణ విలీనం జరిగిందన్నారు. అందువల్ల తెలంగాణ విలీన దినోత్సవం జరపాలని సిపిఐ ఏళ్లుగా డిమాండ్ చేస్తుందన్నారు. విలీన దినోత్సవం జరపటానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారికంగా విలీన దినోత్సవం జరిపే దాకా సిపిఐ పోరాడుతుందన్నారు. నాడు ప్రజల కష్టాలను కడతేర్చేందుకు సిపిఐ సాయుధ పోరాటం సాగించిందని నాటి యోధుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎర్రజెండా కింద పోరాడాలన్నారు. అందుకోసం గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు జె చంద్రయ్య, శ్రీరామ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, లక్ష్మీనారాయణ, వంశీ, బుచ్చన్న, రమణ, జ్యోతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎకరానికి రూ. 20వెలు నష్ట పరిహారం అందించాలి
- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వి రాజ్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీటిలో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వి రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని వివిధ గ్రామాలలో నీటిలో మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా చాలా మండలాలలో భారీ వర్షాలకు పంట పొలాలలో నీళ్లు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. నష్ట పోయిన రైతులకు ఎకరానికి 20 వెలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు సంగప్ప, ధనంజయ, రాజు, జగన్ పాటిల్, బుచప్ప, శోభన్, మల్లికార్జునశెట్టి రైతులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

- ఎంఈఓ బాలాజీ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** క్రీడలతో మానసిక శారీరక దారుఢ్యం ఉల్లాసం పెరుగుతాయని నారాయణపేట మండల విద్యాధికారి బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఎంపిక అండర్ 14, 17 బాల బాలికలు కబడ్డీ వాలీబాల్ కో కో మండల స్థాయి పోటీలను నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ క్రీడలు శరీరానికి ఎంతో శక్తినిస్తాయ ని క్రీడల వల్ల ఉల్లాసము జ్ఞాపకశక్తి ,క్రీడల వలన శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. గుండె బలోపేతం అవుతుందనీ బరువు తగ్గుతారనీ, రోగనిరో ధక శక్తి పెరుగుతుం దని. మానసికంగా ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయ న్నారు.సామాజికంగా జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ అలవడ తాయనీ. ఇవే కాకుండా క్రీడ లు సామాజికంగా, వృత్తిప రంగా కూడా లాభదాయకం అని తెలిపారు.ఈ కార్యక్ర మంలో జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ , నరసింహ,ఎస్ ఏ పిడి రమణ శ్రీధర్ నరసింహులు, విద్యాసాగర్ విజయకుమార్ రవి గణేష్ భాను ప్రకాష్ పర్వీన్ బేగం అనిత అత్తర్ పాషా వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



**కృష్ణ, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని బుధవారం కృష్ణ మండలం క్షిరలింగేశ్వర దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్ప గౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్ విమర్శించారు. బీఆర్ఎస్-బీజేపీ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తహసిల్దార్,ఎంపీడీఓ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం ప్రజలకు నష్టం కలిగించిందన్నారు. రైతుల భూములు శేషాద్రి కంపెనీకి వెళ్లిపోయినా, బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యేతో కలిసి లాభాలు పంచుకుని మౌనం వహించారని ఆరోపించారు. సత్యసాయి త్రాగునీటి పథకం ఇంకా కొనసాగుతున్నప్పటికీ, పైప్‌లైన్ సమస్యల్ని రాజకీయ లాభం కోసం వాడుకుంటున్నారన్నారు.గుర్జాల్ రహదారి నిర్మాణంలో 10 సంవత్సరాలుగా జెడ్పీటీసీ, ఎంపీపీలు, ఉన్నా కూడా పనులు జరగకపోవడం వారి పాలన వైఫల్యం కాదా..?? అని ప్రశ్నించారు. బీజేపీ కారణంగా కరోనా సమయంలో ట్రైన్ స్టాప్‌లు తీసివేయబడ్డాయి, ఇప్పుడు మళ్లీ ఒక్క ట్రైన్ స్టాప్ తెచ్చుకొని పాలాభిషే కాలు చేసుకోవడం హాస్యాస్పదమని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కృష్ణ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం ప్రారంభం, గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్ వాడీ భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు నిర్మాణంలో ఉన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, వంటి పథకాలు అమలు చేస్తున్నారు.హెల్త్ సెంటర్, హిందూపూర్-చేగుంట రోడ్డు ప్యాచ్ వర్క్, కృష్ణ బ్రిడ్జ్-గుర్జాల్ రహదారి, క్రిష్ణ-నల్లగట్టు రోడ్డు వంటి పనులు ప్రగతి దశలో ఉన్నాయన్నారు. ముడుమాల్ నిలువు రాళ్లను టూరిజం స్పాట్‌గా గుర్తించేందుకు మంత్రి వాకిటి శ్రీహరి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు పంట పెట్టుబడి సాయం, పేదలకు ఇళ్ల మంజూరు, యువతకు ఉపాధి అవకాశాలు,మహిళలకు ఉచిత బస్సు, వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు.అభివృద్ధి హైదరాబాద్ వరకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు చేరేలా ప్రభుత్వం చూస్తుందన్నారు. విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల నాయకులు పల్లె సురేష్, విజయప్ప గౌడ, మాజీ సర్పంచ్ లక్ష్మీ నారాయణ, కృష్ణమూర్తి, సోమ సంతోష్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, గుర్జాల్, ప్రభాకర్ రెడ్డి, అన్వర్, రవి పాటిల్, రాకేష్, సంతోష్ పాటిల్, మారెప్ప, గౌరప్ప, సిద్రం, ప్రతాప్, తిమ్మప్ప, షేకప్ప గౌడ, గుండల్ అంజేయులు, జవహర్ లాల్, మహదేవ్, షకీరప్ప, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అంబ్రెష్ గౌడ, రాచప్ప, జి. శరన్, చందు, చెట్టి మహదేవ్, వాకిటి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలి

- వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య



**నంగునూరు, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** ఔటర్ రింగ్‌రోడ్ పనులలో భాగంగా మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తికాక బాటసారులు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పనులు వేగవంతంగా జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా పూర్తి చేయడం లేదని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ వేణు చక్రవర్తి అన్నారు బుధవారం నాడు మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించినటువంటి ఏ ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న పనులు ప్రారంభించకుండా కనీసం పట్టించుకోవడంలేదని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం పనులు ప్రారంభించి పనులను పూర్తి చేసినట్లయితే గ్రామస్తులకు రైతులకు బాటసారిలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు ఈ పనులు చేయకపోవడంతో కరీంనగర్ రోడ్డుకు వరంగల్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రింగ్ రోడ్డు బ్రిడ్జి పనులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న పనులను పూర్తిచేసి బీడ్జిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ బ్రిడ్జి పనులు పూర్తికాకపోవడంతో రాబోయే బతుకమ్మ పండుగకు మహిళలు చెరువులో బతుకమ్మలకు వేసేందుకు పోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తది అన్నారు కావున సంబంధిత అధికారులు ప్రభుత్వం స్పందించి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్లు ఓజాల్ బాలమల్లు మాజీ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వేణు నాయకులు మానాన్ భూపాల్ రాంబాబు రవి గాండ్ల నరసయ్య లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతా..

- కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం
- జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను అన్ని రంగాలలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిల్పడానికి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో జరిగిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి ,పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా జిల్లా ప్రజలకు మంత్రి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ రాష్ట్రం (హైదరాబాద్ స్టేట్) ఏర్పడిందన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానికి చేరువగా ఉన్న సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలోని అగ్రగామిగా అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, ఉచిత గృహ విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం, లాంటి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య, ఎస్పి పరితోష్ పంకజ్ ,టి జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి డిఆర్ఓ పద్మజ రాణి, సంగారెడ్డి జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

- కలెక్టర్ పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 దాకా ప్రతి గ్రామపంచా యతీలో స్వచ్ఛతా హి సేవకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బుధవారం జెడ్పీ కార్యాల యంలో స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు 2025 లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ స్వచ్ఛత హీ సేవకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛత పైన గ్రామ పరిశు భ్రత గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూ లన అలాగే చెత్తాచెదారం తొలగించడం వంటి కార్యక్ర మాలు అలాగే గ్రామ పంచా యతీలో గల ఎం పీ డబ్ల్యూ వర్కర్లలకు సఫాయి మిత్రా శివీర్ ద్వారా వాళ్లకు హెల్త్ చెకప్ క్యాంపులు నిర్వహిం చాలన్నారు. అందులో భాగం గానే భారతదేశమంతటా 25 సెప్టెంబర్ నాడు నాడు జాతీ య స్థాయి శ్రమదానం కార్యక్ర మాన్ని ఏక్ దిన్ ఏ ఘంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా దేశమంతటా ఉద యం 8 గంటలకు ప్రజలం దరూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ ఒక గంట సేపు పాల్గొనే విధంగా కార్యక్రమాన్ని చేపట్టాల న్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమము అక్టోబర్ 2 నాడు స్వచ్ఛభారత్ దివస్ తో ముగుస్తుందని తెలిపారు. ఈ సమాచారము అంత గౌవర్నమెంట్ అఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంటుందనీ తెలిపారు. స్వచ్ఛతహి సేవలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వచ్ఛత ప్రతి జ్ఞలో పాల్గొన్నారు.ఈ కార్య క్రమంలో డీ ఆర్ డి ఓ మొగు లప్ప, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా మేనేజర్ మాలిక్ పాషా, భార్గవ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వనపర్తి జిల్లాలోని ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వేదికపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘా రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర రావు ఉపస్థితులయ్యారు. ముఖ్య అతిథి ప్రసంగం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఇట్టి వేడుకలకు హాజరైన పార్లమెంట్ సభ్యులకు, గౌరవ శాసన మండలి సభ్యులకు, శాసన సభ్యులకు, కలెక్టర్, అదనపు కలెక్టర్లకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులకు, వివిద శాఖల జిల్లా అధికారులకు, విద్యార్థులకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, పుర ప్రముఖులకు నా హృదయ పూర్వక ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు.చరిత్రలో 1948 సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉంది. 78 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమయిందన్నారు. రాచరిక పరిపాలన నుండి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందని, అందుకే ఈ రోజున తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 555 సంస్థానాలు ఇండియన్ యునియన్‌లో కలిశాయి. హైదరాబాద్ సంస్థానం మాత్రం స్వతంత్ర రాజ్యాంగ ఉండేందుకు నిర్ణయించుకుందన్నారు. ఈ ప్రాంత ప్రజల మేరకు భారత ప్రభుత్వం "ఆపరేషన్ పోలో" చర్య ద్వారా సెప్టెంబర్ 17, 1948న తెలంగాణ ప్రాంతాన్ని ఇండియన్ యునియన్‌లో భాగం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ప్రజా పాలన దినోత్సవ వేడుకను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదన్నారు.జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి వర్యులకు, గౌరవ పార్లమెంట్ సభ్యులకు, గౌరవ శాసన మండలి సభ్యులకు, గౌరవ శాసన సభ్యులకు, ఇతర ప్రజా ప్రతినిధులకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు వివిధ శాఖల జిల్లా అధికారులకు, శాంతిభద్రతల నిర్వహణలో అహర్నిశలు కృషిచేస్తున్న జిల్లా ఎస్పీ మరియు పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందికి, నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మీ అందరికి మరొక్కసారి "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం" సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న మొక్కజొన్న సాగు

- ఆదిలాబాద్‌లో తగ్గుతున్న పత్తి విస్తీర్ణం
- పెట్టుబడులు ఎక్కువ అవుతుండటంతో ప్రత్యామ్నాయం



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో ఆదిలాబాద్ జిల్లా అనగానే మొదటగా గుర్తుకు వచ్చే పంట పత్తి పంట. వందల సంవత్సరాల నాటి నుంచి రైతులు పత్తి పంటను పండిస్తూ వస్తున్నారు. ఇక్కడ పండించిన పత్తిని ఘటాన్ ల రూపంలో తయారు చేసి విదేశాలకు ఎగుమతి అవుతూ ఉంటుంది. అందుకే జిల్లాలో రైతులు పండించిన పత్తిని ముద్దుగా తెల్ల బంగారం అని అంటూ ఉంటారు. కానీ రాను రానూ ఈ తెల్ల బంగారం పంట సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం కారణం పత్తి పంటకు ఖర్చు ఎక్కువ అవుతుండడంతోనే అని అనేక కారణాలు వినిపిస్తున్నాయి. ఈ వర్షాకాలం పంటలో పత్తికి బదులుగా ఖర్చు తక్కువగా ఉండే మొక్కజొన్న పంటను ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు. రైతులకు ఉన్న వ్యవసాయ భూమిలో సగం పత్తి పంటను పండిస్తే మిగతా సగం ఈ మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. లేదా సింహ బాగం భూమిలో పత్తిని పండిస్తూ మిగతా మిగిలి ఉన్న భూమిలో ఈ మొక్క జొన్న పండిస్తున్నారు. ఈ పంటకు ఎక్కువగా ఖర్చు లేకపోవడం కారణంగా కొంత మంది రైతులు ఈ పంట పండించేందుకు అమితాసక్తి కబరుస్తున్నారు.

### ఖర్చు ఎక్కువ ఉండడంతోనే పత్తికి దూరం

జూన్ మాసంలో పత్తి విత్తనం నాటిన నుంచి పంట చేతికి వచ్చేవరకు రైతులకు పత్తి పంటకు చేపట్టే ఖర్చు తడిసి మోపెడు అవుతుందని కొంత మంది రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా పత్తికి దౌర, కొట్టడం, ఇంకా పురుగుల తెగుళ్ళు సోకకుండా వివిధ రకాల కంపెనీల క్రిమీ సంహారక మందులు పిచికారీ ఉపయోగించడం కారణంగా, మరియు తరచూ గడ్డి కలుపులు తీయడం, ఇంకా యూరియా వంటి మందులు వాడుతుండటం వలన ప్రతీసారి వేల రూపాయల్లో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. దీంతో చిన్నాచితక రైతులు అప్పుల పాలు అవుతున్నారు. ఈ ఖర్చుల బాధ నుంచి తప్పించుకోవడానికి మొక్క జొన్న పంటను పండిస్తున్నామని రైతులు చెప్తున్నారు. ఈ మొక్కజొన్న పంట విత్తనం వేసిన కొద్ది రోజులకు మొక్కలు కొంత పెరిగిన తరువాత పంటకు తెగుళ్ళు సోకకుండా ఓ సారి ఏదైన మందు పిచికారీ చేసి మళ్లీ పంట చివరి దశలో యూరియా డీఏ ఒక్కసారి వేస్తే సరిపోతుందని మళ్ళీ పంటకు ఏమి వేసే అవసరం ఉండదని అక్టోబర్, నవంబర్ మాసాల్లో పంట చేతికి వస్తుందని లాభం కూడ ఉంటుందని రైతులు స్పష్టం చేస్తున్నారు.

### పత్తి సగం మొక్క జొన్న సగం

రైతులు పండిస్తున్న వ్యవసాయ భూమిలో పూర్తిగా పత్తి వేయకుండా కొత్త పద్ధతి అవలంబిస్తున్నారు. పత్తి పంటకు ఎక్కువ ఖర్చు పెట్టలేక సగం భూమిలో మాత్రమే పంట వేసి మిగతా సగం భూమిలో ఖర్చు తక్కువగా వచ్చే ఈ మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం సంబరాలు

- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణం లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం మంత్రి అసెట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్, ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐడిఓసి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** ఐడిఓసి నిర్మాణ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం (కలెక్టరేట్ కాంప్లెక్స్) నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కలెక్టరేట్ భవనం ను కలియ తిరుగుతూ స్టేట్ బోర్డు ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాలు, ఇతర శాఖల అధికారులకు కేటాయించే గదులను పరిశీలించారు. ఈఈ ఆర్ అండ్ బి కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా గ్రానైట్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్ మ్యాన్ పవర్ ను పెంచి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ఎంట్రన్స్ వద్ద రెడ్ సెల్ తో రోలింగ్ చేయించి సుందరీకరణ పనులు చేయాలని చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ అండ్ బి శ్యామ్ సింగ్ సంబంధిత శాఖ అధికారులు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్17 (జనం సాక్షి) :** నిర్మల్ మున్సిపాలిటీ లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎట్టకేలకు బుధవారం సమ్మె విరమించారు. గత మూడు రోజులుగా కార్మికులు వేతనాల కొరకు సమ్మె బాట పట్టారు. దీంతో పట్టణంలోని పలు వార్డులో మురికి కాలువలు, రోడ్ల పై చెత్తతో పట్టణమంతా పారిశుధ్యం లోపించి మురికిమయమైంది. బుధవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ కార్మికులతో చర్చించి ఒకనెల వేతనం చెల్లిస్తామని. మిగతా పెండింగులో ఉన్న వేతనాలను త్వరలోనే చెల్లించేందుకు పై అధికారులతో మాట్లాడి బకాయిల ను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన ములుగు జిల్లా ఎస్పీ



**ములుగు బ్యూరో, సెప్టెంబర్17 (జనం సాక్షి):** ములుగు జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల భద్రత,శాంతి భద్రతా పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ,డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్,ములుగు డిఎస్పి రవీందర్, సిఐలు, ఆర్ఐలు,ఎస్సైలు ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



**పాలకుర్తి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** ఈ నెల 22, 23, 24 తేదిల్లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్లబోయిన చరణ్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చరణ్ ను ఆ పాఠశాల పీడీ మామిండ్ల సోలమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బలరాం, వెంకన్న, అశోక్, రవి, సుమతి, శోభ, అభినందించారు.

# విద్యార్థులకు క్వాంటం సైన్స్ పైన అవగాహన ఉండాలి

- వరంగల్ డీఈఓ రంగయ్య నాయుడు



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** మట్టేవాడ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరంగల్ జిల్లా స్థాయి జాతీయ సైన్స్ సెమినార్ నిర్వహించారు. వరంగల్ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమినార్ పోటీల్లో 'క్వాంటం యుగం ప్రారంభం- అవకాశాలు, సవాళ్లు అనే అంశం మీద" జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎంపిక కాబడినటువంటి 9, 10వ తరగతి విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి సెమినార్‌ను ప్రదర్శించారు. సెమినార్ సమర్పణతోపాటుగా న్యాయ నిర్ణేతలు మౌఖిక ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా అంశానికి సంబంధించి విద్యార్థులలో ఉన్న సమగ్ర అవగాహనను పరీక్షించారు. పింగిలి కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ డాక్టర్ ప్రతిభ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయ విషయ నిపుణులు పెట్లోజు సురేష్, దేవులపల్లి కిరణ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముగింపు సమావేశం, బహుమతుల ప్రధానోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రధానం చేశారు. చెన్నారావుపేట మండలం లింగాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని బూర మానస జిల్లా స్థాయి సెమినార్ లో మొదటి స్థానం పొంది రేపు ఎస్సీఈఆర్టీలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ కి అర్హత సాధించి జిల్లా తరపున పాల్గొనబోతోంది. శ్రీ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థి సహస్రాక్ష్ ద్వితీయ స్థానం, నర్సంపేట అక్షర హైస్కూల్ విద్యార్థిని హరిప్రియ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు మాట్లాడుతూ 'సాంకేతికంగా ప్రపంచం చాలా దూసుకుపోతోంది, ప్రస్తుతం ఉన్న సూపర్ కంప్యూటర్లు 1000 సంవత్సరాలు తీసుకొని చేయగలిగే పనిని రానున్న క్వాంటం కంప్యూటర్లు కొన్ని సెకండ్ల వ్యవధిలో చేయగలగనున్నాయి, ఇంతటి సాంకేతిక విస్ఫోటనం జరుగుతున్న ఈ ప్రపంచంలో విద్యార్థులు క్వాంటం సైన్స్ పట్ల, శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న పలు మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండడం చాలా అవసరం" అని పిలుపునిచ్చారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ "గత సంవత్సరం 'కృత్రిమ మేధ' అంశం మీద జరిగిన జాతీయ సైన్స్ సెమినార్ యొక్క రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ స్థానం మన జిల్లాకే చెందిన లింగాపురం విద్యార్థి వినయ్ సెలెక్ట్ అయ్యి ముంబైలో జరిగిన జాతీయ సైన్స్ సెమినార్ లో పాల్గొని రావడం గుర్తు చేసుకుంటూ, ఈ సంవత్సరపు మరింత క్లిష్టతరమైన అంశం అయినప్పటికీ క్వాంటం శక్తికి సంబంధించిన అంశం పైన 9 మరియు 10వ తరగతి విద్యార్థులు అత్యంత అద్భుతంగా సెమినార్ ప్రదర్శన చేయడం మన వరంగల్ జిల్లా విద్యార్థుల యొక్క సైన్స్ లో అభిరుచి, ప్రతిభకు తార్కాణమని, అందుకు ఎంతో కృషి చేస్తున్న విద్యార్థుల సైన్స్ టీచర్లు అభినందనీయులు " అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి మట్టెవాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని లక్ష్మీ నరసింహ, శ్రవణ్, పరమేశ్వర్ తదితరులు నిర్వహించారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** కాంగ్రెస్‌తోనే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగాపురం, కోనాపురం ఉప్పరపెల్లి, అక్కల్ చెడ, అమీనాబాద్, బొజేరువు, లింగగిరి గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. మండలం లోని అన్ని గ్రామాలకు త్వరలోనే నిధులివ్వడం జరుగుతుందని మహిళ సంఘాల భవనాలకు త్వరలోనే నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద సుమారు రూ. 2 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎంపీడీవో నల్ల శ్రీవాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ఆయా గ్రామాల కాంగ్రెస్ అద్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## తమ ప్రభుత్వం ఏర్పడితే అధికారికంగా విమోచన దినోత్సవం

- సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తేదీ సెప్టెంబర్ 17న అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహిస్తామని సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. బుధవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో జాతీయ జెండా ఆవిష్కరణ గావించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ విమోచన దినోత్సవం ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, నాయకులు వీరభద్ర చారి, విశ్వేశ్వరరావు, కొప్పుల శంకర్, సిందం శ్రీనివాస్, పుల్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ప్రకటించాలి

- ఏఎన్‌సి టార్గెట్ విధానాన్ని ఆపాలి
- ఆశా యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** క్షేత్రస్థాయిలో గ్రామాల్లో అందరికీ నిరంతరం ఆరోగ్య సేవలు అందించే ఆశాలకు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రకారం 18 వేలు ఇవ్వాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ లో మంత్రి సీతక్క కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు మాధవి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం 18000 రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్నా ఆరు నెలల పి ఆర్ సి డబ్బులు తక్షణమే విడుదల చేయాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆశా కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని నాణ్యత మైన యూనిఫామ్లు తక్షణమే అందజేయాలని మట్టి ఖర్చులు ప్రమాద బీమా సంబంధించిన విషయాలపై జీవో జారీ చేయాలని ఆశా ల సమస్యలపై ముఖ్యమంత్రి తో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. పని భారం పెరిగిందని అన్నారు. ఏ ఎన్ సి టార్గెట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవిత, నాగమణి, మాధవి, మంజుల, యశోద, రమాదేవి, సుజాత, రాణి, జ్యోతి తో పాటు 50 మంది ఆశాలు పాల్గొన్నారు.

# దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 17 (జనం సాక్షి):** బిఆర్ఎస్ నేతల ప్రవర్తన సిగ్గుచేటని, దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి బిఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. బుధవారం హనుమకొండ లోని డిసిసి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం కోల్పోయిన తరువాత బి ఆర్ ఎస్ నేతలు సత్య హరిచంద్రుల్లా మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. ప్రజా క్షేత్రంలో ప్రతిపక్షం కూడా ఉండాలని ప్రజలు ఎన్నుకుంటే నాటి కేసీఆర్ కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. దళిత నాయకుడు ప్రతిపక్ష నేతగా ఉంటే ఓర్వలేని కుసంస్కారి కేసీఆర్ అని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వాసం లేదు అంటున్న మీరు దమ్ముంటే కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావు రాజీనామా చేసి ఎన్నికల్లో గెలవండి అని సవాల్ విసిరారు. ప్రభుత్వం పై ప్రత్యక్ష పోరాడటం చేత గాక బీజేపీ పార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్న మీరు విమర్శించి దిగజారకండి అని అన్నారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల తెలంగాణ ప్రజలు ఒక్క సీటు రాకుండా టిఆర్ఎస్ ను బొంద పెట్టిన బుద్ధి మారలేదని, వీరి వ్యవహార శైలి చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బిఆర్ఎస్ గెలవదు అన్నారు.

# సోమగూడెంలో విచ్చలవిడిగా ప్రభుత్వ, అసైండ్ భూములు అమ్మేశారు

- అమాయకులకు అంటగట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న భూ బాధితులు
- ఆకెనపల్లి శివారులోని సోమగూడెంలో నాయకుల లీలలు
- రూ. లక్షలు సంపాదిస్తూ సామాన్యులకు టోకరా
- కబ్జాలు చేసి అమ్మేది వారే, ధర్నాలు చేస్తూ హంగామా చేసేది వారే...



**కాసిపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులోని సోమగూడెంలోని సర్వే నెంబర్ 3పైకి, 2పైకిలోని ప్రభుత్వ భూములు, అసైండ్ భూములను పలువురు స్థానిక నాయకులు అమాయకులకు అంటగట్టి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. పలువురు నాయకులు సమస్యాత్మక భూములను తక్కువ ధరకు వస్తున్నాయని ఆశలు చూపి సరైన పత్రాలు లేకుండానే అమాయకులకు అంటగట్టారు. అసలే పత్రాలు లేకుండా నాయకుల మాటలు నమ్మి కొనగోలు చేశారు. తక్కువ ధరకు వస్తున్నాయనే ఆశతో రూ. లక్షలు పెట్టి కొనుగోలు చేశారు. కాని ఇప్పుడు ఆ భూములు కొన్న అమాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ భూములు ప్రభుత్వం, అసైండ్ భూములుగా ఒక్కొక్కటిగా తెలుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుంతుందోనని, తాము కొన్న భూములు ఏం అవుతాయోనని భూ బాధితులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలా సమస్యాత్మక భూములను మాత్రం క్రయ, విక్రయాలు చేస్తున్న నాయకులు రూ. లక్షలు సంపాదిస్తూ, సామాన్యులను మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అసలు అసైండ్ భూములు పట్టాలయ్యే అవకాశం లేదు, కాని కొంత మంది నాయకులు పట్టాలున్నాయని చూపడం ఆశ్చర్యం కలిగించే విషయం. దీనిపై విచారణ చేస్తే భూ ఆక్రమణలు ఎన్నో భయట పడుతాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో సోమగూడెం గ్రామం చుట్టూ ప్రభుత్వ, అసైండ్ భూములే ఉండేవి, ఇప్పుడు మొత్తం నాయకుల కబ్జాలోకి వెళ్లిపోయాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ భూములను మొత్తం కూడా నాయకుల కను సన్నలోనే క్రయ విక్రయాలు జరిపి మొతం అమాయకులకు అంటగటారు. సరైన పత్రాలే లేకుండా ఇష్టానుసారంగా అమ్మకాలు చేశారు. దీంతో ఇప్పుడు అమాయకులు ఇబ్బందులు పడుతున్నారు. నాయకులను అడిగితే మళ్లీ ఏం ఇబ్బందులు పడుతారోనని ముందుకు రావడం లేదని తెలుస్తుంది. ఇటీవల అవి ప్రభుత్వ, అసైండ్ భూములుగా తేలుతున్న సమయంలో బాధితులు చేస్తున్న ఆందోళనలో అక్రమంగా కబ్జాలు చేసి అమ్మిన నాయకులే ముందుండి పోరాటం చేయడం హాస్యస్పదమని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ, అసైండ్ భూములు కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా నాయకుల మాయమాటలను నమ్మి కొనుగోలు చేసి భాధ పడుతున్నారు బాధితులు. ఇది కాక ఇప్పుడు భూములు కొనుగోలు చేసిన బాధితుల వద్ద నుంచి భూములను కాపాడాలంటే మళ్లీ డబ్బు ఖర్చు అవుతాయని దళారీ అవతారం ఎత్తి మళ్లీ డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. లక్షలు పెట్టి కొని నష్టపోతామనే బాధతో ఏమైనా సమస్యలు వస్తాయోనని నాయకులు అడిగినంత అప్పగిస్తూ బాధితులు ఆవేదన చెందుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. కొనిపివ్వడం సమస్య వస్తే మళ్లీ డబ్బులు పెట్టాలని వసూళ్ల చేయడం ఇక్కడ నాయకులకు శాశ్వత ఆర్థిక మార్గంగా ఎంచుకున్నారనే ఆరోపణలున్నాయి. నిలదీస్తున్న కొంత మందికి మాత్రం మొత్తం మేమే చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. సరైన పత్రాలు లేని భూములను కొనుగోలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. దీనిపై అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని , ఇప్పటికే నాయకుల చేతుల్లో మోసపోయన వారికి కబ్జా దారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని, ప్రస్తుతం కబ్జాలో ఉన్న ఖాళీ ప్రభుత్వ, అసైండ్ భూములను స్వాధీనం చేసుకొని, ప్రభుత్వ పథకాలు ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 సెప్టెంబర్ 2025

# పర్యాటకులను ఆకర్షించేలా మినీ ట్యాంక్‌బండ్‌ను తీర్చిదిద్దాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై సమీక్ష



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రదేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మినీ ట్యాంక్ బండ్ తో పాటు న్యాల్ కల్ రోడ్ ఆర్టీసీ డిపో–2, పద్మానగర్, గౌతంనగర్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రదేశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అనువైన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద ఆహ్లాదకర వాతావరణం, ఉద్యానవనం, చిన్నారుల కోసం ప్లే జోన్ తదితర వసతులు ఉండడాన్ని గమనించిన కలెక్టర్, పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరుపయోగంగా ఉన్న బాక్స్ క్రికెట్ ను వినియోగంలోకి తెచ్చేందుకు వీలుగా దీని నిర్వహణను ప్రైవేట్ వారికి వేలంపాట ద్వారా కేటాయించాలని ఆదేశించారు. రఘునాథ చెరువులో బోటింగ్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మడిగెలకు పూర్తి స్థాయిలో అద్దె వసూలు చేయాలని, ప్రస్తుతం ఇందులో ఉంటున్న వారు అద్దె చెల్లించకపోతే వారి ఒప్పందాన్ని రద్దు చేసి కొత్త వారికి మడిగెలు అద్దెకు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరుతుందని అన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా పచ్చదనాన్ని పెంపొందిస్తూ, మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని అన్నారు. అనంతరం పద్మానగర్, న్యాల్కల్ రోడ్, గౌతంనగర్ లలో చేపట్టనున్న ఇంజనీరింగ్, రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన ప్రదేశాలను కలెక్టర్ సందర్శించి, అధికారులకు సూచనలు చేశారు. గౌతంనగర్ లో మంచినీటి ట్యాంక్ కు మరమ్మతులు జరిపించాలని, ట్యాంక్ చుట్టూ నీరు నిలువ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై కలెక్టర్ సమీక్ష**

నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల పనితీరుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారం రోజుల క్రితం నిర్వహించిన సమీక్ష సందర్భంగా చేసిన సూచనలను పక్కాగా పాటిస్తున్నారా, ఏమేరకు ప్రగతి సాధించారు అనే అంశాలను కలెక్టర్ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరులో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రెవెన్యూ విభాగం పనితీరులో మార్పు కానరాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటి వరకు పల్లెలలో నెలకొన్న వెట్టి చాకిరీ, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృ భాష అణిచివేత, మతపరమైన నిరంకుశ దోరణులు తొలగి 17 సెప్టెంబర్ 1948 న హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారినదని తెలంగాణ వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఏం కోదండ రెడ్డి అన్నారు. బుదవారం కామారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**మేళ్లచెరువు, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి రికార్డ్స్ తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చేలా రిసెప్షన్ సెంటర్ పటిష్టంగా పనిచేయాలి ప్రతి విషయాన్ని రికార్డ్స్ నందు నమోదు చేయాలని. ఆంధ్ర రాష్ట్రంలో సరిహద్దు కలిగి ఉన్నందున సిబ్బంది అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని సరిహద్దు వెంట నిగా ఉంచాలని ఆదేశించారు. అసాంఘిక కార్యక్రమాలు అక్రమ రవాణా జరగకుండా పనిచేయాలని సూచించారు. ప్రజలతో మంచి సంబంధాలను ఏర్పాటు చేసుకొని ముందస్తు సమాచారం సేకరించి నేరాల నివారణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆదేశించారు.

# సీఎంఆర్ లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** సీఎంఆర్ లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో మిల్లర్లు, అధికారులతో సిఎంఆర్‌పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిఎంఆర్ గడువును నవంబర్ 12 నాటికి పెంచడం జరిగిందని తెలిపారు.మిల్లర్లు అందరూ సహకరించి గడువు నాటికి సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు.మిల్లులను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేస్తూ సీఎంఆర్ పూర్తి చేసే విధంగా చూడాలని ఆదేశించారు.వచ్చే సీజన్ కు సంబంధించి ప్రతి మిల్లర్ తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, ఏఎస్ఓ శ్రీనివాస రెడ్డి,మిల్లర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** మహిళల ఆరోగ్యం పెంపొందించుట కోసం భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమం ఈరోజు 17వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ చేతులమీదుగా ప్రారంభించినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలియజేశారు. స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ అనే ఈ నూతన కార్యక్రమం ఈరోజు నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు కొనసాగుతుందని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ, జిజిహెచ్ సూపర్డెంట్ శ్రీనివాసరావు, డి సి హెచ్ ఎస్ శ్రీనివాస ప్రసాద్, ప్రోగ్రామ్ అధికారులు జిల్లా అధికారులు వైద్య సిబ్బంది హాజరయ్యారు. తదనంతరం పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ చేతులమీదుగా ప్రత్యేక వైద్య నిపుణుల ఆరోగ్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమమని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమ వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతున్నదని తెలియజేశారు. నిజామాబాద్ పట్టణంలోని మరియు జిల్లాలోని మహిళలందరూ ఈ కార్యక్రమంలోని వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ మోబిలైజేషన్ ద్వారా లబ్ధిదారులను గుర్తించి ప్రత్యేక వైద్యుల శిబిరాలకు తరలించాలని, ఇంకా ఉన్నతమైన ఆరోగ్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. లబ్ధిదారులకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవల గురించి వివరించి వారి అవసరానికి అనుగుణంగా మొబిలైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలినా చింతియాన్ మావి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, జి జి హెచ్ డాక్టర్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ పిఓ డా. రాజు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అంజన, డిటిసిఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునేన, స్థానిక కార్పొరేటర్ ప్రవల్లిక, శ్రీధర్, డి ఎం ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, డీఎస్ఓ డాక్టర్ నాగరాజు, ఆయుష్ ప్రోగ్రామ్ అధికారి గంగాధర్, డి ఈ డాక్టర్ వెంకటేష్, డాక్టర్ తిరుపతిరావు, డిపిఓ విశాల, డి హెచ్ ఈ ఘన్పూర్, వెంకటేశ్వర్లు, స్వామీ సులోచన దుబ్బా, గౌతమ్ నగర్, సిఎస్ కాలనీ పట్టణారోగ్య కేంద్రాల పర్యవేక్షక సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూసలపాడులో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ

- రెండు నెలలు గడిచినా చేపట్టని మరమ్మత్తులు
- త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**మాడ్గులపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రజలకు సురక్షిత త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన మిషన్ భగీరథ పథకం కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతుంది. దీంతో గ్రామీణ ప్రజలకు ఇంటింటికి త్రాగునీటిని అందించలేని పరిస్థితి నెలకొంది. పూర్తి వివరాలలోకి వెళితే మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ కు లీకేజీ కావడంతో మరమ్మత్తులు చేపట్టాలని గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేయడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి మిషన్ భగీరథ పనులు మొదలుపెట్టి రెండు నెలలు గడిచినప్పటికీ పైప్ లైన్ మరమ్మత్తు పనులు పూర్తి కావడం లేదు.ఈ విషయమై కార్యదర్శి ని అడిగితే.దురుసుగా మాట్లాడడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.. సుమారు 9 నుండి 10 ఫీట్ల లోతు గుంట తీయడంతో రాత్రి వేళలో వృద్ధులు , చిన్నారులు, గ్రామ ప్రజలు గుంతలో పడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని గ్రామ ప్రజలకు కోరుతున్నారు.

# బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి
- డైట్ మెనూ పాటించాలి
- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**వైరా, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** వైరా నియోజకవర్గం ముసలిమడుగు గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముచ్చటించారు. అధ్యాపకులు బోధిస్తున్న పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా? మీరు బాగా చదువుతున్నారు..? మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి..? డైట్ చార్ట్ ప్రకారం ఆహారం అందిస్తున్నారా..? అని బాలికలను ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిర్ణయించిన డైట్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజు గుడ్డు, అదేవిధంగా చార్ట్ ప్రకారం చికెన్, మాంసాహార వంటలను అందిస్తున్నారని చెప్పారు. పాఠ్యాంశాలను అధ్యాపకులు చక్కగా బోధిస్తున్నారని స్టడీ అవర్స్ లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తూ చదువు చెబుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురుకుల పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థినులకు డైట్ మెనూతో పాటు బాలికలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

- మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు




**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** విద్య,వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, వాణిజ్యం, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు.ప్రపంచంతోనే పోటీపడేలా ప్రణాళిక బద్దంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రైతు, యువత,కార్మికులు, సామాన్య ప్రజలు అందరిని దృష్టిలో పెట్టుకొని గడిచిన 20 నెలలు సంక్షేమ పాలన అందించామని అన్నారు.యువతకు ప్రభుత్వ ఉద్యోగ కల్పన చేయటం జరిగిందని అన్నారు.నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో, రాష్ట్ర సాధనలో అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. మంగళవారమే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రిని కలిసి యూరియాను ఎక్కువ మొత్తంలో సరఫరా చేయాలని కోరారని తెలిపారు.అదేవిధంగా ఫీజు రీయిబర్స్మెంట్ కై ప్రభుత్వం 600 కోట్లు మంజూరు చేసిందని ఈ సందర్భంగా తెలిపారు.

# పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** పోషణ మాసంలో భాగంగా పిల్లలకు,కిశోర బాలికలకు,మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం పోస్టర్ ని ఆవిష్కరించి మాట్లాడారు.17 సెప్టెంబర్ 2025 నుండి 16 అక్టోబర్ 2025 వరకు పోషణ మాసం కార్యక్రమాలను అంగన్వాడి స్థాయి నుండి ప్రాజెక్టు స్థాయి వరకు ప్రణాళిక ప్రకారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణిని ఆదేశించారు.నెలరోజుల వ్యవధిలో ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాలని అన్నారు.పిల్లలు పోషకాహారం తీసుకునేలా ప్రేరేపించడం, వారి పెరుగుదల పర్యవేక్షణ, పోషణలోపం నివారణ, మహిళల ఆరోగ్యం,బాలలకు పోషణతో పాటు చదువు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు.పిల్లల ఎత్తు, బరువులను కొలవడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించడం, వివరాలను పోషణ ట్రాకర్ లో నమోదు చేయడం, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి,డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డిఈఓ అశోక్,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల సీజింగ్‌లో అవకతవకలు ఎంతవరకు సమంజసం

- మిద్దెల మల్లారెడ్డి



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాల విషయంలో అధికారుల ద్వంద్వ వైఖరి గర్హనీయమని చట్టం ఎవరికి చుట్టం కాదని, అందరికీ ఒకటే నియమమని 'ప్రజల కోసం' సంస్థ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల మల్లారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ శ్రీరాంనగర్ కాలనీ సి – బ్లాక్ పరిధిలో నెలకొన్న అక్రమ కట్టడాల సీజ్ విషయంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు మిద్దెల మల్లారెడ్డి ఒక మెమొరాండంను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అవినీతి గుట్టలుగా పేరుకుపోయిందని, ఇక్కడి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే అక్రమ కట్టడాలు... అయినా వాటిని సీజ్ చేయడంలో సైతం తీవ్ర అవకతవకలకు పాల్పడడం అధికారుల దాస్తీకానికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. శ్రీరామ్ నగర్ కాలనీ సి – బ్లాక్ పరిధిలోని ప్లాట్ నెంబర్ 944, 266 లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నవని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వచ్చి వాటిని సీజ్ చేయడం మీడియా ద్వారా తెలుసుకున్నానని అయితే ఇదే బ్లాక్ లో పక్కనే ఉన్న 260, 262, 263 నెంబర్లు గల ప్లాట్లలో ఇంతకు మించిన భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని, కానీ వాటిని సీజ్ చేసే నిబద్ధతగల అధికారి లేకపోగా పరోక్షంగా వారికి వంత పాడుతూ లక్షల రూపాయలు దండుకొని తెరవ వెనుక అండదండలు అందించడం వారి నికృష్ట వైఖరికి నిలువెత్తు నిదర్శనం అని ఆయన దుయ్యబట్టారు. ఒక్కొక్క అక్రమ నిర్మాణానికి ఏ స్థాయి అధికారి ఎంత బొక్కాడో తెలిస్తే తాము ఇక నిరసన కార్యక్రమాలు చేపట్టబోమని, శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తమ ఉద్యోగ ధర్మాన్ని లంచాలకు అమ్ముకొని ఆత్మవంచన చేసుకుంటున్నారని నిర్ధారించుకుంటామని ఆయన ఎద్దేవా చేశారు. రూల్ అనేది రాజ్యాంగ వ్యవస్థల ద్వారా సమాజంలోకి అడుగుపెడుతుందని 'రూల్ ఈజ్ రూల్ రూల్ ఫర్ ఆల్ ' అన్న ప్రాథమిక నియమాన్ని సైతం తుంగలో తొక్కి అవినీతి, అక్రమాలకు పేటెంట్ తీసుకున్న శేర్లింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను టచ్ చేసే రాష్ట్రస్థాయి ఉన్నత ప్రభుత్వ అధికారి కానీ, వ్యవస్థ కాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానములో ఉన్నదా అనే సందేహం తమకు కలుగుతుందని, కొన్ని దశాబ్దాలుగా శేర్లింగంపల్లి మండలం పరిధిలో కొనసాగుతున్న అవినీతి భాగోతాలను చూస్తుంటే పసి పిల్లవాడు సైతం ఇదే సందేహాన్ని వ్యక్తం చేసిన అది అతిశయోక్తి కాదని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. 'రేటు' కుదిరితే అక్రమమైన సక్రమమే అవుతుందని, అడిగినంత ఇచ్చుకోకపోతే అది సక్రమమైన అక్రమంగా మార్చి సవాలక్ష కొర్రీలు వేసి జీవితంలో మరోసారి ఎలాంటి నిర్మాణాన్ని చేపట్టాలన్న వెన్నులో వణుకు పుట్టేలా శేర్లింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వ్యవహరిస్తుంటారని, ఇది జగమెరిగిన సత్యమని మిద్దెల మల్లారెడ్డి పునరుద్ఘాటించారు. ఏదైనా బలమైన ఒత్తిడి ఏర్పడినప్పుడు అధికారులు తూతూ మంత్రంగా హడావుడి చేసి నెల రోజుల లోపు మళ్ళీ వాటికి పూర్తిస్థాయి అండదండలు అందించి దుర్మార్గమైన దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ అక్రమం అంటేనే కేరాఫ్ శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అనేంతలా సర్కిల్ వ్యవస్థ మారిపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే 260, 262, 263 నెంబర్ గల ప్లాట్లలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో సీజ్ చేసి అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన అక్రమార్కులకు ల్యాండ్ గ్రాబింగ్ సెక్షన్ కింద కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించడంతోపాటు నష్టపరిహారాన్ని సైతం వసూలు చేయాల్సిన అవసరాన్ని ఆయన ఎత్తి చూపారు.




# బ్యాంక్, ఐటీ షేర్ల జోరు..

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరుతుందన్న ఆశాభావంతో భారత ఈక్విటీ సూచీలు సానుకూలంగా కదిలాయి.బీఎస్‌ఈ సెన్సెక్స్‌ 313.02 పాయింట్లు లేదా 0.38 శాతం పెరిగి 82,693.71 వద్ద ముగిసింది.అదేవిధంగా ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 91.15 పాయింట్లు లేదా 0.36 శాతం పెరిగి 25,330.25 వద్ద స్థిరపడింది.బీఎస్‌ఈలో ఎస్బీఐ, భారత్‌ ఎలక్ట్రానిక్స్‌ (బీఈఎల్‌), కొటక్‌ మహీంద్రా బ్యాంక్‌, ట్రెంట్‌ టాప్‌ గెయినర్లుగా నిలిచాయి. దీనికి విరుద్ధంగా, టైటాన్‌, ఐటీసీ, బజాజ్‌ ఫిన్‌సర్వ్‌, టాటా స్టీల్‌ వెనుకబడి ఉన్నాయి. విస్తృత మార్కెట్లో బీఎస్‌ఈ మిడ్‌ క్యాప్‌ 0.08 శాతం, స్మాల్‌ క్యాప్‌ 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్‌ ఇండెక్స్‌ 2.61 శాతం, నిఫ్టీ ఐటీ 0.65 శాతం పెరిగాయి. నిఫ్టీ మెటల్‌ 0.5 శాతం నష్టపోయింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్‌ | వరంగల్‌ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.45 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్‌

| ₹ 1,02,400 (22 క్యారెట్లు) | ₹ 1,11,710 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్‌

₹ 1,42,000

## దీపావళి ముందు ఉద్యోగులకు డబుల్‌ ఆఫర్‌?

దీపావళి పండుగకు ముందే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండు బంపర్‌ ఆఫర్లు ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. ఒకవైపు 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.మరోవైపు కరవు భత్యం (డీఏ) పెంచాలని చూస్తుండడమే ఇందుకు కారణం. ప్రభుత్వం తీసుకునే ఈ రెండు నిర్ణయాల వల్ల ఉద్యోగుల వేతనాలు పెరగనున్నాయి. 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం 2025 జనవరి 16న స్పష్టం చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ కేంద్రస్థాయిలోని కీలక శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలతో ఈమేరకు ఇప్పటికే సంప్రదింపులు మొదలు పెట్టింది. వీటిలో రక్షణ మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సిబ్బంది, శిక్షణ శాఖ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ కమిషన్‌ ఏర్పాటుకు సంబంధించి దీపావళి లోపు నిబంధనలు ఖరారు చేస్తారని కొందరు విశ్వసిస్తున్నారు. ఈమేరకు ఏర్పాటు చేయనున్న ప్యానెల్‌లో ఆరుగురు సభ్యులు ఉంటారు. వారు 15-18 నెలల్లో తమ నివేదికను సమర్పిస్తారు. అయితే, ఈసారి 8 నెలల్లోనే నివేదికను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. తద్వారా కొత్త సిఫార్సులను జనవరి 1, 2026 నుంచి అమలు చేసేందుకు వీలవుతుంది.నిమిదో వేతన సంఘం దేశవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా క్లర్కులు, ప్యూన్లు, ఎంటీఎస్‌ వంటి లెవల్‌ 1 హోదాల్లో ఉన్న వారు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒక వేతన సంఘాన్ని నియమిస్తుంది. ప్రస్తుత 7వ సీపీసీ 31 డిసెంబర్‌ 2025తో ముగియనుంది. 2024 జనవరిలో 8వ సీపీసీని ప్రకటించినప్పటికీ, టర్మ్స్‌ ఆఫ్‌ రిఫరెన్స్‌ (టీఓఆర్‌)ను ఇంకా నోటిఫై చేయలేదు.

## కస్టమర్‌ సర్వీస్‌ కోసం ప్రీమియం చెల్లించాల్సిందే!?

బెంగళూరుకు చెందిన మార్కెటింగ్‌ ప్రొఫెషనల్‌ నిషా ఇటీవల ఓ ప్రముఖ క్విక్‌ కామర్స్‌ ప్లాట్‌ఫామ్‌లో ఓ ప్రొడక్ట్‌ను ఆర్డర్‌ చేశారు. అందులో సమస్యల కారణంగా ఆమె కంపెనీ ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడాలని ప్రయత్నించారు.సంస్థ కస్టమర్‌ సపోర్ట్‌ కోసం ఏఐ చాట్‌బాట్‌లను ఏర్పాటు చేసినా తన సమస్య పరిష్కారం కాలేదు. నేరుగా కస్టమర్‌ సపోర్ట్‌ ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ ఆమెకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. ఎగ్జిక్యూటివ్‌తో నేరుగా మాట్లాడాలంటే కంపెనీ ప్రీమియం తీసుకోవాలని సూచిస్తూ.. డబ్బు చెల్లిస్తేనే కస్టమర్‌ సపోర్ట్‌ ఎగ్జిక్యూటివ్‌కు కాల్‌ కనెక్ట్‌ అవుతుందనేలా పాప్‌అప్‌ వచ్చింది.ఏఐ వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో చాలా క్విక్‌ కామర్స్‌ కంపెనీలు తమ కస్టమర్‌ సపోర్ట్‌ కోసం చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నాయి. ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ఇప్పటివరకు కాల్‌ సెంటర్‌లో పనిచేసే ఉద్యోగులకు లేఆఫ్స్‌ ఇస్తున్నాయి. ఒకవేళ వినియోగదారుడు నేరుగా ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడాలనుకుంటే మాత్రం అదో లగ్జరీ సర్వీస్‌లాగా మారుస్తున్నాయి. దాంతో కొన్ని కంపెనీలు రియల్‌టైమ్‌లో ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడాలంటే రిజర్వ్‌ చేసిన టైర్డ్‌ మెంబర్‌షిప్‌లను తీసుకోవాలని సూచిస్తున్నాయి.కంపెనీలు ఈ అంతర్లీన సాంకేతిక మార్పు ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. దాంతో ఇతర విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలవుతుందని నమ్ముతున్నాయి. ఏఐ చాట్‌బాట్‌లు వస్తువుల రిటర్న్‌లు, డెలివరీ సమస్యలు, లాగిన్‌ పరిష్కారాలు.. వంటివాటిని నిర్వహిస్తున్నాయి. కానీ, కస్టమర్లకు భావోద్వేగ భరోసా ఇచ్చేందుకు మాత్రం ఎగ్జిక్యూటివ్‌లు కావాల్సిందేనని కొందరు భావిస్తున్నారు.

## రూ.80 లక్షల కోట్ల పెట్టుబడులు.. 1.5 కోట్ల ఉద్యోగాలు

**న్యూఢిల్లీ,జనంసాక్షి:** రాబోయే రోజుల్లో భారత్‌లోకి రూ. 80 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని కేంద్ర పోర్టులు, షిప్పింగ్‌, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ తెలిపారు.1.5 కోట్ల పైగా ఉద్యోగాల కల్పన జరగనుందని వివరించారు. దేశీయంగా మారిటైమ్‌ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటు న్నాయని, భవిష్యత్తులో ప్రపంచ మారిటైమ్‌ సూపర్‌ప వర్‌గా భారత్‌ ఎదగనుందని పేర్కొన్నారు.కేంద్రం తలపెట్టిన సాగరమాల ప్రోగ్రాంతో 2035 నాటికి రూ. 5.8 లక్షల కోట్ల విలువ చేసే 840 ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని



సోనోవాల్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ. 1.41 లక్షల కోట్ల విలువ చేసే 272 ప్రాజెక్టులు పూర్తయినట్లు పేర్కొన్నారు. రూ. 76,000 కోట్లతో మహారాష్ట్రలో ఏర్పాటవుతున్న వాధ్వాన్‌ పోర్టు అంతర్జాతీయంగా టాప్‌ 10 కంటైనర్‌ పోర్టుల్లో ఒకటిగా నిలుస్తుందని సోనోవాల్‌ వివరించారు. దీనితో 12 లక్షల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని మంత్రి చెప్పారు.

# ఈ క్రూయిజ్‌ ఎక్కాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందే..

*ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లగ్జరీ క్రూయిజ్‌ ప్రయాణానికి ప్రకటన విడుదలైంది. రీజెంట్‌ సెవెన్‌ సీస్‌ అనే సంస్థ "వరల్డ్‌ ఆఫ్‌ స్ప్లెండర్‌" పేరుతో 140 రోజుల క్రూయిజ్‌ ప్రయాణాన్ని ప్రకటించింది.మియామి నుండి న్యూయార్క్‌ వరకు వెళ్లే ఈ ?సెవెన్‌ సీస్‌ స్ప్లెండర్‌ క్రూయిజ్‌ 6 ఖండాలు, 40 దేశాలు, 71 ఓడరేవులను కవర్‌ చేస్తుంది. ఈ విలాస సాగర యాత్ర 2027 జనవరి 11న ప్రారంభం కానుంది. "వరల్డ్‌ ఆఫ్‌ స్ప్లెండర్‌" క్రూయిజ్‌ ఎక్కడం సామాన్యుల తరం కాదు. ఎందుకంటే అంతలా ఉన్నాయి టికెట్‌ ధరలు. ఎంట్రీ లెవల్‌ వరండా సూట్ల ఛార్జీలే ఒక్కొక్కరికి సుమారు రూ .80 లక్షల నుండి ప్రారంభమవుతాయి. ఇక టాప్‌-ఎండ్‌ రీజెంట్‌ సూట్‌ కావాలంటే దాదాపు రూ .7.3 కోట్లు అవుతుంది. వాణిజ్య క్రూయిజ్‌ మార్కెట్లో ఇదే అత్యధిక ధర కావడం గమనార్హం.సముద్ర ఉపరితలంపై అత్యంత విలాసవంతమైన సౌకర్యాలు అందించడంలో రీజెంట్‌ సూట్‌లకు సుదీర్ఘ ఖ్యాతి ఉంది. ప్రతి పోర్ట్‌ లోనూ ప్రైవేట్‌ కారు, డ్రైవర్‌, ఇన్‌-సూట్‌ స్పా, క్యూరేటెడ్‌ ఫైన్‌ ఆర్ట్‌, 4,000 చదరపు అడుగుల ప్రైవేట్‌ స్పేస్‌ వంటి అల్ట్రా-ఎక్స్‌ క్లూజివ్‌ వసతులను అతిథులకు కల్పిస్తుంది.రీజెంట్‌ 2026లో సెవెన్‌ సీస్‌ ప్రెస్టీజ్‌ లో ఇంకా పెద్ద స్కైవ్యూ రీజెంట్‌ సూట్‌ ను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. దీని ధర ఒక్క రోజుకి సుమారు రూ .20-22 లక్షలు. ఇది అత్యంత ఖరీదైన సూట్‌ రేటుగా రికార్డుకెక్కింది. 2027 "వరల్డ్‌ ఆఫ్‌ స్ప్లెండర్‌" క్రూయిజ్‌ అతిథులు లాస్‌ ఏంజిల్స్‌, సిడ్నీ, సింగపూర్‌, మాలిబు, ముంబై వంటి ప్రధాన నగరాల్లో రాత్రి బస చేసి ఆరు ఖండాల గుండా 35,668 నాటికల్‌ మైళ్ళు (66,057 కిమీ) ప్రయాణిస్తారు. మార్గం వెంట 486 కాంప్లిమెంటరీ షోర్‌ విహారయాత్రలు, మూడు ప్రత్యేకమైన తీరప్రాంత గాలా ఈవెంట్‌ లు, ఇంటర్‌కాంటినెంటల్‌ బిజినెస్‌ లేదా ఫస్ట్‌-క్లాస్‌ విమానాలు, లగ్జరీ హోటల్‌ బసలు, లగేజ్‌ సర్వీస్‌, ప్రీమియం బేవరేజీలు, స్పెషాలిటీ డైనింగ్‌, వాలెట్‌ లాండ్రీ, వై-ఫై, 24 గంటల ఇన్‌-సూట్‌ డైనింగ్‌ వంటివెన్నో ఈ విలాస ప్రయాణంలో ఉన్నాయి.ఈ క్రూయిజ్‌కు భారత్‌లో నాలుగు స్టాప్‌ లు ఉన్నాయి. ముంబై, మంగళూరు, కొచ్చి, గోవాలో ఈ క్రూయిజ్‌ను యాత్రికులు ఎక్కొచ్చు.*

*- జనంసాక్షి:*




# తొలి ఏఐ కేబినేట్‌ మంత్రి

## తీసుకుని సరికొత్త అధ్యయనానికి తెరలేపిన అల్బేనియా

**జనంసాక్షి:**ఇంతవరకు ఆర్టిఫిషయల్‌ ఇంటెలిజెన్స్‌ ఆర్థిక రంగం, ఎంటర్‌టైన్‌మెంట్‌, రవాణ, ఆరోగ్య సంరక్షణ వరకు అన్నింటిలోకి వచ్చేసి తన సత్తా ఏంటో చూపించింది. దాంతో అస్సలు ఇక మ్యాన్‌పవర్‌తో పనిలేదు, అస్సలు ఉద్యోగాలు కూడా ఉండవేమో అనే గుబులు అందరిలోనూ పెంచేసింది.అలాంటి తరుణంలో మరో బాంబు పేల్చింది ఏఐ. రాజకీయాల్లో కూడా తన ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయ్యి..పాలకులకు పనిలేకుండా చేస్తుందో లేక పాలకులే అవసరం లేకుండా అంతా సాంకేతికత మయం అవుతుందో తెలియాల్సి ఉంది. ఇదంతా ఎందుకంటేఒ దేశంలో ఏఐ.. ఏకంగా మంత్రిగా పాలన సాగిస్తోంది. అంతేగాదు రాజకీయాల్లో మహామహులునే తలదన్నేలా చక్రం తిప్పబోతోంది. ఔను ఇదంతా నిజం. ఇంతకీ ఇదంతా ఎక్కడంటే..అల్బేనియా దేశం ఆ చొరవను తీసుకుని సరికొత్త అధ్యయనానికి తెరతీసింది. పైగా అవినీతిని నిర్మూలించడం కోసం పాలిటిక్స్‌లోని ఏఐ సాంకేతికతను తీసుకొస్తున్నట్లు పేర్కొంది. ఆ నేపథ్యంలోనే ఏఐ డియెల్లా అనే మహిళా కేబబినేట్‌ మంత్రినే నియమించి అందర్ని విస్తుపోయాలా చేసింది అల్బేనియా ప్రభుత్వం. అంతేగాదు ప్రపంచంలోని



మొట్టమొదటి ఏఐ కేబినేట్‌ మంత్రిని నియమించుకున్న దేశంగా అల్బేనియా వార్తల్లో నిలిచి, హాట్‌టాపిక్‌గా మారింది.ఒకానొక సమ్మర్‌లో ప్రధాన మంత్రి ఏడీ రామ మాట్లాడుతూ..ఏదో ఒక రోజు ఏఐ డిజిటల్‌ మంత్రి, ప్రధాన మంత్రి కూడా రావొచ్చేమో అని కామెడీగా అన్నారు. ఇలా అన్నారో లేదో ఊహకందని విధంగా ఆ రోజు రానే వచ్చేయడం విశేషం. ఇటీవలి జరిగిన సోషలిస్ట్‌ పార్టీ సమావేశంలో ఏయే మంత్రులు తదుపరి పదవికి కొనసాగుతారో, ఎవరో వెళ్లిపోతారో ప్రధాని రామ ప్రకటించారు. ఆ సమయంలోనే మానవేతర సభ్యురాలు డీయోల్లా అనే మహిళా ఏఐని కూడా ఆయన నేతలకు పరిచయం చేశారు.ఆమె భౌతికంగా హాజరు కానప్పటికీ ఈ సమావేశంలో తొలి సభ్యురాలు ఆమెనే. కృత్రిమ మేధస్సుతో (ఏఐ) సృష్టించబడిన ఏఐ మంత్రి అని పార్టీ సభ్యులకు తెలిపారు. అంతేగాదు ఇది సైన్స్‌ ఫిక్షన్‌ కాదని, డీయెల్లా విధి అని నాయకులకు చెప్పారు. తమ దేశంలోని అవినీతి నిర్మూలనే ధ్యేంగా ఈ ఏఐ మంత్రిని తీసుకొచ్చినట్లుగా వెల్లడించారు కూడా. ఇక ఈ ఏఐకి టెండర్లపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత అప్పగించినట్లు కూడా తెలిపారు. అదంతా దశల వారీగా జరుగుతుందని, పైగా నూటికి నూరు శాతం అవినీతికి తావివ్వకుండా జరుగుతుందని చెప్పుకొచ్చారు.సింపుల్‌గా చెప్పాలంటే అ?ల్బేనియా ప్రభత్వం చేసిన నిజమైన రాజకీయ చర్యగా అభివర్ణిస్తున్నారు నిపుణులు. ఇక ఈ ఏఐ మంత్రి గారు వాయిస్‌ కమాండ్‌ల ద్వారా బ్యూరోక్రాటిక్‌ అభ్యర్థనలను ప్రాసెస్‌ చేస్తూనే ఉన్నా.. ఇప్పటికే దేశ డిజిటల్‌ సేవల పోర్టల్‌ ద్వారా పౌరులకు సేవలు కూడా అందిస్తున్నట్లు సమాచారం.కాగా, ప్రధాని రామా ప్రకారం..ఈ వ్యవస్థ లంచాలు, బెదిరింపులు అరికట్టడంలో సహాయపడుతుందనేది సారాంశం. దీనిని నిజంగా పాలన పరిణామంలో ఒక గొప్ప మైలురాయిగా పేర్కొనవచ్చు. ఈ డెవలప్‌మెంట్‌ అల్బేనియా దేశాన్ని ప్రత్యేకమైనది నిలిచేలా చేసినప్పటికీ..ఈ ఘటన మాత్రం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

## పాక్‌ అణు బెదిరింపులకు తలొగ్గం

- ఆపరేషన్‌ సిందూర్‌తో మన సత్తా చాటాం
- మధ్యప్రదేశ్‌ పర్యటనలో ప్రధాని మోడీ

**భోపాల్‌(జనంసాక్షి):** నిజాం పాలనలో హైదరాబాద్‌ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్‌ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ రోజు సెప్టెంబర్‌ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్‌ విమోచన దినం నిర్వహిస్తున్నాం అని మోదీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి. అణుబెదిరింపులకు తలొగ్గదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌ ఆర్మీ చీఫ్‌ ఆసీం మునీర్‌ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్‌ వార్నింగ్‌ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్‌ సిందూర్‌ తో భారత్‌ గట్టి బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్‌ చీఫ్‌ మసూద్‌ అజార్‌ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్‌ మసూద్‌ ఇలియాస్‌ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్‌ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు.

## '100 ఏళ్ల స్వాతంత్ర్య భారతానికి మోదీ సేవ చేస్తూనే ఉండాలి'

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు సంద ర్భంగా రాజకీయ ప్రముఖులతోపాటు దేశంలోని వ్యాపార ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ అధినేత ముకేశ్‌ అంబానీ ప్రధాని పుట్టిన రోజు సంద ర్భంగా శు భాకాంక్షలు తెలుపుతూ ఓ వీడియోను విడుదల చేశారు.స్వాతంత్ర్య భారతానికి 100 ఏళ్లు వచ్చే వరకు నరేంద్రమోదీ దేశానికి సేవ చేస్తూనే ఉండాలని అందులో తెలిపారు. 'ఈ రోజు ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా దేశంలోని 145 కోట్ల మందికి ఇదో పండగ రోజు. భారతదేశంలోని మొత్తం వ్యాపార సమాజం తరఫున, రిలయన్స్‌, అంబానీ కుటుంబం తరఫున, ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. భారతదేశం అమృత్‌ కాల్‌లో మోదీ అమృత్‌ మహోత్సవ్‌ రావడం యాదృచ్ఛికం కాదు. స్వతంత్ర భారతదేశానికి 100 ఏళ్లు నిండిన నాటికి కూడా మోదీ భారతదేశానికి సేవ చేస్తూనే ఉండాలనేది కోరిక' అని చెప్పారు.



### మోదీకి ఆమె స్పెషల్‌ విషెస్‌



బీజేపీ అగ్రనేత, భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ, అభిమానులు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార రంగాలకు అతీతంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.అంతర్జాతీయంగా ఆయనకున్న పాపులారిటీ సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. వివిధ దేశాల అధినేతలు సైతం ఆయనకు విషెస్‌ తెలియజేశారు. అయితే..అందులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సందేశం ప్రత్యేకంగా నిలిచింది. మీ శక్తి, సంకల్పం, నాయకత్వం లక్షలాది మందికి ప్రేరణ అంటూ మెలోనీ, మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు మంచి ఆరోగ్యం, శక్తి కలగాలని.. తద్వారా ఆయన భారత్‌ను ప్రకాశవంతమైన భవిష్యత్తు వైపు నడిపిస్తూ, మా రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపరచగలుగుతారు అని ఎక్స్‌ ఖాతాలో ఓ పోస్ట్‌ చేశారామె.మోదీ ప్రధాని అయ్యాక ఇటలీ-భారత్‌ మధ్య సంబంధాలు మరింత మెరుగుపడ్డాయి. వాణిజ్యంతో పాటు రక్షణ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం పెరుగుతూ వస్తోంది. అదే సమయంలో..ఇరు దేశాల అధినేతల మధ్య స్నేహం గురించి కూడా సోషల్‌ మీడియా ప్రత్యేకంగా చర్చించుకుంటుంది. జీ7, జీ20, సీవోపీ28.. ఇలా ఏ సదస్సు, భేటీలో కలుసుకున్నా.. వెంటనే అనే హ్యాష్‌ట్యాగ్‌ ట్రెండ్‌ అయ్యేది. చివరకు ఆ హ్యాష్‌ట్యాగ్‌తోనే వెంటనే అనే హ్యాష్‌ట్యాగ్‌ ట్రెండ్‌ అయ్యేది. చివరకు ఆ హ్యాష్‌ట్యాగ్‌తోనేమెలోనీ సైతం ట్వీట్లు చేయడం నెటిజన్స్‌ను మరింత ఆకర్షించింది. 2023లో సీవోపీ-28 సందర్భంగా.. టీమ్‌ నుంచి హాయ్‌" అంటూ మెలోనీ పోస్ట్‌ చేయగా.. దానికి జై హో ఇండియా-ఇటలీ స్నేహం! అని మోదీ స్పందించారు. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి తీసుకున్న సెల్ఫీలు, హాస్యభరిత సంభాషణలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతూ వచ్చాయి.జార్జియా మెలోనీ 1977 జనవరి 15న ఇటలీ రాజధాని రోమ్‌లో జన్మించారు. 2022 అక్టోబర్‌ 22న ఇటలీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి.. ఆ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. మెలోనీకి వివాహం కాలేదు, కానీ 2015 నుంచి ఆంద్రియా జియాంబ్రూనో అనే టెలివిజన్‌ జర్నలిస్టుతో సహజీవనం చేశారు. వీళ్లకు ఓ పాప ఉంది. ఓ టీవీ షోలో మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేశాడనే కారణంతో 2023 అక్టోబర్‌లో జియాంబ్రూనోతో మెలోనీ విడిపోయారు. తన కుమార్తె భద్రత, కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమయంలో ఆమె ప్రకటించారు.


## భారత కాన్సులేట్‌ను సీజ్‌ చేస్తామంటూ..


### ఖలిస్థానీల హెచ్చరిక..

**ఒట్టావాజనంసాక్షి:** కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయి అనుచిత వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను టార్గెట్‌ చేసి వాంకోవర్‌లోని భారత కాన్సులేట్‌ను సీజ్‌ చేస్తామని తాజాగా బెదిరింపులకు దిగారు.ఈ మేరకు ఖలిస్థానీ సిక్స్‌ ఫర్‌ జస్టిస్‌ సంస్థ హెచ్చరించింది. దీంతో, ఈ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది.వివరాల ప్రకారం.. భారత్‌, కెనడా మధ్య మళ్లీ దౌత్య సంబంధాలు తిరిగి ప్రారంభమవుతున్న వేళ కెనడాలోని ఖలిస్థానీలు రెచ్చిపోయారు. అమెరికాకు చెందిన ఖలిస్థానీ సంస్థ సిక్స్‌ ఫర్‌ జస్టిస్‌.. వాంకోవర్‌లోని భారత కాన్సులేట్‌ను ముట్టడిస్తామని పేర్కొంది. ఈనెల 18న (గురువారం) దీన్ని స్వాధీనం చేసుకుంటామని, ఆ సమయంలో ఇక్కడికి ఎవరూ రావొద్దంటూ హెచ్చరికలు చేసింది. ఇదే సమయంలో కాన్సులేట్‌కు వచ్చే వారు తన సందర్శనను వాయిదా వేసుకోవాలని సూచించింది.ఈ సందర్భంగా భారత హైకమిషనర్‌ దినేశ్‌ కె.పట్నాయక్‌ను లక్ష్యంగా చేసుకుని ఉన్న పోస్టర్లను కూడా విడుదల చేసింది. అంతటితో ఆగకుండా.. భారత కాన్సులేట్‌లు గూఢచారి నెట్‌వర్క్‌ను నడుపుతున్నాయని, ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకుని నిఘా పెట్టాయని ఆ బృందం ఆరోపించింది. దీంతో ఇది కాస్తా తీవ్ర కలకలం రేపింది.

# కిర్క్‌ కేసులో విస్తుపోయే వాస్తవాలు!

**వాషింగ్టన్‌,జనంసాక్షి:**కన్జర్వేటివ్‌ పార్టీ యాక్టివిస్ట్‌ చార్లీ కిర్క్‌ (31) హత్య కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టైలర్‌ రాబిన్‌సన్‌(22)..ఎందుకు చంపాడన్నదానిపై దర్యాప్తు సంస్థలు ఇప్పటిదాకా స్పష్టమైన ప్రకటన చేయలేదు. అయితే కిర్క్‌ భావజాలమే ఆయన హత్యకు కారణమైందన్న చర్చ ఇప్పుడు అక్కడ నడుస్తోంది. చార్లీ కిర్క్‌ హత్య కేసులో నిందితుడు టైలర్‌ రాబిన్సన్‌ను తాజాగా కోర్టులో ప్రవేశపెట్టారు. మాసిన గడ్డంతో.. బుల్లెట్‌ ప్రూఫ్‌ జాకెట్‌తో అతను విచారణకు హాజరయ్యాడు. నేర తీవ్రత దృష్ట్యా అతనికి మరణశిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. తన భాగస్వామికి చేసిన సందేశాలను నేరాంగీకరంగా పరిగణించాలని కోరుతున్నారు.కోర్టు పత్రాల్లో ఉన్న వివరాల ప్రకారం.. టర్నింగ్‌ పాయింట్‌ యూఎస్‌ఏ వ్యవస్థాపకుడైన కిర్క్‌ సెప్టెంబర్‌ 10వ తేదీన ఉటా వ్యాలీ యూనివర్సిటీలో జరిగిన అమెరికన్‌ కమ్‌బ్యాక్‌ కార్యక్రమంలో దారుణ హత్యకు గురయ్యాడు. కాల్పుల తర్వాత గనతో ఓ వ్యక్తి ఓ భవనం మీద నుంచి దూకి పారిపోతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో దర్యాప్తు చేపట్టిన ఏజెన్సీలు ఆ మరుసటి రోజే 22 ఏళ్ల రాబిన్‌సన్‌ను అదుపులోకి తీసుకున్నాయి. అయితే ఆ సమయంలో తన రూమ్‌మేట్‌.. ట్రాన్స్‌జెండర్‌ భాగస్వామితో అతను జరిపిన చాటింగ్‌లో హత్యకు కారణాలు వెల్లడించినట్లు తెలుస్తోంది.అతనిపై(చార్లీ కిర్క్‌) ద్వేషాన్ని ఇంక భరించలేకపోతున్నా. కొన్ని ద్వేషాలు ఏరకంగానూ తొలగిపోలేవు అని ఓ సందేశాన్ని తన భాగస్వామికి పంపాడతను. అంతేకాదు.. ఘటనకు సరిగ్గా వారం కిందటి నుంచి ప్రణాళిక వేసుకున్నాడని, కిర్క్‌ని ఎందుకు చంపాలనుకునే విషయాలను గతన గదిలో ఓ పేపర్‌పై రాసుకున్నాడు. అంతేకాదు.. గదిలోని





కంప్యూటర్‌ కీ బోర్డు కింద" అవకాశం దొరికితే చార్లీ కిర్క్‌ను అంతమొందిస్తా" అంటూ రాసిన ఓ నోట్‌ కూడా దొరికింది. అయితే ఆ నోట్‌ను అతని భాగస్వామి తొలుత ప్రాంక్‌గా భావించిందట.కానీ కాల్పుల ఘటన తర్వాత తన పార్ట్‌న ర్‌కు మెసేజ్‌ పంపి.. అది జోక్‌ కాదనే విషయాన్ని రాబిన్‌సన్‌ ధృవీకరించాడు. "ఈ విషయాన్ని ఎప్పటికీ నీకు చెప్పకూడదనుకన్నా. నేను ఇప్పటివరకైతే బాగానే ఉన్నా. హత్య జరిగిన ప్రాంతంలోనే చిక్కుకుపోయా. దాచిన నా రైఫిల్‌ను తీసుకోవాలసి ఉంది. త్వరలో ఇంటికి వస్తానేమో. ఇందులోకి నిన్ను ఇందులో లాగినందుకు నన్ను క్షమించు. నీ కోసమే నా బాధంతా" అంటూ మెసేజ్‌లు పెట్టాడు. ఒకవేళ తాను దొరికిపోతే.. అధికారులు నీ దాకా వస్తారని, ఆ సమయంలో నోరు మెదపొద్దని ఆ భాగస్వామికి సూచించాడు. ఆ తర్వాత ఆ మెసేజ్‌లను డిలీట్‌ చేశాడు.ఇక.. ఘటన తర్వాత దొరికిన క్లూస్‌ ఆధారంగా పోలీసులు సెయింట్‌ జార్జ్‌లోని రాబిన్‌సన్‌ నివాసంలో సోదాలు జరిపారు(ఈ ప్రాంతం కిర్క్‌ హత్య జరిగిన ప్రాంతానికి 400 కిలోమీటర్ల దూరంలో ఉంది). ఆ తనిఖీల్లో దొరికిన ఆధారాలతో చార్లీ కిర్క్‌కు చంపింది అతనేనని నిర్ధారించుకు న్నారు. అరెస్ట్‌ చేసి వాషింగ్టన్‌ కౌంటీ జైలుకు తరలించారు. హత్యకు ఉపయోగించిన రైఫిల్‌ను ఘటనా స్థలంలోని పొదల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణకు అతను సహకరించకపోయినా.. అతని కుటుంబ, స్నేహితులు కీలక విషయాలనే వెల్లడించారు.తన కొడుకు కొంతకాలంగా ఓ ట్రాన్స్‌జెండర్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడని, అప్పటి నుంచి అతని ఆలోచన ధోరణి మారిందని, రాజకీయంగానూ వామపక్ష భావజాలం వైపు అడుగులేశాడని రాబినసన్‌ తల్లి అంటోంది. ప్రస్తుతానికి రాబిన్‌సన్‌పై ఏడు కేసులు నమోదు అయ్యాయి.

# లెక్చరర్స్ కాలనీలో వివాహిత అనుమానాస్పద మృతి

- భార్య మరణం తట్టుకోలేక భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం





**జమ్మికుంట, సెప్టెంబర్ 17 (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణంలోని లెక్చరర్ కాలనీలో నివాసం ఉంటున్న దిడ్డి శ్రీదేవి(53) అనే వివాహితమైన అనుమానాస్పద స్థితిలో సోఫాలో మృతి చెందింది. మృతురాలి వివరాల్లోకి వెళ్తే లెక్చరర్ కాలనీకి చెందిన దిడ్డి సుధాకర్‌తో గత ముప్పై నాలుగు సంవత్సరాల క్రితం వివాహము జరిగింది, వీరికి ఇద్దరు పిల్లలు కుమారుడు విదేశాలలో ఉండగా కూతురు హైదరాబాదులో ఉంటుంది. బుధవారం తెల్లవారుజామున శ్రీదేవి సోఫాలో అచేతన స్థితిలో ఉండి మృతిచెందగా ఈ విషయాన్ని తెలుసుకున్న భర్త దిడ్డి సుధాకర్ తన భార్య లేకుండా తన జీవితాన్ని కొనసాగించలేనని భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పక్కింటి వారు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా మృతురాలి భర్త సుధాకర్ మాట్లాడుతూ తన భార్యకు తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందిందని తాను లేకుండా ఉండలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. గత కొద్ది మాసాల క్రితం జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి డబ్బులు ఇవ్వడం వల్లనే భార్యాభర్తలు ఇరువురి మధ్యన గొడవలు జరుగుతున్నాయని ప్రచారం జోరుగా కొనసాగుతుంది. మృతురాలి తల్లి తిరుపతమ్మ తన కూతురు మృతికి అనారోగ్యము కారణమా.. లేక మరే ఇతర కారణాల వలన మృతి చెందిందానే అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 36 మందికి కంటి శస్త్ర చికిత్సలు



**మేడిపల్లి, సెప్టెంబర్17 (జనంసాక్షి):** భీమారం మండల కేంద్రంలో వొద్దినేని సురేందర్ రావు చారిటబుల్ ట్రస్ట్ మరియు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తాజా మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు నేతృత్వంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో 148 మంది శిబిరంలో పేరు నమోదు చేసుకోగా, 112 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 36 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని తేలడంతో, వారిని కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్సలు నిర్వహించారు. బుధవారం వారిని భీమారం మండల కేంద్రంలో వారి బంధువులకు అప్పగించారు. కరీంనగర్‌లో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి అందించిన వసతుల గురించి వొద్దినేని హరిచరణ్ రావు అడిగి తెలుసుకున్నారు. వొద్దినేని సురేందర్ రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి చూపు ప్రసాదించినందుకు లబ్ధిదారులు హరిచరణ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# దాతల దాతృత్వం.. పేదలకు వరం

- యాత్రాదానంతో దైవ దర్శనం
- టీజీఎస్ ఆర్టీసీ ఎండి సజ్జనార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

**దాతలు సంప్రదించాల్సిన నంబర్లు**

ఖమ్మం - 9959225958
సత్తుపల్లి - 9959225962
మధిర - 9959225961
కొత్తగూడెం - 9959225959
భద్రాచలం - 9959225960
మణుగూరు - 9959225963




**ఖమ్మం, (జనంసాక్షి) :** ప్రతి మనిషికి పుణ్యక్షేత్రాలు సందర్శించాలనేది ఓ కల.. వాటిని నిజం చేసుకునేందుకు ఎంతో మంది పరితపిస్తుంటారు.. ముఖ్యంగా తమ ఇష్ట దైవాలను దర్శించుకుని దేవుని ఆశీర్వాదం పొందాలని కోరుకుంటారు. అయితే పేదరికం ఎంతోమందిని ఈ కల నెరవేరకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా జీవితకాలం సైతం తమ ఇష్టదైవాలను దర్శించుకోలేక పేద ప్రజలు తీవ్ర మనోవేదనకు లోనవు తుంటారు. ఇలాంటి పరిస్థి తులను దృష్టిలో ఉంచుకొని టీజీఎస్ ఆర్టీసీ ఎండి సజ్జనార్ వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. పేద ప్రజల కలను సాకారం చేస్తూ.. టీజీఎస్ ఆర్టీసీలు బలోపేతం చేస్తూ ఆయన శ్రీకారం చుట్టిన ఈ పథకాన్ని ఖమ్మం జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఖమ్మం రీజనల్ మేనేజర్ ఏ. సరిరాం చేస్తున్న కృషి ఇతర రీజియన్లకు ఆదర్శంగా నిలుస్తుంది.

**యాత్రాదానం ఏ దైవ దర్శనం**

టీజీఎస్ఆర్టిసి రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ప్రవేశపెట్టిన పథకం యాత్రా దానం. ఈ పథకంలో దాతలు వారు దాతృ హృదయంతో విరాళాలు ఇచ్చి పేదలను వారి ఇష్ట దైవాలను దర్శించుకునే విధంగా ప్రోత్సహించవచ్చు. అందుకుగాను దాతలు తమ పుట్టినరోజులు, పెళ్లిరోజులు, పిల్లల పుట్టిన రోజులను, ఇతర మరపురాని రోజులను వేదికగా చేసుకోవచ్చు. ఆర్టీసీకి తాము ఇవ్వదలుచుకున్న విరాళాలని అందించి స్వయంగా ఎవరిని పంపాలి అనుకుంటున్నారో వారి వివరాలను సైతం ఇచ్చి దైవ దర్శనాలకు పంపించవచ్చు. దైవ దర్శనాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేసి సందర్శనీయ ప్రదేశాలు, ఇతర విహారయాత్రలకు, వైజ్ఞానిక యాత్రలకు పంపించవచ్చు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించినట్టు అవుతుంది. విరాళాలు ఇవ్వదలచిన దాతలు సంబంధిత డిపో మేనేజర్లను సంప్రదిస్తే వారు ఎంచుకున్న ప్రదేశాన్ని దృష్టిలో ఉంచుకొని కిలోమీటర్లను లెక్కగట్టి దాతలకు వివరిస్తారు. ఆ మొత్తాన్ని దాతలు చెల్లిస్తే వారు ఇచ్చిన పేర్లతో కూడిన వారిని కానీ, ఆర్టీసీ అధికారులే నిరుపేదలైన ఎంపిక చేసి దైవ దర్శనాలకు పంపిస్తారు. ఫలితంగా దాతల దాతృత్వంతో ఎంతోమంది పేదలకు ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది.

**దాతలు సహకరించాలి, ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలి :**

**ఏ.సరిరాం, టిజిఎస్ ఆర్టిసి రీజినల్ మేనేజర్, ఖమ్మం**



టీజిఎస్ ఆర్టిసి నూతనంగా శ్రీకారం చుట్టిన యాత్రా దానం నిరుపేదలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుంది. దాతలు ముందుకొచ్చి విరాళాలు విరివిగా పేదలు దైవ దర్శనం చేసుకుంటారు. దీనివల్ల దాతలు చెల్లించే ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడటంతో పాటు, ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీని బలోపేతం చేస్తుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. దాతలు వారి వారి పరిధిలోని డిపో మేనేజర్లను సంప్రదిస్తే యాత్రాదానం కార్యక్రమానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియజేస్తారు.

# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు జోలికి వస్తే ఖబర్దార్..!

**మంథనిలో అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకుల ధర్నా**





**మంథని, (జనంసాక్షి) :** మంథని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్ట మధు జోలికి వస్తే ఊరుకునేది లేదని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ శ్రేణులను హెచ్చరించారు. మంథనిలో పుట్ట మధు ఇంటి ముందు కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ధర్నాకు నిరసనగా అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. 40 ఏళ్ల పాటు మంథనిని పరిపాలించిన శ్రీధర్ బాబు కుటుంబం ఒక్క అంబేద్కర్ విగ్రహం కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికలపేట్‌లో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇరుగురాల కిష్టయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 15న రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పుట్ట మధు కలిసి ప్రారంభించారు. అయితే, అంతకు ముందు రాత్రి కొందరు కాంగ్రెస్ నాయకులు దొంగచాటుగా విగ్రహ ముసుగు తొలగించి, దండలు వేసి అనైతిక చర్యకు పాల్పడ్డారని బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య సమంజసం కాదని, వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ పుట్ట మధు ఇంటి మీద గొడవకు వస్తే తాము ఊరుకోమని, తగిన సమాధానం చెప్పుతామని హెచ్చరించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, హామీలను అమలు చేయకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, రాజకీయ లబ్ధి కోసం మహనీయుల విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటోందని ఆరోపించారు. 144 సెక్షన్ పెట్టే ఆలోచన సమంజసం కాదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిని ముట్టడించడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ధర్నాలో పోలీసులు భారీగా చేరుకొని ఆందోళనను విరమింపజేశారు.

కార్యక్రమంలో తాటికొండ శంకర్, పొన్నం రాజేశ్వరి, చిందం తిరుపతి, రాచకొండ లక్ష్మి-రవి, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, కొట్టె భూమయ్య, గుర్రం లక్ష్మీమల్లు, ఆకుల గట్టయ్య, కొండ వెంకటేష్, పోల్దాసరి సాయికుమార్, జాబు సతీష్, ఆడెపు శ్రీనివాస్, గాదె సది, పల్లె నారాయణ, కొయ్యడ రవి, ఎద్దు రాజయ్య, కుందారపు సత్యం, కొలిపాక శంకర్, ఆకుల కుమార్, ఆకుల రమేష్, తోడేటి రాజీరు, ఆకుల రాజు, డబ్బేట రాజలింగు, బోయిని బాలకృష్ణ, జాబు శ్రీనివాస్, నామని రాజలింగు, చొప్పరి భీమరాజు, గాజుల సతీష్, బొల్లపల్లి దశరథం గౌడ్, అగ్గిమల్ల కొమురయ్య, అవునూరి రాజలింగు, ఎం.డి మొకీద్, ఎలాబోయిన రాంమూర్తి, తోట రాజ్ కుమార్, మల్లయ్య, కొసన అనిల్, సిద్ద వెంకటేష్, భాషవేణి భాస్కర్, అనవేన డ్వేందర్, అనవేన అశోక్, చొప్పరి సందీప్, అనవేన ప్రవీణ్, సాగర్ల సాయితేజ, బర్ల అజయ్, మధుకర్, అరవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజా పాలన దినోత్సవనికి ప్రభుత్వ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా జిల్లాలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అన్ని రంగాలలో ప్రజలకు ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధా బాయ్ ఏఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికులకు బకాయిలు చెల్లించాలి



**ముస్తాబాద్ సెప్టెంబర్ 17 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ దసరా బతుకమ్మల పండగలకు ఉపాధి హామీ కార్మికులు పస్తులు ఉండాల్సిందేనా ఉపాధి హామీ కార్మికులకు గత నాలుగు నెలలుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు నెలల బకాయిలు చెల్లించాలి అవి దాదాపుగా కోటి రూపాయల పైగానే బకాయిలు ఉన్నాయి ఉపాధి హామీల పని చేస్తున్న కార్మికులందరూ ఎస్సీ ఎస్టీ బీసీ పేద వర్గాలకు సంబంధించిన ప్రజలే ఉన్నారు. ఉపాధి హామీల పని చేస్తున్న కూలీలకు 15 రోజులు లోపుగా కూలి ఇవ్వాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నప్పటికీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు గత నాలుగు నెలలుగా ఉపాధి హామీ నమ్ముకుని పనిచేస్తున్న పేదలకు కూలి చెల్లించకపోతే ఆ కుటుంబాలు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న విషయాన్ని పాలకులకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది ఉపాధి హామీ చట్టమే వలసలు నివారించి పొట్ట నింపుకోవడం కోసం కొంత పని కల్పించే ఆదుకునే విధంగా ఈ చట్టం అమలులోకి వచ్చింది. వామపక్షాల మూలంగానే ఈ చట్టం ఉపాధి హామీ చట్టంగా రూపుదిద్దుతుంది దీనిపైన ఎంతో ఆశ పెట్టుకున్న కార్మికులు నెలల తరబడి బకాయిలు రాకపోయేసరికి నిరాశకు గురైన పరిస్థితి కనిపిస్తా ఉంది. నువ్వంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకొని వెంటనే బకాయిలను చెల్లించి ఉపాధి కార్మికులను ఆదుకోవాలని సిపిఐ గుంటి వేణు ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో ఓ సాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, రాజేందర్, కమలాకర్ ,బాలయ్య, బాలమల్లు చంద్రశేఖర్, కార్మిక, కర్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కౌశిక్ రెడ్డికి మానసిక స్థితి బాగోలేదు

- సీజో ఫ్రెన్నియా అనే మెంటల్ డిసాస్టర్ జబ్బుతో బాధపడుతున్నాడు
- ఆరోపణలు కాదు,ఆధారాలు ఏవీ? దమ్ముంటే ఆధారాలు చూపెట్టాలి
- నిజాయితీ ఉంటే ముగ్గురు ఎంపీల పేర్లు చెప్పాలి, ఆ ముగ్గురు ఎవరు?
- కౌశిక్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడిన ప్రణవ్



**హుజురాబాద్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) :** కౌశిక్ రెడ్డి సీజో ఫ్రెన్నియా అనే మానసిక జబ్బుతో బాధపడుతున్నాడని, వెంటనే కౌశిక్ రెడ్డిని దవాఖానలో చూపించాలని వారి కుటుంబసభ్యులను కోరారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా పరిపాలన దినోత్సవం భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి ఆనాటి రజాకార్ల నుండి పోరాడిన పోరాట యోధులనుగుర్తు చేసుకున్నారు.అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు.వారు మాట్లాడుతూ స్కూల్ పిల్లాడికంటే చిన్నవాడిలాగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నాడని, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు,రాష్ట్ర అభివృద్ధి,రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసే కౌశిక్ రెడ్డి దమ్ముంటే ఆధారాలు చూపెట్టాలని అన్నారు.ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎందుకు ఓటు వేయలేదో చెప్పాలని,ఒక తెలుగువాడిగా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాల్సింది పోయి అసలు ఎన్నికకే దూరంగా ఉండి రాజకీయాలు చేయడం చూస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఎంత అక్కసుతో ఉన్నారో అర్థం అవుతుందని అన్నారు.అవినీతి గురించి,స్కాంల గురించి బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్, కవితనే చెప్పారని, హుజురాబాద్‌లో రెండేళ్లు ఎమ్మెల్సీగా ఉండి ఒక్క కమిటీ వేయకుండా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన కౌశిక్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడడం సిగ్గు చేటని,తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ,ఆలయాల,పార్టీ కమిటీలను నియమించామని ఇది కౌశిక్ రెడ్డికి మాకు ఉన్న తేడా అని అన్నారు. అంతే కాకుండా ఉద్యమ పార్టీగా మొదలెట్టి రాజకీయ పార్టీగా మారిన తర్వాత దేశంలోనే అత్యంత డబ్బు కలిగిన ప్రాంతీయ పార్టీగా ఎలా ఎదిగింది బిఆర్ఎస్ నాయకులు చెప్పాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిగా తెలంగాణ ను దోచుకొని భారత రాష్ట్ర సమితిగా దేశాన్ని దోచుకోవడానికి బయలుదేరితే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్షానికి కూర్చోబెడితే పార్లమెంట్ ఎన్నికల్లో ఇంటికే పరిమితం చేశారని అన్నారం.ఇకపై భారత రాష్ట్ర సమితిని బోగస్ రాష్ట్ర సమితిగా నామకరణం చేయాలని అన్నారు.కౌశిక్ రెడ్డి వన్ టైం ఎమ్మెల్యే అని,హుజూరాబాద్ భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదేనని,ఆరోపణల కంటే అభివృద్ధిలో పోటీ పడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా పొనగంటి సంపత్

**ఘనంగా సన్మానించిన మున్నూరు కాపు కుల బాంధవులు**

**జమ్మికుంట, సెప్టెంబర్ (జనం సాక్షి):** మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శిగా జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన పొనగంటి సంపత్ ఎన్నికైన సందర్భంగా మంగళవారం మోతుకులగూడెం గ్రామ మున్నూరు కాపు కుల బాంధవులు ఆయన ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పొనగంటి సంపత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్నూరు కాపులను ఏకతాటిపైకి తీసుకువస్తానని,అన్ని రంగాలలో వారి అభివృద్ధి కొరకు పాటుపడతానని అలాగే రాజకీయంగా వారి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పొనగంటి రాము,అంజయ్య, శ్రీధర్, నీరటి సతీష్,దుర్గ రాము, పొనగంటి రాజు, పొనగంటి సురేష్, పొనగంటి సతీష్ మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన సంబరాలు




- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి
- ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలో ప్రజా పాల న దినోత్సవ వేడుకలు అట్టహాసం గా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన ఆయన, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజాపాలన దినోత్సవం వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. సిద్ధార్థ కళాక్షేత్ర, నవీపేట, కంజర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలికలు, బోర్గాం (పి) ఉన్నత పాఠశాల, డిచ్పల్లి మానవతా సదన్ చిన్నారులు చూడ చక్కని నృత్యాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు చూరగొన్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ఆర్.భూపతి రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**జిల్లా పరిషత్ కార్యాలయంలో.....**

ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి హోదాలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డిప్యూటీ సీఈఓ సాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.



## అన్ని గనులు.. డిపార్ట్‌మెంట్‌లలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**గోదావరిఖని, జనంసాక్షి :** విశ్వకర్మ జయంతి సందర్భంగా రామగుండం ఏరియా 1 లోని 1, 2, 2ఏ, ఓ సి పి-5, 11 ఇంక్లైన్ గనుల పై, ఏరియా వర్క్ షాప్ నందు పిట్ సెక్రటేరిల ఆధ్వర్యంలో గనుల వారిగా ఎస్ఎస్సి ఎంపిఎస్-బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, ఆర్.జీ.వన్ ఉపాధ్యక్షుడు కర్రావుల మహేష్, ఆర్జీ.వన్ కార్యదర్శి సాయవేణి సతీష్ జెండా ఆవిష్కరించి విశ్వకర్మ విశిష్టతను వివరించారు. అలాగే 17 సెప్టెంబర్ ను కార్మికులకు పీహెచ్డీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీనియర్ కార్మికులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో డివిజన్ సభ్యులు సంగోని సాంబయ్య బోడకుంట రాజేశం ఎల్లపూల కోటయ్య పిట్ కార్యదర్శులు చెన్న సతీష్ వెంకట స్వామి తాట్ల లక్ష్మయ్య పల్లే శ్రీనివాస్ తుమ్మ గట్టయ్య నాగేంద్ర ప్రసాద్ ఆయా గనుల పిట్ కార్యవర్గం కార్యకర్తలు వివిధ యూనియన్ల నాయకులు అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ మహిళల ఆరోగ్య రక్షణకు కొత్త అభియాన్





- కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**పెద్దపల్లి,సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించేందుకు..స్వస్త్ నారీ,సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ఇల్లు బాగుండాలంటే మన ఇంటిలోనే మహిళలు వారి ఆరోగ్యం బాగుండాలని అన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకుంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య క్యాంపులో హెల్త్ చెక్ అప్ చేసుకోవాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన మహిళలకు సంబంధిత చికిత్సను కూడా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రతినెల దాదాపు 200 పైగా ప్రసవాలు విజయవంతంగా జరుగుతున్నాయని, ఈ సేవలో కూడా వినియోగించుకోవా లని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి, అంబులెన్స్ సేవలు అందించేందుకు అవసరమైన సొమ్ము ఎంపీ నిధుల నుంచి అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నేడు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు. మన కుటుంబంలో ఉన్న మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని అనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులు మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల పట్ల ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, పి. హెచ్.సిలలో స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. హైపర్ టెన్షన్,డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, అనీమియా, టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని అన్నారు. గైనకాలజిస్ట్, ఐ స్పెషలిస్ట్ ,ఇయర్ స్పెషలిస్ట్, డెర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్యుల సేవలను వినియోగించుకోవాలని అన్నారు. మహిళలకు తమకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న కూడా సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రజాపాలన

- రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్
- అర్హులందరికీ అభయహస్తం గ్యారెంటీ పథకాల అమలు
- ఆధ్యాత్మిక భావంతో అట్టహాసంగా యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవం నిర్వహణ
- పాల్గొన్న జిల్లా కలెక్టర్,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

**పెద్దపల్లి,సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం లో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, అభయహస్తం గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా 12,168 కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు జారీ చేశామని, ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామని తెలిపారు. కాకతీయ కాలువ కింద 2.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ సామర్థ్యాన్ని 3 నుంచి 5 టీఎంసీలకు పెంచేందుకు రూ.1.1 కోట్లతో డీపీఆర్ తయారీకి మంజూరు చేశామని, 13,396 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు రామగుండం ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామని చెప్పారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి రూ.160 కోట్లతో, పెద్దపల్లిలో రూ.51 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, మంథనిలో రూ.22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి, గోదావరిఖనిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.173 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్మశానవాటికలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పురపాలక భవనం, డంప్ యార్డ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని అన్నారు. అదే రోజు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవంలో మహమ్మద్ ఒబేదుల్లా, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్లు డి.వేణు, జె.అరుణశ్రీలతో కలిసి పాల్గొని, విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన, ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్వకర్మ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారికంగా, ఆధ్యాత్మిక భావంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. విరాట్ విశ్వకర్మ వంటి మహనీయుల నైపుణ్యాన్ని భవిష్యత్ తరాలు తెలుసుకోవాలని, ఇలాంటి ఉత్సవాలు దానికి దోహదపడతాయని అన్నారు. విశ్వకర్మ సంఘం నేతలు అధికారిక ఉత్సవాలకు కృతజ్ఞతలు తెలిపి, విశ్వకర్మ జయంతిని అధికారిక సెలవుగా ప్రకటించాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణా రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ. అన్నయ్య గౌడ్, అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, డి.వేణు, డీసీపీ కరుణాకర్, ఆర్డీఓ బి.గంగయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతి నిధులు, విశ్వకర్మ సంఘ ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎందరో వీరుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

- 'సెప్టెంబరు 17ను 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొంది అఖండ భారత్‌లో విలీనమైన ఈ గొప్ప రోజును 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట ఆళ్వార్ స్వామి, చాకలి ఐలమ్మ, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బద్దం ఎల్లారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహానుభావుల త్యాగాలతో తెలంగాణ సుసంపన్నమైందని అన్నారు. తెలంగాణ ఒక భౌగోళిక స్వరూపం మాత్రమే కాదు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం దశాబ్దాలుగా కొనసాగిన అస్తిత్వ పోరాటానికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి మిలియన్ మార్చ్ వరకు అనేక పోరాటాలు చరిత్రలో స్థానం సంపాదించాయని తెలిపారు. ఆంధ్ర వారి దోపిడీ విధానాలు, తెలంగాణ యాస, భాషలను చిన్నచూపు చూడడంతో ఇరు ప్రాంతాల మధ్య భావ సమైక్యత ఏర్పడలేదని, అందుకే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన దశాబ్దంలోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందని, ఆచార్య కొత్తపల్లి జయశంకర్, జమలాపురం కేశవరావు వంటి మేధావులు తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయాలపై చైతన్యం కలిగించి ఉద్యమాన్ని సజీవంగా ఉంచారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ, రైతు భరోసా, రైతు బీమా, ఆత్మీయ భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ, భూభారతి వంటి పథకాలు ప్రజలకు చేరుతూ మన్ననలు పొందుతున్నాయని, సన్న వడ్లకు బోనస్ ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని, అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి చరిత్ర సృష్టించామని, ఇంకా ఎన్నో హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సహకారం అందిస్తున్న పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, న్యాయాధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, స్వాతంత్ర్య సమరయోధులు, జర్నలిస్టులు, జిల్లా ప్రజలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లా వైద్య - ఆరోగ్య శాఖ సిబ్బందికి హైపటైటిస్ బి వ్యాది నిరోధక టీకాలు

**పెద్దపల్లి, (జనంసాక్షి) :** జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి బుధ వారం హెపటైటిస్ బి వ్యాధి నిరోధక టీకాల కార్య క్రమమును జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వాణిశ్రీ మరియు టి .వి.వి పి. ఆసుపత్రుల మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ హెపటైటిస్ బి వ్యాధి ముఖ్యంగా రక్తం, శరీర ద్రవాల వ్యాప్తి చెందుతుంది, కావున హెపటైటిస్ బి సోకిన వ్యాధికి సేవలు అందించే క్రమంలో ఈ వ్యాధి వైద్య సిబ్బందికి సోకే అవకాశం ఉంది అని అన్నారు. అందుకు వైద్య సిబ్బంది రక్షణ కొరకు ఈ వ్యాధి నిరోదక కార్య క్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

# నిరంతరాయ శ్రమతోనే మంచి ఫలితాలు సాధ్యం

**పోలీసు, అటవీ శాఖ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం సందర్శించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 17(జనంసాక్షి) :** విసుగు చెందకుండా నిరంతరాయంగా ఫోకస్ చేస్తూ శ్రమిస్తేనే మంచి ఫలితాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.పెద్దపల్లి జిల్లాకు సంబంధించిన నిరుద్యోగ యువతీ యువకులకు సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మొదలగు పోస్టులకు ఎంపిక అయ్యేలి విధంగా వారికి రాత పరీక్షలో శిక్షణ ఇచ్చేందుకు 220 మంది ఎస్సై, పిసి,ఎఫ్.బి.ఓ, 80 మంది అగ్నివీర్ మొత్తం 300మంది కరీంనగర్ లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణ నాణ్యత, వారికి అందుతున్న వసతుల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అభ్యర్థులందరూ కష్టపడి రాబోయే వ్రాత పరీక్ష నోటిఫికేషన్ కి సిద్ధంగా ఉండి ఉత్తీర్ణత అయ్యే విధంగా శిక్షణ పొందాలని సూచించారు. అగ్ని వీర్ ద్వారా భారత ఆర్మీ లో ఉద్యోగాల కోసం వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులై ఫిజికల్ ఎంట్రన్స్ కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కూడా కష్టపడి శిక్షణ తీసుకొని అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా నిరుద్యోగ అభ్యర్థులకు శిక్షణ అందించాలని నిధులు ఖర్చు చేసి కరీంనగర్‌లో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్విని యోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అన్నారు. మన జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రెగ్యులర్‌గా ఫోకస్ చేసి పరీక్షలకు సిద్ధం కావడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తామని, శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ జీవితాంతం అభ్యర్థులు కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

# హ్యాండ్ రైటింగ్ మైండ్ రైటింగ్

**హ్యాండ్ రైటింగ్ జీవితంలో చాలా ముఖ్యం... వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.**
**పిల్లలు పెద్దలు హ్యాండ్ రైటింగ్‌ను ఇంప్రూవ్ చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**
**హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రధానం**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** హ్యాండ్ రైటింగ్ అందరికీ జీవితంలో చాలా ముఖ్యమని దాన్ని ఇంప్రూవ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. హ్యాండ్ రైటింగ్ అంటే మైండ్ రైటింగ్ అని మేధస్సుకు పదును పెడుతుందన్నారు. మనిషి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇటీవల పారమిత విద్యాసంస్థల సహకారంతో జరిగిన జిల్లా స్థాయి చేతివ్రాత పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అధికారులు ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతి ఒక్కరూ హ్యాండ్ రైటింగ్ ను మెరుగుపరచుకోవాలని తద్వారా మేధస్సుకు పదును పెట్టినట్లు అవుతుందని పేర్కొన్నారు. చేతిరాత బాగుంటే అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తానాజీ వాకాడే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు చేతిరాతపై దృష్టి పెట్టాలని, చేతిరాతలో మంచి ప్రావీణ్యం సాధించాలని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు (6 నుండి 10 తరగతులు) , ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ,ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల కోసం చేతివ్రాత పోటీలను నిర్వహించారనీ పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు తెలిపారు. కళాశాల, పాఠశాలల విభాగాలలో మొదటి బహుమతి రూ.5,000 , రెండవ బహుమతి రూ. 4,000 , మూడవ బహుమతి రూ. 3,000, నాల్గవ బహుమతి రూ.2,000, ఐదవ బహుమతి రూ.1,000, కన్సోలేషన్ బహుమతులు రూ. 500 చొప్పున 5గురు విద్యార్థులకు, ఉద్యోగుల విభాగంలో మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ. 4,000, మూడవ బహుమతి రూ.3,000, నాల్గవ బహుమతి రూ. 2,000, ఐదవ బహుమతి రూ. 1,500, కన్సోలేషన్ బహుమతులు రూ.1000 చొప్పున 15 మంది ఉద్యోగులకు, మొత్తం మూడు విభాగాల వారికి కలిపి రూ.66,500 నగదు బహుమతిని, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ, డి.ఇ.ఓ. యస్. మొండయ్య, అశోక్ రెడ్డి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పార్కులను కాపాడిన హైడ్రా



- రూ. 16 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా
- 1600 గజాల పార్కు స్థలానికి కబ్జాల నుంచి విముక్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (జనంసాక్షి):** పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా బుధవారం కాపాడింది. దాదాపు 1600 గజాల వరకూ ఉన్న ఈ భూమి విలువ రూ. 16 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, మూసాపేట సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్ కోపరేటివ్ సొసైటీకి చెందిన లే ఔట్లో వెయ్యి గజాల పార్కు స్థలాన్ని కాపాడింది. 1967లో 172 ప్లాట్లతో ఈ లేఔట్‌ను వేశారు. ఇందులో 1200 గజాల స్థలాన్ని పార్కుల కోసం కేటాయించారు. ఈ పార్కు ఆక్రమణలకు గురౌతున్నట్టు మోతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్లు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జీహెచ్ ఎంసీ, డీటీసీపీ, రెవెన్యూ అదికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. పార్కు స్థలంగా గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

**మదీనాగూడలో 600ల గజాల స్థలం**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని మదీనగూడ విలేజ్‌లో పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దుశించిన 600ల గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కుతో పాటు ప్రజావసరాలకు దాదాపు 600ల గజాల స్థలాన్ని కేటాయించగా.. అందులో గోశాల పేరుతో కొంత భాగం, పిండి గిర్నీ కోసం మరి కాస్త కబ్జా చేశారు. గోశాలలో ఉన్న ఆవులను ఇస్కాన్ టెంపుల్ వారికి అప్పగించి అక్కడి ఆక్రమణలను హైడ్రా తొలగించింది.

# అల్ఫోర్స్ గర్ల్స్ హైస్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**



విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే వివిధ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని మనం వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించి విజేతలుగా నిలపాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాల పల్లిలోని అల్ఫోర్స్ గర్ల్స్ హై స్కూల్లో వేడుకగా నిర్వహించినటువంటి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలని ప్రారంభించారు. పోటీల ప్రారంభానికి ముందు వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని కనబరచాలని, వాటిలోని విషయాలను సాధన చేసి పట్టు సాధించి వివిధ స్థాయిలలో పోటీలకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటి గెలవాలని వారు మాట్లాడారు. పాఠశాల స్థాయి నుండి నిపుణులు అయినా వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ విజేతలుగా నిలపడం చాలా సంతోషకరమైన విషయమని చెప్పారు. క్రీడలు ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తూ వివిధ పోటిలను నిర్వహించడం జరుగుతుందని తెలుపుతూ ప్రణాళికలో భాగంగా నేడు విద్యార్థులకు ఫుట్బాల్, వాలీబాల్, త్రోబాల్, హ్యాండ్ బాల్, కబడ్డీ, టెన్నికాయింట్, ఖో-ఖో తదితర పోటీలను నిర్వహించడం జరిగిందని చెప్పారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు త్వరలో నిర్వహించబోయే ప్రత్యేక వేడుకలలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించాలి

**సీఈవో కే.రవీందర్**



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 17 జనంసాక్షి :** స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకొని రైతులు సకాలంలో చెల్లించాలని సీఈఓ కే. రవీందర్ కోరారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం పిఎసిఎస్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సీఈవో కె. రవీందర్ జండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను మరో మలుపు తిప్పిన రోజు సెప్టెంబర్ 17 అని, తెలంగాణ సమాజం నిజాం కబంధహస్తాల నుంచి విముక్తి పొందిన రోజని ఆయన గుర్తు చేశారు. కొత్తగా కర్షక మిత్రా స్కీం వచ్చిందని, అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఎకరాకు ఐదు లక్షల చొప్పున రుణం అందజేస్తామని, కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ గోవిందు అటెండర్ రమాదేవి రైతులు అంజి, ఈశ్వర్ తోపాటు శ్రీనివాసపురం, అప్పాయిపల్లి, నాగవరం రైతులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో జాతీయ పతాక ఆవిష్కరణ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లాలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొనగా, గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న ప్రజాపోరాటం ద్వారా రాచరిక పాలనకు చరమగీతం పాడి, తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమై స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను పొందిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ చారిత్రక రోజును గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగారిక టౌన్‌షిప్‌లో హామీలన్నీ హుళక్కి..!

- ఆదాయం 147 కోట్లు.. సౌకర్యాలు సున్నా
- అంగారిక టౌన్‌షిప్‌లో బాధితుల గోడు వర్ణణాతీతం
- ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కలెక్టర్ ఎదుట 19న ధర్నా




**కరీంనగర్ ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) :** కరీంనగర్ సమీపం తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ చెందిన అంగారిక టౌన్‌షిప్‌లో 819 ప్లాట్స్ కొన్నామని అంగారిక టౌన్‌షిప్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రఘు శంకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ టౌన్‌షిప్ పేరిట 85 ఎకరాలలో 819 ప్లాట్లను మూడు సంవత్సరాల క్రితం మూడు దశల్లో వేలం వేశారని తెలిపారు. అప్పటి జిల్లా కలెక్టర్, జెసి, ఆర్డీవో, ఫ్రీ బెడ్ సమావేశాలు ఏర్పాటు చేసి డిటిసిపి హెచ్ఎండిఏ ప్రణాళిక ప్రకారం అంగారిక టౌన్‌షిప్ లో ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, పూర్తిస్థాయి పార్క్, అభివృద్ధి పనులు చేస్తామని హామీనిచ్చినట్టు చెప్పారు. 2022 మే 22న మొదటి దశ వేలంపాటలో ప్రభుత్వం కనీస ధర నివాస స్థలం గజానికి 6వేల రూపాయలు, వాణిజ్య స్థలానికి గజానికి 8వేల రూపాయలు నిర్ణయించింది. అధికారుల హామీని నమ్మి సౌకర్యాలు ఉంటాయని, ప్లాట్ల భద్రత ఉంటుందని గరిష్ట స్థాయిలో గజానికి 22 వేల 400 రూపాయలు వేలంపాటలో ప్లాట్లు కొన్నారు. మూడు దశల్లో 787 ప్లాట్లు అమ్మగా ప్రభుత్వానికి 147 కోట్ల రూపాయలు వచ్చాయి. కానీ అధికారులు అంగారిక టౌన్‌షిప్‌లో చేయాల్సిన పనులు, ఇచ్చిన హామీలు చేయలేదని, గత ప్రభుత్వం 147 కోట్ల రూపాయలు ఆదాయం పొంది, ఏ ఒక్క సౌకర్యం కల్పించలేదని బాధితులు ఆరోపించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన 22 మాసాల నుండి ఎమ్మెల్యేను, సుడా ప్రతినిధులను కలిసినా అలాగే ఉందన్నారు. ఈ నెల 19న కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో మొతం 819 ప్లాట్లకు సంబంధించిన ప్లాట్ యజమానులు పాల్గొంటారని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగదని అధ్యక్షులు రఘు శంకర్ రెడ్డి టపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు తోట మోహన్ రెడ్డి, సెక్రటరీ చందా సత్యనారాయణ, జెయింట్ సెక్రెటరీ ఓరగంటి నరసింహా రెడ్డి, ట్రెజరర్ మారుపెల్లి మల్లారెడ్డి, అడ్వైజర్స్ డాక్టర్ జి.లక్ష్మణమూర్తి, తుమ్మల రమేష్ రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాలో జీతాలు తగ్గడం లేదు

- పాత జీతాలే ఇస్తామన్న హైడ్రా
- సర్దుబాటు చర్యలలో జాప్యం వల్లే ఆందోళన
- కమిషనర్ హామీతో విధులకు హాజరైన ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (జనంసాక్షి) : హైడ్రాలో ఔట్ సోర్సింగ్ (ఒప్పంద కార్మికులు) ద్వారా పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు ఏమీ తగ్గడం లేదని హైడ్రా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 1272 ప్రకారం జీహెచ్ ఎంసీలోని ఈవీడీఎం ద్వారా హైడ్రాకు సమకూరిన ఉద్యోగుల జీతాలు రాష్ట్రంలోని వేరే డిపార్ట్‌మెంట్స్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సమానంగా సవరించడం జరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. ఆ వ్యత్యాసం మొత్తాన్ని జీహెచ్ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయాలని ప్రభుత్వం సూచించింది. ఆ మ్యాచింగ్ ఫండ్‌తో మొత్తం జీతం చెల్లించడానికి హైడ్రా ప్రయత్నించింది. అయితే ఆ మ్యాచింగ్ ఫండ్ రావడం కాస్త ఆలస్యం అయ్యింది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత మ్యాచింగ్ ఫండ్ విడుదల చేస్తామని జీహెచ్ఎంసీ తెలిపింది. ఉద్యోగులు జీతాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జీవో 1272 ప్రకారం వెంటనే జీతాలు హైడ్రా చెల్లించింది. వ్యత్యాసం మొత్తాన్ని త్వరలో సర్దుబాటు చేస్తామని కూడా చెప్పింది. అయితే కొంతమంది ఉద్యోగులు జీతాలు తగ్గినట్టు భావించి బుధవారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉద్యోగులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చర్చలు జరిపారు. జీతాలు తగ్గవని.. జీహెచ్ ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రిలీజ్ అవ్వగానే సర్దుబాటు చేస్తామని హామీ ఇవ్వడంతో హైడ్రాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఊరట చెందారు. వెంటనే విధుల్లోకి చేరారు. వారికి జీహెచ్ ఎంసీలో ఈవీడీఎం భాగంగా ఉన్నప్పుడు అందిన జీతాలే ఇప్పుడు కూడా చెల్లించడం జరుగుతుందని హైడ్రా ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

# నిరుద్యోగులకు అండగా ఉంటా

- వారి సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్17 (జనంసాక్షి) : నిరుద్యోగ యువత కష్టాల్లో ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మేనిఫెస్టో ప్రకారం ఉద్యోగ అవకాశాలు భర్తీ చేయాలని అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి రాజగోపాల్ రెడ్డి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్ గద్దె దించడంలో యువత పాత్ర కీలకమన్నారు. నిరుద్యోగులకు అండగా ఉంటామని అమరవీరుల సాక్షిగా చెప్తున్నానని, సిటీ- సెంట్రల్ లైబ్రరీ, అశోక్ నగర్ వస్తానని తమ నిరసనలకు మద్దతిస్తానని తెలియజేశారు. నిరుద్యోగుల సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, తెలంగాణకు అన్యాయం జరగవద్దనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉస్మానియా అనుబంధ ఆస్పత్రుల్లో వైద్యసేవలను బలోపేతం చేస్తాం

- వైద్యారోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహా



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రులలలో వైద్య సేవల బలోపేతం పై రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఎస్ఆర్ నగర్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ హెల్త్ కార్యాలయం లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబందంగా ఉస్మానియా హాస్పిటల్‌తో పాటు, నీలోఫర్ హాస్పిటల్, సరోజిని దేవి కంటి ఆస్పత్రి, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్, టీబీ అండ్ చెస్ట్ హాస్పిటల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సుల్తాన్ బజార్ మెటర్నిటీ హాస్పిటల్, పెట్లబుర్జు మెటర్నిటీ హాస్పిటల్, ఈఎన్‌టీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ లు అనుబంధంగా విశేష వైద్య సేవలను అందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉస్మానియా హెల్త్ హబ్ గా , బ్రాండ్ గా ఉస్మానియా డాక్టర్లు గుర్తింపు తెచ్చారన్నారు. ఉస్మానియా అనుబంధ ఆసుపత్రులలో వైద్య సేవల బలోపేతానికి చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై సుదీర్ఘంగా చర్చించారు . ఆసుపత్రి లోని పాత భవనాల పరిస్థితి పై క్షేత్ర స్థాయి లో తక్షణమే పర్యటించి వచ్చే రెండు , మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ఆసుపత్రి లో మౌలిక సదుపాయాల కల్పన, హెచ్ఆర్, ఎక్విప్ మెంట్లు రిపేర్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్, శానిటేషన్, డ్రైనేజీ సిస్టం, ఇన్ఫ్రా, అంతర్గత రోడ్లు, రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఓపీ, ఐపీ, సేవల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ లో మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. ఉస్మానియా బ్రాండ్ ఇమేజ్ కు అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు పూర్వవైభవాన్ని తెచ్చేందుకు వైద్య శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. సరోజినీ దేవి కంటి హాస్పిటల్ పై మంత్రి దామోదర్ రాజనర్సింహా చర్చించారు. ఆధునిక కాలానికి అనుగుణంగా ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కు పెద్దపీట వేయాలన్నారు. ఓపీ, ఐపీ, ఎక్విప్ మెంట్స్ రిపేర్లు, సాంకేతిక సిబ్బంది, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, ఉన్న పాత భవనాల పరిస్థితిపై చర్చించారు. ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ డా క్రిస్టినా, డీఎంఈ డా నరేంద్ర కుమార్, ఉస్మానియా అనుబంధ మెడికల్ కాలేజీల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



# ఉత్తరాఖండ్ వర్షాలకు 15మంది మృతి

- 900 మందిని కాపాడిన సహాయక సిబ్బంది

డెహ్రాడూన్, సెప్టెంబర్17 (జనంసాక్షి) : ఉత్తరాఖండ్‌లో సోమవారం రాత్రి కురిసిన క్లౌడ్ బరస్ట్ భారీ వర్షాలకు 15 మంది మృతి చెందారు. డెహ్రాడూన్‌లో 13 మంది, పిథోరాఘర్, నైనిటాల్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 15 మంది చనిపోయారని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ విభాగం బుధవారం తెలిపింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డాయి. వరదల వల్ల రోడ్లు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ వరదల్లో 16 మంది గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. రెస్క్యూ ఆపరేషన్స్‌లో 900 మందిని కాపాడారు. ముగ్గురికి తీవ్ర గాయాలైతే వారిని చికిత్స కోసం ఆసుపపత్రికి తరలించారు. నదులు ప్రవాహంతో డెహ్రాడూన్‌లో ఇళ్లకి నీరు చేరి నివాసితులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కాగా, మంగళవాం ప్రేమ్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో కార్మికులను తీసుకెళుతున్న ట్రాక్టర్ ట్రాలీ టన్స్ నది మధ్యలో చిక్కుకుంది. నీటి ప్రవాహంతో కొందరు కార్మికులు గల్లంతయ్యారు. ఎనిమిది మంది మృతి చెందారు. వారిలో నలుగురు మహిళలున్నారు. ఆ ఎనిమిది మంది మృతదేహాలను పోలీసులు వెలికితీశారు.

# తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ

- అదే పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ నియంతృత్వంపై పోరు
- తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఎగరేసిన కెటిఆర్



హైదరాబాద్, సెప్టెంబర్17 (జనంసాక్షి) : తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం అన్నారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొందరు విమోచనం అని, మరికొంత మంది విలీనం అని, ఇంకొంత మంది విద్రోహమని రకరకాలుగా అనవచ్చు గాక, కానీ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆనాడు లక్షలాది మంది పాల్గొని వేలాది మంది అసువులు భాసారు. ఆనాటి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి మనకు స్వేచ్ఛా వాయువులు వచ్చాయంటే ఆనాటి అమరవీరుల త్యాగాలు మనందరికి ఆదర్శం. వారందరికి బీఆర్ఎస్ తరపున, కేసీఆర్, ప్రతి గులాబీ సైనికుడి తరపున వారి అమరత్వానికి శిరసు వంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. సాయుధ పోరాటం నుంచి మొదలుపెడితే తొలి దశ తెలంగాణ ఉద్యమమైనా, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలిదశ పోరాటమైనా, ఇవాళ్టికి కూడా ఈ నియంతృత్వ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమైనా.. వీటన్నింటికి బీజం పడ్డది తెలంగాణ సాయుధ పోరాటంతోనే. ఒక షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, ఆరుట్ల కమలమ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి ఎంతో మంది పెద్దలు ఆనాడు పోరాట స్ఫూర్తితో బండెనక బండికట్టి అని అద్భుతమైన కవితలు రాశారు. ఆ పెద్దల స్ఫూర్తితో, మరి భవిష్యత్‌లో కూడా ప్రజాస్వామిక ఉద్యమాలు నిర్మిస్తూ తెలంగాణలో తిరిగి సంక్షేమ రాజ్యం రావాలని, రైతు రాజ్యం రావాలని, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే, నియంతృత్వ పోకడలు లేని ప్రజాస్వామ్య వాతావరణం రావాలని ఆశయంతో కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా మా విద్యార్థి తమ్ముళ్లు, చెల్లెళ్లు పోరాడుతున్నారు. ఈ

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీలో విఫలమైంది. ఈ క్రమంలో దిక్కుతోచక రౌండ్ టేబుల్ సమావేశం పెట్టు-కుంటే నియంతృత్వ పోకడలతో విద్యార్థులతో అరెస్టు చేస్తున్న దుర్మార్గమైన వ్యవస్థ మన కళ్ల ముందున్నది. రైతులు ఇవాళ అల్లాడిపోతుంటే వారిని పట్టించుకోకుండా ఒలింపిక్స్ గురించి మాట్లాడుకుంటున్న ఒక నీతిమాలిన ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్నది. ఇలాంటి నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఒకరు విమోచనం, ఒకరు విలీనం, ఒకరు విద్రోహం అనొచ్చు.. కానీ రాచరిక వ్యవస్థలో నుంచి ప్రజాస్వామిక వ్యవస్థలోకి సమైక్యమైన రోజు కాబట్టి జాతీయ సమైక్యతా దినోత్సవంగా పాటిస్తున్నాం. గతంలో ప్రభుత్వంలో కూడా ఈ విధంగానే పిలిచాం. ఆ రోజు జెండా ఎగురవేశాం.. ఇవాళ కూడా జెండా ఎగురవేశాం. ఆనాటి పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరోసారి పోరాటం చేయవలసిన అవసరం ఉన్నది అని కేటీఆర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కెఇఆర్ సురేశ్ రెడ్డి, మధుసూధనాచారి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ తదితర పలువురు నేతలు పాల్గొన్నారు.

## గ్యాంగ్‌స్టర్ ఛోటారాజన్ బెయిల్ రద్దు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) : గ్యాంగ్‌స్టర్ చోటారాజన్ కు 2001 జయశెట్టి హత్య కేసులో ముంబై హైకోర్టు ఇచ్చిన బెయిలును సుప్రీంకోర్టు బుధవారంనాడు రద్దు చేస్తూ కీలక తీర్పు చెప్పింది. హోటల్ వ్యాపారి జయశెట్టి హత్యకు సంబంధించిన కేసులో గత ఏడాది మేలో ప్రత్యేక కోర్టు చోటా రాజన్‌ను దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును ముంబై హైకోర్టులో చోటారాజన్ సవాలు చేశారు. 2024 అక్టోబర్ 23న ముంబై హైకోర్టు చోటారాజన్ విధించిన శిక్షను సస్పెండ్ చేస్తూ బెయిలు మంజూరు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సీబీఐ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్ దీనిపై విచారణ జరిపింది.

# అమరుల ఆశయాలను కొనసాగిస్తున్నాం

- సిద్దిపేటలో జెండా ఎగురేసిన మంత్రి పొన్నం



సిద్దిపేట, సెప్టెంబర్ 17 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమం అనేది నీళ్ళు, నిధులు, నియామకాలు, ప్రత్యేక్య రాష్ట్రం కోసం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ లో జాతీయ జెండాను పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం బైరాన్ పల్లి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 1948 ఆగస్టు 27న వందలాది మంది అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు, తెలంగాణ అమరవీరులకు జోహార్లు అని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రజా పాలన దినోత్సవం గా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, సిపి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీనం సందర్భంగా సిద్దిపేట జిల్లా వీర బైరాన్ పల్లి అమరవీరుల స్థూపం, చారిత్రాత్మక బురుజు వద్ద ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, డిసిపి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పూజల హరికృష్ణ, ఇతర ముఖ్య నేతలతో కలిసి అమరవీరులకు నివాళులర్పించారు.

## తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి: కవిత



హైదరాబాద్, సెప్టెంబర్17 (జనంసాక్షి) : తెలంగాణ చరిత్రను బిజెపి వక్రీకరిస్తోందని తెలంగాణ జాగృతి నేత కవిత మండిపడ్డారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో విలీన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాను కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవమేనని స్పష్టం చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి ఎప్పటికీ బిజెపి వ్యతిరేకం కాదని, మతవిద్వేషాలను బిజెపి రెచ్చగొడుతోందని విమర్శించారు. తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీపై ప్రేమ లేకపోతే దుష్ప్రచారం ఆపాలని బిజెపి నేతలకు చురకలంటించారు. కేంద్రానికి సీఎం రేవంత్ లేఖ రాయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో విమోచన దినోత్సవాలు బిజెపి వాళ్లు చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణలో రెచ్చగొట్టడానికి బిజెపి వాళ్లు విమోచన దినోత్సవం జరుపుతున్నారని దుయ్యబట్టారు.

# మహిళల భద్రతలో విశాఖ అగ్రస్థానం

- పివి ఆర్థిక సంస్కరణలతో ముందడుగు
- ఐటి రంగంలో భారత్ బలంగా ఉంది
- వికసిత్ భారత్ లక్ష్యంతో మోడీ కృషి
- సిఎం చంద్రబాబు నాయుడు




విశాఖపట్నం, సెప్టెంబర్17 (జనంసాక్షి) : మహిళల భద్రతలో విశాఖ అగ్రస్థానంలో ఉన్నట్లు ఇటీవల సర్వేలో తేలిందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వివిధ వ్యాపార ఆలోచనలతో యువత ముందుకొచ్చిందని అన్నారు. విశాఖలో అద్భుత వాతావరణం ఉందని, సముద్రం, అందమైన కొండలు ఉన్నాయని, అరకు కాఫీ కూడా చాలా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. 1991 లో పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని, రెండో తరం సంస్కరణలను తాను తీసుకువచ్చానని చెప్పారు. ఎపికి చెందిన ఆర్థిక మంత్రి దేశ పురోగతిలో తన వంతు పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని ప్రధాని మోడీ 75 వ జన్మదిన శుభాకాంక్షలు చంద్రబాబు తెలియజేశారు. ప్రధాని మోడీ దేశానికి అతి పెద్ద ఆస్తి అని ప్రశంసించారు. గత నాయకులు టెలికామ్ రంగంలో సంస్కరణలు చేపట్టలేదని, వాజ్ పేయీ హయాంలో టెలికామ్ రంగంలో సంస్కరణలు మొదలయ్యాయని పేర్కొన్నారు. మౌలిక సౌకర్యాల రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, ఐటి రంగంలో భారత్ చాలా బలంగా ఉందని అన్నారు. గణితం, ఆంగ్లంలో ముందుండడం కలిసి వస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడానికి, పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కంకణం కట్టుకుని పనిచేస్తున్నారని చంద్రబాబు నాయుడు అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆబిడ్డల ఆరోగ్యం ఏ విధంగా కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు- తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో భారత్ ను 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో ఆర్థిక వ్యవస్థకు తీసుకువచ్చారని... 2047 నాటికి నెంబర్ వన్ గా తయారవుతామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఫైనాన్స్ మినిస్టర్ మహిళలే అని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సమస్యతో కుటుంబం మొత్తం మీద భారం పడుతుందని.. అందుకోసం ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకు వస్తున్నామన్నారు. ఆడబిడ్డలు ఆరోగ్యం కోసం ఈ మెడికల్ క్యాంప్ ప్రారంభించామన్నారు. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ కోసం పని చేస్తున్నామన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370